




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 26 శనివారం | ఏప్రిల్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 222

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur







# ఖాళేశ్వరం!?

- సంక్షోభంలో కాళేశ్వరం ప్రాజెక్ట్..
- దిగ్భ్రాంతి కలిగించిన ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్
- ప్రొటెక్షన్ అథారిటీ సమర్పించిన నివేదిక
- మేడిగడ్డ (లక్ష్మీ), అన్నారం (సరస్వతి), సుందిళ్ల (పార్వతి)
- బ్యారేజీలు ప్రస్తుతం ఉపయోగించడానికి పనికిరావు
- బ్యారేజీలను వినియోగిస్తే కూలిపోయే ప్రమాదం
- ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ, డిజైన్‌లో స్పష్టమైన లోపాలు

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఈ ప్రాజెక్టును తన కలల ప్రాజెక్టుగా అభివర్ణించారు, ఇది తనను ఎల్లకాలం అధికారంలో ఉంచుతుందని విశ్వసించారు. వరుసగా మూడోసారి విజయం సాధించి తెలంగాణ రైతాంగం మద్దతు తనకే ఉంటుందని ఆశించారు. అయితే, ఎన్నికలకు కొద్ది రోజుల ముందు కాళేశ్వరం ప్రాజెక్టులోని

# చివరిదాకా పోరాటం.. తప్పని పరాజయం



- హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీకి పరాభవం
- 28 ఓట్లు ఉంటే 25 ఓట్లు మాత్రమే బీజేపీకి..3 ఓట్లు ఏమయ్యాయి
- ముగ్గురు సొంత పార్టీ నాయకుడికి ఓటేయలేదు
- ఎంఐఎం పార్టీ సునాయాసంగా ఎమ్మెల్యే సీటు కైవసం

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో బీజేపీ పోరాడి ఓడింది. అదే సమయంలో చాలా వ్యూహాత్మకంగా అడుగులు వేసి.. ముందు నుంచి చాలా భరోసాతో ఉన్న ఎంఐఎం.. సునాయాసంగా విజయం దక్కించుకుంది. అయితే.. బీజేపీకి అనుకూలంగా మొత్తం 28 ఓట్లు పడాల్సి ఉండగా.. కేవలం 25 మాత్రమే పడ్డాయి. అయితే.. వీరిలోనూ.. ముగ్గురు సొంత పార్టీ నాయకుడికి ఓటేయలేదని తెలుస్తోంది. గత బుధవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తంగా.. 112 మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 31 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు.. ఇతర ఎక్స్ అఫిషియో సభ్యులు ఉన్నారు. వీరిలోనూ ఒక్క బీజేపీకి చెందిన వారే ఆరుగురు ఉన్నారు. మిగిలిన 22 మంది బీజేపీ కార్పొరేటర్లతో కలుపుకుంటే.. ఆ పార్టీ తరపున ఎమ్మెల్సీగా బరిలో నిలిచిన గౌతం రావుకు 28 ఓట్లు గ్యారెంటీగా వచ్చి తీరాలి. కానీ.. శుక్రవారం ఉదయం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో గౌతం రావుకు కేవలం 25 ఓట్లు మాత్రమే పడ్డాయి. అంటే.. మరో మూడు ఓట్లు పడలేదు. వీరిలో రాజాసింగ్

# యుద్ధ మేఘాలు

- పాకిస్థాన్‌పై తాడోపేడో తేల్చుకునే స్థితిలో భారత్
- భారత్ కఠిన వైఖరికి బెంబేలెత్తుతున్న పాక్
- ఇప్పటికే పాక్‌పై కఠినమైన నిబంధనలు..వీసాల రద్దు
- సింధు జలాల నిలిపివేత..పాక్ ప్రజలకు నో ఎంట్రీ
- పాక్ కూడా కఠినమైన నిబంధనలు అమలు

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

జమ్ము కాశ్మీర్ అనంత్ నాగ్ జిల్లాలోని పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన తర్వాత భారత ప్రభుత్వం ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమవుతోంది. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. ఉగ్రదాడిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన, వెనక ఉండి సహకారం అందించిన అందర్నీ వదిలి పెట్టే ప్రసక్తే లేదని.. ఉగ్రవాదులను మట్టిలో కలిపే సమయం ఆసన్నమైందని హెచ్చరికలు జారీ చేశారు. ఈసారి అంతకుమించి.. దాయాది దేశం భారత్‌పై దశాబ్దాలుగా యుద్ధకాండ కొనసాగిస్తూనే ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి సరిహద్దుల గుండా అక్రమంగా చొరబడి కాల్పులకు పాల్పడుతూనే ఉన్నారు తీవ్రవాదులు. నిత్యం జమ్ముకాశ్మీర్‌లో ఏదో ఒక అలజడి రేకెత్తుతూనే ఉంది. అయినా భారత ప్రభుత్వం ఎప్పుడూ పాకిస్థాన్‌పై కఠినంగా వ్యవహరించలేదు. భారత్ పై పాకిస్థాన్ దాడులు జరిపిన ప్రతిసారీ ఇరువర్గాల మధ్య దౌత్య పరమైన చర్చలతోనే ముగించింది. కానీ పచ్చని, ఆహ్లాదకరమైన పహల్గాం బైసరన్ వ్యాలీలో నెత్తుటి మరకలు చూసిన ప్రధాని మోదీ ప్రభుత్వం ఈసారి కఠినంగా వ్యవహరించాలని నిర్ణయం తీసుకుంది. అటు పాకిస్థాన్‌ను దెబ్బకు దెబ్బ తీయాలని సోషల్ మీడియా శివాలెత్తుతోంది.

# ఏపీలోని మీడియా సంస్థల్లో 80% చంద్రబాబు వైపే

- ప్రైవేటు సంస్థ సర్వేలో తేల్చిన నిజమిది..
- 2024 ఎన్నికలకు ఏడాది వరకు రాష్ట్రంలో 550 వ్యక్తిగత చానెళ్లు
- ఇప్పుడు ఆ సంఖ్య 2202కు చేరిందని సర్వే నివేదిక
- రాజకీయ విశ్లేషకులు.. ప్రొఫెసర్లు, రాజకీయ నాయకులు, సామాజిక వుద్యమకారులు ప్రత్యక్షంగానో..పరోక్షంగానో చంద్రబాబుకు మద్దతు

2



అమరావతి-నవభూమిబ్యూరో

సీఎం చంద్రబాబుకు మద్దతుగా గళం వినిపించేందుకు పార్టీ నాయకులు ఉన్నారు. కార్యకర్తలు ఉన్నారు. ఐటీ విభాగం కూడా.. ఉంది. అయితే, తాజాగా నిర్వహించిన ఓ ప్రైవేటు సంస్థ సర్వేలో ఏపీలోని మీడియా సంస్థల్లో 80 శాతం వరకు చంద్రబాబుకు మద్దతుగా ఉన్నట్టు తేలింది. ఇది చిన్న విషయమని కొట్టి పారేసేందుకు వీలు లేదని.. సర్వే చెప్పడం గమనార్హం. గతంలోనూ మీడియాను మేనేజ్ చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డికి అప్పట్లో 45-55 శాతం వరకు మాత్రమే మీడియా అండగా నిలిచిందని సర్వే పేర్కొంది. ఆది నుంచి కూడా.. అంటే.. టీడీపీలో సంక్షోభం ఏర్పడి.. ఆ పార్టీ పగ్గాలను చంద్రబాబు చేపట్టిన త ర్వాత నుంచి ఓ వర్గం మీడియా ఇప్పటి వరకు చంద్రబాబు పక్షానే నిలబడినట్టు సర్వే తెలిపింది. దీనిలో ప్రధాన పత్రికలు, చానెళ్లు ఉన్నాయని పేర్కొంది. అయితే.. వీటితోపాటు.. ఇప్పుడు వెబ్ సైట్లు సహా.. పలు సామాజిక మాధ్యమాలు. కూడా చంద్రబాబుకు మద్దతుగా ఉన్నాయని పేర్కొనడం గమనార్హం. యూట్యూబ్ ఆవిర్భావం, వాడుక మరింత పెరిగిన దరిమిలా.. సొంత ఛానెళ్లు ఏర్పాటు చేసుకున్న వారు పెరిగారు.

# ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరి రంగన్ కన్నుమూత

- అనారోగ్యంతో కన్నుమూసిన ఇస్రో మాజీ ఛైర్మన్
- అభిమానుల సందర్శనార్థం బెంగళూరులో ఆర్ఆర్ఐలో పార్థివదేహం
- పద్మశ్రీ,పద్మభూషణ్,పద్మవిభూషణ్ గ్రహీత,రాజ్యసభ సభ్యులు
- పలు కీలక మిషన్లలో పాలు పంచుకున్న కస్తూరి రంగన్
- రాష్ట్రపతి ముర్ము,ప్రధాని మోదీతో పాటు పలువురి సంతాపం

2



**బెంగళూరు-నవభూమిబ్యూరో:** ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కె. కస్తూరి రంగన్ శుక్రవారం అనారోగ్యంతో కన్నుమూశారు. బెంగళూరులోని ఆయన సొంత ఇంట్లోనే ఉదయం 10.43కు ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కస్తూరి రంగన్‌కు 84 ఏళ్లు. ఆయన మృతదేహాన్ని అభిమానుల సందర్శన కోసం బెంగళూరులోని రామన్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ (ఆర్ఆర్ఐ)లో ఉంచనున్నారు. ఆదివారం ఉదయం ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. 1994లో కస్తూరి రంగన్ ఇస్రో ఐదో ఛైర్మన్‌గా నియమితులయ్యారు. 2003 వరకూ తొమ్మిదేళ్ల పాటు ఆయన ఇస్రో ఛైర్మన్‌తో పాటు ఖగోళశాఖకు కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఈ కాలంలో కస్తూరి రంగన్ పలు కీలక మిషన్లలో పాలు పంచుకున్నారు. భూమి పరిశీలనకు భారత్ పంపిన రెండు ఉపగ్రహాలు భాస్కర 1,2 రెండింటికీ ఆయన ప్రాజెక్ట్ డైరెక్టర్ గా వ్యవహరించారు. అలాగే భారతదేశ తొలి రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం ఐఆర్ఎస్-1ఏకు సారథిగా కూడా పనిచేశారు. బోంబే యూనివర్సిటీ నుంచి సైన్స్ పట్టభద్రుడైన కస్తూరిరంగన్‌కు హానర్స్, ఎమ్మెస్సీ డిగ్రీలు కూడా ఉన్నాయి. 1971లో అహ్మదాబాద్ లోని ఫిజికల్ రీసెర్చ్ ల్యాబ్ లో పనిచేస్తున్నప్పుడు ఆయన ఎక్స్ పరిమెంటల్ హై ఎనర్జీ అస్ట్రానమీలో డాక్టరేట్ కూడా పొందారు. కస్తూరిరంగన్ ఇస్రో ఛైర్మన్‌గా పనిచేసినప్పుడు, పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ తొలిసారి ప్రయోగించారు. అలాగే జియోసింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్

# భారత్‌లోకి చొరబడ్డ 51 మంది ఉగ్రవాదులు

- ఏటా వందల సంఖ్యలో చొరబడుతున్న ఉగ్రవాదులు
- వీరిని ఏరిపారేయడం కేంద్రానికి పెను సవాల్
- ఇప్పటి నుంచే రెప్పవాలని నిఘా..

2

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

జమ్ము కాశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన తర్వాత భారత ప్రభుత్వం ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమవుతోంది. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే ప్రధాని మోదీ ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన, వెనక ఉండి సహకారం అందించిన అందర్నీ వదిలి పెట్టే ప్రసక్తే లేదని.. ఉగ్రవాదులను మట్టిలో కలిపే సమయం ఆసన్నమైందని హెచ్చరికలు జారీ చేశారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలతో అటు పాకిస్థాన్ అప్రమత్తమైంది. సరిహద్దుకు బలగాలను మోహరిస్తోంది. ఇప్పటికే పాకిస్థాన్ సైనికులకు సెలవులను రద్దు చేసింది. దీంతో జమ్ము కాశ్మీర్ సరిహద్దులో యుద్ధవాతావరణం ఏర్పడింది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఇరు దేశాల ప్రజలు అప్రమత్తంగా ఉన్నారు. మరో రెండు మూడు రోజుల్లో కీలక పరిణామాలు జరిగే అవకాశం ఉందని సమాచారం. అయితే ఏటా భారత్‌లోకి అనేక మంది ఉగ్రవాదులు చొరబడుతుండటం కేంద్ర ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ఇప్పటికే భారత్ లో అక్రమంగా 122 మంది దాకా విదేశీ ఉగ్రవాదులు నక్కి



సంఘటనాస్థలంలో అమిత్ షా

# వేట షురూ!

- భారత్‌లో ఉన్న పాక్ పౌరులను వెనెక్కి పంపేయాలి
- రాష్ట్రాలకు అమిత్ షా కీలక ఆదేశాలు..!
- వ్యక్తిగతంగా సీఎంలకు ఫోన్ చేసిన అమిత్‌షా

2

**అనంత్‌నాగ్-నవభూమి:** జమ్మూకాశ్మీర్‌లోని అనంత్ నాగ్ జిల్లాలో ఉన్న పహల్గాంలో 26 మంది భారతీయ పౌరులపై తీవ్రవాదులు కాల్పులు జరిపి పొట్టనపెట్టుకున్న ఘటన దేశవ్యాప్తంగా అలజడి రేపుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పాకిస్తాన్‌తో అన్ని బంధాల్ని పూర్తిగా తెంచేసుకోవడంతో పాటు ఇరుదేశాల సరిహద్దులు మూసేయడం, మన దేశంలో ఉన్న పాకిస్తాన్ పౌరుల్ని బహిష్కరించడం వంటి చర్యలున్నాయి. ఇదే క్రమంలో హెూంమంత్రి రాష్ట్రాలకు కీలక ఆదేశాలు ఇచ్చారు.

# పొంగులేటి పేరిట వసూళ్లు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పీఏలమని చెప్పి మోసాలు
- బుస్సా వెంకటరెడ్డి, మచ్చ సురేశ్‌లను అరెస్టు చేసిన నాగోల్ పోలీసులు
- అధికారులకు ఫోన్లు చేసి పనులు చేయాలని, వసూళ్లకు ఒత్తిడి
- అనుమానంతో అధికారుల ఆరా.. మంత్రి డీపీఓ ఫిర్యాదుతో అరెస్ట్

2



# విడదల రజనీకి భారీ ఊరట..!

- మంత్రిగా ఉన్న సమయంలో డబ్బులకోసం బెదిరించారని ఏసీబీ కేసు
- అదే కేసులో రజనీ మరిది గోపినాథ్ అరెస్ట్
- విడదల రజనీని అరెస్టు చేస్తారని వదంతులు వ్యాప్తి
- హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ పొందిన రజనీ

2



అమరావతి-నవభూమిబ్యూరో

ఏపీలో గత వైసీపీ ప్రభుత్వంలో తొలిసారి ఎమ్మెల్యే అయి మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించిన విడదల రజనీకి కూటమి ప్రభుత్వంలో మాత్రం చిక్కులు తప్పడం లేదు. ముఖ్యంగా తాను మంత్రిగా ఉన్న సమయంలో డబ్బుల కోసం బెదిరింపులకు దిగిన ఓ ఘటనలో ఏసీబీ నమోదు చేసిన కేసును రజనీ ఎదుర్కొంటున్నారు. ఇదే కేసులో ఏసీబీ తాజాగా ఆమె మరిది గోపీనాథ్‌ను అరెస్టు చేసింది. దీంతో రజనీ అరెస్టు కూడా ఖాయం అనుకుంటున్న సమయంలో ఆమెకు ఊరట లభించింది. వైసీపీ హయాంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో శ్రీలక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ యజమానాన్ని డబ్బుల కోసం బెదిరించిన వ్యవహారంలో విడదల రజనీతో పాటు ఆమె మరిది గోపీనాథ్‌పై ఏసీబీ గతంలో కేసు నమోదు చేసింది. ఈ కేసులో రజనీతో పాటు పలువురిని నిందితులుగా చేర్చింది. తాజాగా ఇదే కేసులో మరిది గోపీనాథ్ అరెస్టు కావడంతో రజనీ అలర్ట్ అయ్యారు. హైకోర్టులో ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఆ కేసులోనే ఆమె మరిది అరెస్ట్ !" ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో మాజీ

# జగన్‌ను రాజకీయాల్లో లేకుండా చేస్తాం

- ఆదినారాయణరెడ్డి వార్నింగ్..!
- సిమెంట్ పరిశ్రమల నంచి వైసీపీ నేతలు లబ్ధి
- వాళ్ల వల్లే వైసీపీ త్వరలోనే కుప్పకూలిపోతుంది
- కాశ్మీర్ ఉగ్రవాదుల కంటే ఇక్కడి వైసీపీ వాళ్లు డేంజర్
- వైసీపీకి ఈసారి 11 సీట్లు కూడా రావని ఆది ఎద్దేవా

2

**కడప-నవభూమిబ్యూరో:** ఏపీ రాజకీయాల్లో కడప రాజకీయాలే వేరు. ఇక్కడ ఏం జరిగినా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతూనే ఉంటుంది. ఈ నేపథ్యంలో కడపలో ఒకప్పుడు వైసీపీ తరపున గెలిచి ఆ తర్వాత పార్టీని వీడి టీడీపీలో చేరి ప్రత్యర్థిగా మారి ఇప్పుడు బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్న ఆదినారాయణరెడ్డి ఈ మధ్య వరుస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. తాజాగా కడప జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీలను మామూళ్ల కోసం, కాంట్రాక్టుల కోసం బెదిరిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆది నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ కూడా విసిరారు. అయితే కడప జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీల వ్యవహారంలో తనపై వచ్చిన ఆరోపణలకు సమాధానంగా వైసీపీని తెరపైకి తెచ్చిన ఆదినారాయణరెడ్డి ఇవాళ తన మాటల దాడిని మరింత

# ఐపీఎస్ పీఎస్సార్‌కు సీఐడీ కోర్టు షాక్..!

- ముంబై నటి కాదంబరీ జెత్వానీపై వేధింపుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో పీఎస్సార్
- 3 రోజుల సీఐడీ కస్టడీకి అనుమతించిన కోర్టు

2




అమరావతి-నవభూమిబ్యూరో

ఏపీలో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులకు మరో షాక్ తగిలింది. ఇప్పటికే ముంబై నటి కాదంబరీ జెత్వానీపై వేధింపుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో ఆయన్ను సీఐడీ అరెస్టు చేసి విచారణ చేస్తోంది. ఇందులో ఆయన పలు కీలక విషయాలు వెల్లడించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రిమాండ్‌లో ఉన్న ఆయన్ను తమ కస్టడీకి ఇస్తే మరిన్ని విషయాలు రాబడతామని సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడ కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. ముంబై నటి కాదంబరీ జెత్వానీపై వేధింపుల వెనుక ఎవరున్నారు ? ఆమెను వేధించేందుకు కుట్ర ఎక్కడ జరిగింది, దాన్ని ఎలా అమలు చేసారనే విషయాలపై మాజీ ఇంటెలిజెన్స్ ఛీఫ్ అయిన పీఎస్సార్ ఆంజనేయులు నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు తమ కస్టడీకి

# పాకిస్తానీలు వెంటనే దేశం వదిలి వెళ్లిపోవాలి.. తెలంగాణ డీజీపీ ఆదేశాలు



హైదరాబాద్-నవభూమి:పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాకిస్తాన్‌ను అన్ని రకాలుగా దెబ్బ కొట్టడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా పాకిస్తానీ వీసాలను రద్దు చేసింది. 48 గంటల్లో పాకిస్తానీలు దేశం వదలి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఇక, తెలంగాణ పోలీసులు శాఖ కూడా వీసాల రద్దు నేపథ్యంలో రాష్ట్రంలో ఉంటున్న పాకిస్తానీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో .. 'తెలంగాణలో ఉన్న పాకిస్తానీలు వెంటనే తమ దేశానికి వెళ్లిపోవాలి. పాకిస్తానీల వీసాలు 27 తర్వాత పనిచేయవు. మెడికల్ వీసాల మీద ఉన్నవారికి ఏప్రిల్ 29 వరకు మాత్రమే గడువు ఉంది. లాంగ్ టర్మ్ వీసాలు కలిగిన వారికి ఈ నిబంధన వర్తించదు. పాకిస్తానీలు తమ దేశానికి అటారి బార్డర్ నుంచి వెళ్లొచ్చు. ఈనెల 30 వరకు అటారి బార్డర్ తెరుచుకుని ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పాకిస్తానీలు తమ దేశానికి వెళ్లిపోవాల్సిందే. ఒకవేళ అక్రమంగా తెలంగాణలో ఉంటే న్యాయపరంగా చర్యలు తీసుకుంటాము' అని స్పష్టం చేశారు.




## ఎమ్మెల్సీ ఎన్నికల్లో.. ఎంఐఎం గెలుపు..

హైదరాబాద్-నవభూమి:హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) పార్టీ తన పట్టును మరోసారి చాటుకుంది. ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్-ఉల్-హసన్ 63 ఓట్లతో ఘన విజయం సాధించారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థి గౌతమ్ రావు కేవలం 25 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో 78.57 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 112 ఓట్లకు గాను 88 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో 66 మంది కార్పొరేటర్లు, 22 మంది ఎక్స్-అఫీషియో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ, కాంగ్రెస్ , ఎంఐఎం కార్పొరేటర్లు .. ఎక్స్-అఫీషియో సభ్యులు పోలింగ్‌లో పాల్గొన్నారు. అయితే, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్పొరేటర్లు .. ఎక్స్-అఫీషియో సభ్యులు ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు హైదరాబాద్ రాజకీయాల్లో ఎంఐఎం పార్టీ స్థిరమైన ఆధిపత్యాన్ని స్పష్టం చేశాయి. ఎంఐఎం పార్టీకి స్థానిక సంస్థల్లో ఉన్న బలమైన మద్దతును ఈ విజయం మరోసారి రుజువు చేసింది. ఎంఐఎం పార్టీ అభ్యర్థి రియాజ్-ఉల్-హసన్ తన విజయాన్ని హైదరాబాద్ ప్రజలకు అంకితం చేశారు. నగరంలోని స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. బీజేపీకి ఈ ఓటమి నిరాశ కలిగిం చింది. హైదరాబాద్‌లో తమ పార్టీ బలాన్ని పెంచుకోవడానికి మరింత కృషి చేయాలని బీజేపీ నాయకులు నిర్ణయించుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికలకు దూరంగా ఉండటం కూడా చర్చనీయాంశంగా మారింది. ఈ ఎన్నికల ఫలితాలు రాబోయే ఎన్నికల్లో హైదరాబాద్ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎంఐఎం పార్టీ తన పట్టును నిలుపుకుంటుందా.. బీజేపీ , బీఆర్ఎస్ పార్టీలు తమ వ్యూహాలను మార్చుకుంటాయా అనేది చూడాలి. హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈసారి ప్రత్యేకంగా నిలిచాయి. దాదాపు 22 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఎన్నికలు ఏప్రిల్ 23న జరిగాయి. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అనూహ్యంగా తమ అభ్యర్థిని బరిలోకి దింపడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) పార్టీకి ఈ ఎన్నికల్లో బలమైన ఆధిక్యం ఉంది. మొత్తం 112 ఓట్లలో 49 ఓట్లు ఎంఐఎం పార్టీకి ఉన్నాయి. ఆ తర్వాత స్థానంలో బీజేపీ నిలిచింది. కాంగ్రెస్ పార్టీ కూడా ఈ ఎన్నికల్లో తమ ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నించింది. చివరకు ఈ విజయం ఎంఐఎంకే దక్కింది.

## అఘోరికి ఖైదీ నెంబర్ 12121

హైదరాబాద్-నవభూమి: చంచల్‌గూడ జైల్లో అఘోరికి పోలీసులు ప్రత్యేక బ్యారక్ లో ఉంచారు. అఘోరికి ఖైదీ నెంబర్ 12121 కేటాయించారు. రెండు రోజులుగా నిద్రపోకుండా గట్టి గట్టిగా కేకలు పెడుతోంది. తన భార్య వర్షిణి తో ఎప్పుడు ములాఖత్ చేయిస్తారని జైలు అధికారులతో వాగ్వాదానికి దిగింది. అఘోరిపై నమోదైన కేసుకు సంబంధించి సుదీర్ఘంగా విచారించిన తర్వాత న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో అఘోరిని పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా వర్షిణితో ములాఖత్ చేయలేమంటూ అధికారులు అఘోరికి తేల్చి చెప్పారు. కాగా వర్షిణి తల్లిదండ్రుల వద్దకు వెళ్లడానికి నిరాకరించడంతో ఆమెను భరోసా సెంటర్‌లో ఉంచారు. మరోవైపు శుక్రవారం మధ్యాహ్నం 2:30 గంటల తర్వాత అఘోరి బెయిల్ పిటిషన్ కోర్టులో విచారణకు వచ్చే అవకాశముంది. కాగా ఒక మహిళవద్ద పూజలు చేస్తానని చెప్పి అఘోరి రూ. 10 లక్షలు తీసుకుంది. మోసపోయినట్లు గ్రహించిన బాధిత మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆమెను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆమెను చంచల్‌గూడ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. జైల్లో అఘోరీ ప్రవర్తనపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. చంచల్ గుడా జైల్‌ను నిన్న (గురువారం) మహిళ కమిషన్ చైర్ పర్సన్ నెరేళ్ల శారదా సందర్శించారు. అక్కడ మహిళా ఖైదీలకు ఎలాంటి సదుపాయాలు ఉన్నది అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అఘోరీని ఉంచిన బ్యారక్‌ను కూడా నెరేళ్ల శారదా పరిశీలించారు.

## యుద్ధ మేఘాలు

(1వపేజీ తరువాయి)దీంతో మోదీ సర్కార్.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఎప్పుడూ తీసుకోని సంచలన నిర్ణయాలను తీసుకున్నారు. ప్రధాని మోదీ మాటిచ్చారు.. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు. "మేము ప్రతి ఉగ్రవాదిని గుర్తిస్తాం. వెంబడిస్తాం. వారిని మట్టిలో కలిపేస్తాం. వాళ్లకు సహకరించిన, ప్రోత్సహించిన వారినీ వదిలిపెట్టం" అని ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ ను అష్ట దిగ్బంధనంలోకి నెట్టి ఉక్కిరిబిక్కిరి చేయాలని భారత ప్రభుత్వం భావించింది. ఈ మేరకు 7 సంచలన నిర్ణయాలు తీసుకుంది. సింధూ నదీ జలాల ఒప్పందం రద్దు భారత్- పాకిస్థాన్ మధ్య ఉన్న సింధూ నదీ జలాల ఒప్పందాన్ని భారత ప్రభుత్వం రద్దు చేసింది. నీటిని తక్షణమే నిలిపి వేస్తున్నట్లు ప్రకటించింది. 1960 లో ఇండస్ వాటర్ ట్రీటీ ద్వారా భారత్, పాకిస్థాన్ ల మధ్య ఈ ఒప్పందం ఏర్పడింది. సింధూ నదీ జలాలు ఈ ఒప్పందం ఆధారంగా ఇరు దేశాలు పంచుకుంటాయి. అధికారులు తగ్గింపు.. పాకిస్థాన్‌కు చెందిన ముగ్గురు సీనియర్ మిలిటరీ అధికారులను భారత్ వెనక్కు పంపించింది. ఇరు దేశాల్లో ఉన్న ఎంబసీలోని సిబ్బందిని 45శాతం తగ్గించింది. అంటే వీరి సంఖ్యను 45 నుంచి 30 కి తగ్గించింది. ఈ మేరకు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్ కు గట్టిగా బుద్ధి చెప్పింది పాకిస్థాన్. సార్క్ దేశాల వీసా రద్దు ఇరు దేశాల మధ్య ఉన్న సార్క్ దేశాల వీసాను రద్దు చేసింది. దీంతో భారత్‌లో పర్యటిస్తున్న పాకిస్థానీ పౌరులు 48 గంటల్లోగా దేశాన్ని వీడాలని కేంద్రం ఆదేశించింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశానికి చెందిన పౌరులకు భారత్ లో చోటు లేదని బలంగా చాటి చెప్పింది. అటారీ-వాఘా బోర్డర్ మూసివేత పాకిస్థాన్ పై చర్యల్లో భాగంగా పంజాబ్‌లోని అటారీ- వాఘా సరిహద్దును మూసివేస్తున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. భారత్ లో శాంతి నెలకొల్పేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్ ప్రజలకు నో ఎంట్రీ పాకిస్థానీ ప్రజలకు వీసాలు రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇక పాకిస్థాన్ ప్రజలకు వీసాలు జారీ చేసేది లేదని స్పష్టం చేసింది. గతంలో ఇచ్చిన వీసాలనూ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. టెర్రరిజం, టూరిజం ఒకే చోట ఉండలేవని ఈ నిర్ణయం తీసుకుంది మోదీ సర్కార్. అంతేకాక ఇరు దేశాల మధ్య ఏటా జరిగే బోర్డర్ రిట్రీట్ వేడుకనూ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది భారత్ ప్రభుత్వం. ఎక్సర్ సైజ్ ఆక్రమన్.. భారత్, పాక్ మధ్య యుద్ధమేఘాలు కమ్ముకొస్తున్న నేపథ్యంలో గురువారం రాత్రి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆక్రమన్ ఎక్సర్ సైజ్ నిర్వహించింది. ఐఎన్ఎస్ విక్రాంత్ సముద్రంలో గస్తీ కాస్తోంది. యుద్ధానికి భారత్ సిద్ధమే అని ఈ ఎక్సర్ సైజ్ చాటుతోంది. అల్తాఫ్ లల్లీ ఖతం.. మరోవైపు పహల్గాం ఉగ్రదాడితో అప్రమత్తమైన భద్రతాబలగాలు జమ్మూకాశ్మీర్‌లో సాగిస్తున్న ఉగ్రవేటలో కీలక విజయం సాధించాయి. తాజాగా లష్కరే తోయిబా టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీని మట్టుబెట్టాయి. అలాగే ఉగ్రవాదుల ఆచూకీ ఇచ్చిన వారికి రూ. 20 లక్షలు బహుమతిగా ఇస్తామని భారత ప్రభుత్వం ప్రకటించింది.

# తెలంగాణలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు..

హైదరాబాద్-నవభూమి:తెలంగాణ రాష్ట్రంలో భానుడి ప్రతాపం కొనసాగుతోంది. ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుండటంతో జనాలు విలవిల్లాడిపో తున్నారు. వడదెబ్బతో ప్రజలు పిట్ట పిల్లల్లా రాలిపోతున్నారు. వడదెబ్బకు రాష్ట్రవ్యాప్తంగా మరో ఏడుగురు బలవటం బాధాకరం. దీంతో.. గత మూడు రోజుల్లో వడదెబ్బ కారణంగా మృతి చెందిన వారి సంఖ్య 30కి చేరింది. ఈ వరుస మరణాలు ప్రజల్లో తీవ్ర భయాందోళనలు కలిగిస్తున్నాయి. తాజాగా నమోదైన వడదెబ్బ మరణాల వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాలో ఇద్దరు, నిర్మల్ జిల్లాలో ఇద్దరు, జగిత్యాల జిల్లాలో ఒకరు, సూర్యాపేట జిల్లాలో ఒకరు మరియు జనగామ జిల్లాలో ఒకరు మృతి చెందారు. అధిక ఉష్ణోగ్రతలతో పాటు తీవ్రమైన ఉక్కపోత, వేడి గాలుల కారణంగా ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఎండ వేడిమిని తట్టుకోలేక సామాన్య ప్రజలు పిట్టల్లా రాలిపోతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మరోవైపు.. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు రావొద్దని, శరీరాన్ని చల్లగా ఉంచుకునేందుకు తగినంత నీరు త్రాగాలని, వదులైన దుస్తులు ధరించాలని నిపుణులు సూచిస్తున్నారు. శుక్రవారం (ఏప్రిల్ 25) తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు..

హైదరాబాద్: 38 డిగ్రీలు

నిర్మల్: 45.2 డిగ్రీలు

## చంద్రబాబు వైపే

(1వపేజీ తరువాయి)అయితే.. వీరిలోనూ 80 శాతం మంది వ్యక్తిగత చానెల్ల నిర్వాహకులు చంద్రబాబుకు అనుకూలంగా ఉన్నట్టు సర్వే పేర్కొనడం విశేషం. 2024 ఎన్నికలకు ఏడాది ముందు వరకు రాష్ట్రంలో 550 వ్యక్తిగత చానెళు ఉన్నాయని.. ఇప్పుడు ఆ సంఖ్య 2202 కు చేరిందని సర్వే వివరించింది. వీరిలో రాజకీయ విశ్లేషకులు.. ప్రొఫెసర్లు, రాజకీయ నాయకులు, సామాజిక ఉద్యమ కారులు ఇలా.. అనేక వర్గాలకు చెందిన వారు ఉన్నారని తెలిపింది. వీరంతా.. ప్రత్యక్షంగా లేదా.. పరోక్షంగా చంద్రబాబుకు మద్దతు ఇస్తున్నారు. వైసీపీని అనుసరించే చానెళ్లు కూడా ఉన్నాయని సర్వే పేర్కొంది. అయితే.. వీటి సంఖ్య చాలా వరకు తగ్గినట్టు తెలిపింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు.. 600 చానెళ్లు వైసీపీ కి అనుబంధంగా పనిచేయగా.. ప్రస్తుతం వీటి సంఖ్య 200లలోపునకు పడిపోయినట్టు తెలిపింది. ఇవి కూడా స్వచ్ఛందంగా మాత్రమే పనిచేస్తున్నట్టు పేర్కొనడం గమనార్హం. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను విశ్లేషించేవారు చంద్రబాబు మద్దతుగానే వ్యవహరిస్తున్నారని.. చెప్పింది. ఇప్పుడున్న పరిస్థితిలో వైసీపీ మీడియా పాత్ర తగ్గిపోయిందని.. సర్వే వివరించింది.

# పొంగులేటి పేరిట వసూళ్లు

(1వపేజీ తరువాయి) తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేరును అడ్డం పెట్టుకుని మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను హైదరాబాద్‌లోని నాగోల్ పోలీసులు అరెస్టు చేశారు. మంత్రి పీఏలమని చెప్పుకుంటూ వీరు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బుస్సా వెంకటరెడ్డి (30), మచ్చ సురేశ్ (30) అనే ఇద్దరు వ్యక్తులు ప్రస్తుతం హైదరాబాద్ నాగోల్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. వీరిలో సురేశ్ చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామస్థుడు కాగా, బుస్సా వెంకటరెడ్డి భూపాలపల్లి జిల్లా చిట్యాలకు చెందినవాడు. సురేశ్ హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ కొంతకాలంగా తాము మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పీఏలమని ఫోన్లలో పరిచయం చేసుకుంటూ మోసాలకు తెరలేపారు. సురేశ్ తన మొబైల్ నంబర్ నుంచి పలువురు అధికారులకు ఫోన్లు చేశాడు. మార్చి 29న చౌటుప్పల్ సీఐకి ఫోన్ చేసి, అనుమానాస్పదంగా మృతి చెందిన ఓ మహిళ పోస్టుమార్టం నివేదిక కావాలని అడిగాడు. నార్సింగి సీఐకి ఫోన్ చేసి ఓ సివిల్ కేసులో తమ వారికి అనుకూలంగా వ్యవహరించాలని కోరాడు. సికింద్రాబాద్ జేబీఎస్ పర్సనల్ ఆఫీసర్‌కు ఫోన్ చేసి ఓ డ్రైవర్ బదిలీ గురించి, ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐకి ఫోన్ చేసి గంజాయి కేసులో పట్టుబడిన వాహనం విడుదల గురించి మాట్లాడాడు. అంతేకాకుండా, ఓ డిగ్రీ కాలేజీ యాజమాన్యానికి సీటు విషయంలో, యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు రూ.10 లక్షల వ్యక్తిగత రుణం మంజూరు చేయాలని ఫోన్లు చేసినట్లు తెలిసింది. మరో నిందితుడు వెంకటరెడ్డి సైతం ఇదే తరహాలో గోపాలపురం ఎస్సై, ట్రాఫిక్ సీఐ, భూపాలపల్లి సీఐ, ఉప్పల్ సీఐ, టపాచపుత్ర సీఐ, నాచారం సీఐ, పెద్దకొత్తపల్లి సీఐ, నాగోల్ సీఐలతో పాటు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పీఏకు కూడా ఫోన్ చేసి, పలు పనుల విషయమై తమకు అనుకూలంగా ఉండాలని ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం.

# ఎన్డీఎస్ఏ నివేదిక చూసి వాళ్లంతా సిగ్గుపడాలి: మంత్రి ఉత్తమ్ కుమార్




హైదరాబాద్-నవభూమి:కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో అనేక లోపాలు ఉన్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఇచ్చిన తుది నివేదిక తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నివేదికపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. శుక్రవారం మీడియాతో మాట్లాడిన రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ నివేదికను చూసి బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడాలంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నామని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్టు కట్టారు. మీరే డిజైన్ చేశారు, మీరే కట్టారు, మీరు అధికారంలో ఉండగానే కూలిపోయింది." అని ఆయన దుయ్యబట్టారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు నిరుపయోగంగా ఉన్నాయని, ఈ ప్రాజెక్టు నిర్మాణం చేసినవారు, చేయించినవారు రైతులకు ద్రోహం చేశారని ఆయన ఆరోపించారు. "బీఆర్ఎస్ అబద్ధాలు, తప్పులపై బతకాలని అనుకుంటోంది, అది కుదరదు" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు.. ఎన్డీఎస్ఏ నివేదికపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇది ఎన్డీఎస్ఏ నివేదిక కాదని, ఎన్డీఏ నివేదిక అని ఆయన విమర్శించారు. "బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసి రాసిన నివేదిక ఇది" అని ఆయన ఆరోపించారు. ఓ ప్రముఖ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేటీఆర్ మాట్లాడుతూ, మేడిగడ్డను చూడకుండానే, అక్కడ ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండానే ఎన్డీఎస్ఏ నివేదిక వచ్చిందని ఆరోపించారు. గుజరాత్‌లోని మోర్బీ వంతెన కూలి 141 మంది మరణిస్తే, బీహార్‌లో రోజూ బ్రిడ్జ్‌లు కూలుతున్నా ఎన్డీఎస్ఏ స్పందించలేదని ఆయన గుర్తు చేశారు. సుంకిశాల రిటర్నింగ్ వాల్ కూలిపోయినా, ఎస్ఎల్ బీసీ టన్నెల్ కూలి 60 రోజులు అయినా ఎన్డీఎస్ఏ పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. "కేవలం బీఆర్ఎస్‌ను బద్నాం చేయడానికే ఈ రకమైన రిపోర్టు ఇచ్చారు. ఈ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు ఏ రకంగా పనిచేస్తున్నాయో అందరికీ తెలుసు. ఎన్డీఎస్ఏ రిపోర్టు డిసెంబర్‌లో వస్తే, ఇప్పుడు సరిగ్గా బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రెండు రోజుల ముందు బయటకు తీస్తున్నారు" అని కేటీఆర్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ నివేదిక, దాని విశ్వసనీయతపై ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నివేదికపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది.

# ఖాళేశ్వరం!?

(1వపేజీ తరువాయి)కీలక నిర్మాణాల్లో పగుళ్లు రావడం బయటపడ టంతో కేసీఆర్ ఆశలు ఆడియాసలయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ ఓటమికి ఇది కూడా ఒక ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ ప్రొటెక్షన్ అథారిటీ సమర్పించిన నివేదిక ప్రాజెక్టు భవిష్యత్తుపై తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తోంది. ఈ నివేదిక ప్రకారం కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ (లక్ష్మీ), అన్నారం (సరస్వతి), సుందిళ్ల (పార్వతి) బ్యారేజీలు ప్రస్తుతం ఉపయోగించడానికి పనికిరావు. వాటిని ఉపయోగించినట్లయితే ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందని ఎన్డీఎస్ఏ స్పష్టం చేసింది. వీటిని యథావిధిగా వినియోగించకూడదని, రీడిజైన్ చేసి తిరిగి నిర్మించడమే సరైన మార్గమని తేల్చిచెప్పింది. ఈ ప్రాజెక్టుల నిర్మాణం , డిజైన్‌లో అనేక లోపాలు ఉన్నాయని నివేదిక హైలైట్ చేసింది. ముఖ్యంగా మేడిగడ్డలోని బ్లాక్ 7 కు కోలుకోలేని నష్టం జరిగిందని, దీనిని తిరిగి ఉపయోగించకూడదని, సురక్షితంగా తొలగించడం లేదా స్థిరీకరించడం చేయాలని సిఫార్సు చేసింది. మూడు బ్యారేజీలలోనూ సీకెంట్ ఫైల్స్ కూలిపోవడంతో పాటు, బ్యారేజీల పై భాగంలో , కింది భాగంలో రంధ్రాలు ఉన్నట్లు గుర్తించారు. దాదాపు 14 నెలల పాటు లోతైన అధ్యయనం.. పరీక్షలు నిర్వహించిన తర్వాతే ఎన్డీఎస్ఏ ఈ సమగ్ర నివేదికను సమర్పించింది. బ్యారేజీల నిర్మాణం చేపట్టే ముందు చేయాల్సిన భూసార పరీక్షలు సరిగా చేయలేదని నివేదికలో పేర్కొన్నారు. అలాగే, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఒకే చోట నిర్మించాలన్న ప్రాథమిక ప్రతిపాదనలను పక్కన పెట్టి, వాటి స్థానాలను మార్చారని, ఇది కూడా నిర్మాణ లోపాలకు దారితీసిందని నివేదిక సూచిస్తోంది. జాతీయ ఆనకట్టల భద్రత చట్టం-2021 ప్రకారం వర్షాకాలానికి ముందు బ్యారేజీల పరిస్థితిని పర్యవేక్షించడంలో కూడా వైఫల్యం చెందారని ఎన్డీఎస్ఏ నివేదికలో ప్రస్తావించారు. ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ, డిజైన్‌లో స్పష్టమైన లోపాలున్నాయని ఎన్డీఎస్ఏ తేల్చిచెప్పడంతో ఇది తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్‌కు ఈ నివేదిక అత్యంత కీలకమైన ఆధారంగా మారనుంది. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో నీటిపారుదల, ఆర్థిక శాఖ వంటి కీలకమైన బాధ్యతలు నిర్వహించిన మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ లను ఈ వ్యవహారంలో జస్టిస్ ఘోష్ కమిషన్ ప్రశ్నించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్డీఎస్ఏ నివేదిక , జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ బీఆర్ఎస్ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. మొత్తానికి, ఒకప్పుడు తెలంగాణకు వరప్రదాయినిగా భావించిన కాళేశ్వరం ప్రాజెక్టు, నిర్మాణ లోపాలు , రాజకీయ ఆరోపణలతో ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది.

# భారత్‌లోకి చొరబడ్డ 51 మంది ఉగ్రవాదులు

(1వపేజీ తరువాయి)ఉన్నట్లు ఓ సంచలన సర్వే బయటకు వచ్చింది. వీరంతా సిరియాలో ట్రైనింగ్ తీసుకున్నవాళ్లే కావడం భయానక వాతావరణాన్ని తలపిస్తోంది. ఇక గత ఏడాది జమ్ము కాశ్మీర్ మీదుగా పాకిస్థాన్ నుంచి భారత్ లోకి 51 మంది ఉగ్రవాదులు అక్రమంగా ప్రవేశించినట్లు లెక్కలు ఉన్నాయి. %ూశ్రీంశీ =ఋఱ% "పాక్ నిర్ణయంతో భారత ప్రయాణికులపై అదనపు భారం!" ఈ 122 మంది ఉగ్రవాదులు భారత్ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని సరిహద్దు ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పరచుకుని ఉన్నట్లు సంచలన నివేదకలో తేలింది. ఇక వీళ్లంతా సిరియాలోని ఐసిస్ శిక్షణ కేంద్రాల్లో ట్రైనింగ్ తీసుకున్నవారే కావడంతో భారత్ కఠిన చర్యల దిశగా అడుగులు వేస్తోంది. వీళ్లను ఎట్టిపరిస్థితుల్లోనూ ట్రాప్ చేసి మట్టిలో కలిపేయాలని ప్రణాళికలు వేస్తోంది. అంతేకాక గతంలో జరిపిన ఉరి సర్జికల్ స్ట్రైక్ మాదిరి మరోసారి ప్లాన్ చేస్తోంది. ఉరి సర్జికల్ స్ట్రైక్ 2016లో పాక్ ఆక్రమిత కశ్మీర్ లో భారత సైన్యం చేసిన ఒక సైనిక చర్య. ఇది ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని చేసింది. 2016 సెప్టెంబర్ లో ఉరిలో భారత సైనిక శిబిరంపై ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా ఈ దాడి జరిగింది. అయితే తాజాగా పహల్గాం ఉగ్రదాడి ఘటనతో మళ్లీ అలాంటి సర్జికల్ స్ట్రైక్ కు ప్రధాని మోదీ నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. అదే కానీ జరిగితే పాకిస్థాన్ సరిహద్దుల్లోని ఉగ్రమూకలను ఏరి పారేయవచ్చని కాశ్మీర్ కు చెందిన మాజీ ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఉగ్రమూకలను మట్టిలో కలిపేస్తామని ప్రధాని మోదీ శపథం చేశారు.

## చివరిదాకా పోరాటం..తప్పని పరాజయం

(1వపేజీ తరువాయి)ఓటేయలేదని భావిస్తున్నారు. ఇక, మరో ఇద్దరు ఎవరు అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇక, ఫలితాల ప్రకారం చూసుకుంటే.. ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్‌కు మొత్తం 112 ఓట్లలో 63 ఓట్లు ఆయన సొంతమయ్యాయి. అయితే.. బీఆర్ ఎస్ కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు ఏడుగురు కూడా పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. మిగిలిన వారిలో కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా.. కొందరు పోలింగ్‌కు హాజరు కాలేదు. ఈ పరిణామాలతో ఓటింగ్ శాతం తగ్గినా.. బీజేపీకి పడాల్సిన ఓట్లు కూడా.. పడకపోగా.. 3 ఓట్లు తగ్గడం.. కమలం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

## ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరి రంగన్ కన్నుమూత

(1వపేజీ తరువాయి) మొదటి విజయవంతమైన విమాన పరీక్ష కూడా ఆయన నాయకత్వంలోనే జరిగింది. ఇస్రో ఉపగ్రహ కేంద్రం డైరెక్టర్‌గా, కొత్త తరం అంతరిక్ష నౌక, ఇండియన్ నేషనల్ శాటిలైట్, ఇండియన్ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలు, శాస్త్రీయ ఉపగ్రహాల అభివృద్ధికి సంబంధించిన కార్యకలాపాలను ఆయన పర్యవేక్షించారు. అనంతరం డాక్టర్ కస్తూరిరంగన్ రాజ్యసభ ఎంపీగా కూడా పనిచేశారు.. యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రణాళికా సంఘం సభ్యుడిగా కూడా వ్యవహరించారు. తాజాగా కస్తూరిరంగన్ జాతీయ విద్యా విధానం 2020 కోసం ఏర్పాటు చేసిన ముసాయిదా కమిటీకి అధ్యక్షత వహించారు. కొత్త జాతీయ పాఠ్య ప్రణాళికను అభివృద్ధి చేసే 12 మంది సభ్యుల స్టీరింగ్ కమిటీకి కూడా నాయకత్వం వహించారు. కస్తూరి రంగన్ మృతిపై ప్రధాని, పలువురు ముఖ్యమంత్రులు, ఇతర రాజకీయ నేతలు సంతాపాలు తెలుపుతూ ట్వీట్లు పెడుతున్నారు.

## వేట షురూ!

(1వపేజీ తరువాయి) పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్తాన్ పౌరుల్ని దేశం నుంచి బహిష్కరించాలని కేంద్ర కేబినెట్ వ్యవహారాల భద్రతా కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేసేందుకు కేంద్రం సిద్ధమైంది. ఇందులో భాగంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు హోంమంత్రి అమిత్ షా ఇవాళ కీలక ఆదేశాలు ఇచ్చారు. తమ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న పాకిస్తాన్ పౌరుల్ని గుర్తించి తక్షణం వెనక్కి పంపేయాలని ఈ ఆదేశాల్లో అమిత్ షా పేర్కొన్నారు. దీంతో పాక్ పౌరుల గుర్తింపు ప్రారంభమైంది. తమ అధికార పరిధిలో నివసిస్తున్న లేదా నివసిస్తున్న పాకిస్తాన్ జాతీయులందరినీ గుర్తించి వారిని బహిష్కరించాలని హోం మంత్రిత్వ శాఖ రాష్ట్రాలను కోరింది. హోంమంత్రి అమిత్ షా అన్ని ముఖ్యమంత్రులతో వ్యక్తిగతంగా మాట్లాడారని కూడా హోంశాఖ తెలిపింది. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత ఐదు దశల దౌత్యపరమైన ప్రతిఘటనలో భాగంగా పాకిస్తాన్ జాతీయుల వీసాలను రద్దు చేసినట్లు కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. ఏప్రిల్ 27 నుండి అమలులోకి వచ్చేలా అన్ని వీసాలను రద్దు చేస్తామని తెలిపింది. వైద్య వీసాలు మాత్రం అదనంగా మరో 48 గంటలు మాత్రమే చెల్లుబాటు అవుతాయని కేంద్రం ఉత్తర్వుల్లో తెలిపింది. అయితే, హిందూ పాకిస్తాన్ జాతీయులకు దీర్ఘకాలిక వీసాలు చెల్లుబాటులో ఉంటాయని ప్రభుత్వం తెలిపింది.

## జగన్‌ను రాజకీయాల్లో లేకుండా చేస్తాం

(1వపేజీ తరువాయి) పెంచారు. వైసీపీ సిమెంట్ ఫ్యాక్టరీల అరాచకాలను తాను అడ్డుకుంటున్నట్లు చెబుతున్న ఆదినారాయణరెడ్డి ఇవాళ మరోసారి ఇదే విషయంపై ప్రెస్ మీట్ పెట్టారు. ఇందులో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు ఆయన నేరుగా వార్నింగ్ ఇచ్చారు. వైఎస్ జగన్ ను రాజకీయాల్లో లేకుండా చేస్తామంటూ ఆదినారాయణరెడ్డి హెచ్చరించారు. సిమెంట్ పరిశ్రమల నంచి వైసీపీ నేతలు లబ్ది పొందుతున్నారని, వైసీపీ త్వరలోనే కుప్పకూలిపోతుందంటూ ఆది తెలిపారు. జమ్మూ కాశ్మీర్ లో ఉగ్రవాదుల కంటే ఇక్కడున్న వైసీపీ వాళు డేంజర్ అన్నారు. వైసీపీకి ఈసారి 11 సీట్లు కూడా రావన్నారు. జగన్ కోరికలేవీ నెరవేరవని ఆదినారాయణరెడ్డి స్పష్టం చేశారు. లిక్కర్ కేసులో కసిరెడ్డి దొరికాడని, జగన్ సహా అందరి బండారం బయటపడుతుందన్నారు. చెట్టే రాలిపోతుంటే ఇక ఆకులు, ఈకలు ఏం ఉంటాయంటూ ఆదినారాయణరెడ్డి వైసీపీపై విమర్శలు గుప్పించారు. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి జమ్మలమడుగు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచిన ఆదినారాయణరెడ్డి జిల్లాపై పట్టు పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే క్రమంలో పొరుగున ఉన్న అనంతపురం జిల్లా తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ కుటుంబానికి చెందిన ట్రక్కుల్ని కూడా అడ్డుకున్నారు. ఈ వివాదం సీఎం చంద్రబాబు దగ్గరకు వెళ్లింది. దీంతో ఇరువర్గాల్ని పిలిచి రాజీ చేశారు. అయితే ఆ తర్వాత కడప జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీలను టార్గెట్ చేస్తూ ఆదినారాయణరెడ్డి చేస్తున్న రచ్చపై చంద్రబాబు ఆగ్రహంగా ఉన్నారు. అయితే ఇదంతా వైసీపీపై పోరాటమే అంటూ ఆది చెప్పుకుంటున్నారు.

## ఐపీఎస్ పీఎస్సార్‌కు సీఐడీ కోర్టు షాక్..!

(1వపేజీ తరువాయి)ఇవ్వాలని విజయవాడ కోర్టులో సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన విజయవాడ కోర్టు.. మూడు రోజుల పాటు కస్టడీకి అప్పగిస్తూ ఇవాళ ఆదేశాలు ఇచ్చింది. వచ్చే ఆదివారం, సోమవారం, మంగళవారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పీఎస్సార్ ఆంజనేయులుపై విచారణ జరిపేందుకు సీఐడీకి అనుమతిస్తూ విజయవాడ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రస్తుతం విజయవాడలోని జిల్లా జైలులో ఉన్న పీఎస్సార్ ఆంజనేయుల్ని సీఐడీ రేపు అదుపులోకి తీసుకోనుంది. ఇప్పటికే ఈ కేసులో అప్రూవర్‌గా మారిన మరో ఐపీఎస్ విశాల్ గున్నీ ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగా పీఎస్సార్ ను ప్రశ్నించే అవకాశాలున్నాయి. ఇందులో జగన్ సీఎంవో పాత్రపై సీఐడీ మరిన్ని వివరాలు రాబట్టే అవకాశం ఉంది.

### విడదల రజనీకి భారీ ఊరట..!


(1వపేజీ తరువాయి)మంత్రి విడదల రజిని దాఖలు చేసిన పిటిషన్ పై ఆమె తరుపున మాజీ అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపించారు. దీనిపై ప్రభుత్వం కూడా వాదనలు వినిపించింది. చివరికి ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు.. విడదల రజనీకి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఆమెకు 41-ఎ నోటీసులు ఇచ్చి ప్రశ్నించాలని ఏసీబీకి ఆదేశాలు ఇచ్చింది. అంతేకాదు ఏసీబీ విచారణకు సహకరించాలని రజనీకి కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అలాగే ఈ కేసుకు సంబంధించి బహిరంగ వ్యాఖ్యలు చేయొద్దని విడదల రజనీని హైకోర్టు ఆదేశించింది. మరోవైపు ఇదే కేసులో రజనీ పీఏ రామకృష్ణకూ 41-ఎ నోటీసులు ఇచ్చి విచారించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది.



## పహల్గాం దాడి వెనుక హమాస్ హస్తం ఉందా..

**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్మూ కాశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో ఉగ్రదాడికి కారణంగా 26 మంది మరణించారు. అయితే గతేదాది ఇజ్రాయెల్‌లో జరిగిన హమాస్ తరహాలో ఈ దాడి జరిగిందని నిఘా వర్గాలు ఈ సందర్భంగా పేర్కొంటున్నాయి. ఈ తరహా దాడులతో భారతదేశాన్ని అస్థిర పరచడమే కాకుండా ఇతర దేశాలను సైతం ఆవిధంగా చేస్తున్నాయని తెలిపాయి. ఈ దాడిలో నలుగురు ఉగ్రవాదులు పాల్గొన్నారని.. వారిలో ఇద్దరు పాకిస్థానీయులు కాగా.. మరో ఇద్దరు జమ్మూ కాశ్మీర్‌కు చెందిన వారని పేర్కొన్నాయి. వీరంతా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో శిక్షణ పొందారని వెల్లడించాయి. వీరికి పాకిస్థాన్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ వెన్ను దన్నుగా ఉన్న లష్కరే తోయిబాతోపాటు జైషే మహమ్మద్ సంస్థలు శిక్షణ ఇచ్చాయన్నాయని వివరించాయి. పాకిస్థాన్ ప్రభుత్వం ఆహ్వానం మేరకు ఫిబ్రవరి 5వ తేదీన హమాస్ నాయకులు ఆ దేశానికి వెళ్ళారని నిఘా వర్గాలు తెలిపాయి. అక్కడ నుంచి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌కు తీసుకు వెళ్లారని చెప్పాయి. ఈ సందర్భం గా లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ సంస్థలకు చెందిన కమాండర్లతో ఈ హమాస్ నాయకులు సమావేశవమయ్యారని తెలిపాయి. ఈ హమాస్ నాయకుల పర్యటన సందర్భంగా రావాలాకోట్‌లో ఓ ర్యాలీ సైతం నిర్వహించారని వెల్లడించాయి. ఈ సందర్భంగా ఉగ్రవాద సంస్థలకు చెందిన పలువురు కీలక నాయకులు సైతం ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇంకా చెప్పాలంటే.. జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ సోదరుడు తల్హా సైఫ్, లాంచ్ కమాండర్ అస్గర్ ఖాన్ కాశ్మీరీ, మసూద్ ఇలియాస్ తోపాటు పలువురు లష్కరే తోయిబా కమాండర్లు సైతం దీనికి హాజరయ్యారని నిఘా వర్గాలు ఈ సందర్భంగా వివరించాయి.

# పహల్గాంలో భద్రత ఎందుకు కల్పించలేదు?



**జమ్ము కశ్మీర్:నవభూమి:**జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 28 మంది పర్యటకులు చనిపోయిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ముష్కరులు కాల్పులు జరిపిన సమయంలో ఆ లోయ వద్ద ఎందుకు భద్రతా సిబ్బంది లేరంటూ ఇప్పటికే అనేక మంది కేంద్ర ప్రభుత్వంపై ప్రశ్నలు విసిరారు. దీనికి కేంద్రం స్పందించి క్లారిటీ ఇచ్చింది. బైసరన్ లోయకు పర్యాటకులను అనుమతిస్తున్న విషయాన్ని స్థానిక అధికారులు భద్రతా సిబ్బందికి చెప్పలేదని పేర్కొంది. అందువల్లే అక్కడ సిబ్బంది లేరని.. ఇంత ఘోరం జరిగిపోయిందని వివరించింది. పహల్గాంలో భద్రత ఎందుకు కల్పించలేదు?.. కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇదే..! జమ్ము కశ్మీఉగ్రదాడి లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన విషయం అందరికీ తెలిసిందే. ఈ ఘనటలో మొత్తంగా 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోగా.. మరెంతో మంది తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఉగ్రదాడి జరిగిన సమయంలో బైసరన్ లోయ వద్ద ఎలాంటి భద్రతా సిబ్బంది లేరు. ఈ విషయాన్ని గుర్తించిన అనేక మంది దీనిపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇదే ప్రమాదానికి ఓ పెద్ద కారణం అయి ఉంటుందంటూ అనుమానాలు కూడా వ్యక్తం చేశారు. ప్రజలు సైతం దీని గురించి ఆలోచిస్తుండగా.. తాజాగా కేంద్ర ప్రభుత్వం స్పందించింది. దాడి సమయంలో అక్కడ భద్రతా బలగాలు లేవని వివరించింది. అయితే వారక్కడ లేకపోవడానికి ఓ కారణం ఉందంటూ.. అదేంటో అందరికీ అర్థమయ్యేలా చెప్పింది. ఆ పూర్తి వివరాలు మీకోసం. పహల్గాం ఉగ్రదాడి విషయంపై ఢిల్లీలో గురువారం రోజు అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈక్రమంలోనే ప్రతిపక్షాలు.. ఈ ఘటన వెనుక భద్రతా వైఫల్యం ఉందని, దాడి జరిగిన వెంటనే ప్రభుత్వం సరిగ్గా స్పందించలేదని ఆరోపించారు. అసలు దాడి జరిగిన సమయంలో భద్రతా బలగాలు, సీఆర్పీఎఫ్ ఎక్కడ ఉన్నాయని నేరుగా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయితే దీనికి ప్రభుత్వం తరఫు నుంచి ఓ కేంద్ర మంత్రి బదులు ఇచ్చారు. సాధారణంగా జూన్ నెల నుంచి ప్రారంభం అయ్యే అమర్ నాథ్ యాత్ర వరకు ఈ లోయ వద్దకు పర్యాటకులు వెళ్లకుండా ఆంక్షలు అమల్లో ఉంటాయని చెప్పారు. అయితే ఈసారి కాస్త ముందుగానే బైసరన్ లోయను తెరిచిన స్థానిక అధికారులు.. భద్రతా బలగాలకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని వివరించారు. అంతేకాకుండా ఈ ఎత్తులో ఉండే ప్రాంతానికి చేరుకోవాలంటే 45 నిమిషాల పాటు నడుచుకుంటూనే వెళ్లాల్సి ఉంటుందని.. అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలనే దానిపై ఎలాంటి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమల్లో లేదని వివరించారు. కానీ కేంద్ర మంత్రి ఇచ్చిన ఈ సమాధానంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయినా వేలాది మంది పర్యటకులు అక్కడకు వెళ్తుంటే ప్రభుత్వానికి తెలియకపోవడం ఏంటని ప్రశ్నించారని సమాచారం.

అయితే అసలు తొలిసారి బైసన్ లోయ వద్ద ఎందుకు భద్రతా బలగాలు లేరని ఓ ఎంపీ ప్రశ్నించారు. అసలు ఆ లోయను తెరిచినట్లు మహారాష్ట్రలో ఉన్న ట్రావెల్ ఏజెన్సీలకు తెలిసినప్పుడు.. అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి ఎలా తెలియకుండా ఉంటుందని ఎంపీ సుప్రియా సూలే అడిగినట్లు కూడా వార్తలు వచ్చాయి. వీటన్నిటికీ సమాధానంగానే అఖిలపక్ష సమావేశంలో కేంద్ర తరఫున మంత్రి క్లారిటీ ఇచ్చారు.

## ఉగ్రదాడిపై ప్రతీకారం ఇలా.. భారత్ ముందు నాలుగు మిలిటరీ ఆప్షన్‌లు



**న్యూఢిల్లీ-నవభూమి:**మూడు రోజుల క్రితం పహల్గాం లో జరిగిన ఉగ్రదాడి తో భారత్ ఉలిక్కిపడింది. ఈ దాడిలో 26 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై ప్రతీకారంతో రగిలిపోతోంది. ఈ క్రూరమైన దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్ పై దౌత్యపరమైన ఒత్తిడి పెంచింది. భవిష్యత్తులో ఆర్థికంగా కోలుకోకుండా చేసేందుకు సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపేసింది.

ఇక పహల్గాంలో నరమేధం సృష్టించిన ఉగ్రవాదులను వదిలిపెట్టకూడదని, వాళ్లకు ధీటైన జవాబు ఇవ్వాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎలా ప్రతీకారం తీర్చుకొంటారన్నది చర్చనీయాంశంగా మారింది. భారత ప్రభుత్వం మాత్రం సైనిక చర్య అంశంపై గుంభనంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో భారత్ ఎలాంటి అడుగు వేయబోతుందనే విషయంలో నిపుణులు తమతమ అంచనాలను వెల్లడిస్తున్నారు. మొత్తానికి భారత్ ఎదుట నాలుగు మిలిటరీ ఆప్షన్లు ఉన్నట్లు చెబుతున్నారు. ఆ నాలుగు ఆప్షన్‌లు ఏమిటో ఇప్పుడు చూద్దాం..

**రఫేల్, మిరాజ్‌లను రంగంలోకి దింపడం..**

ప్రస్తుతం వాయుసేనలో అత్యాధునిక ఫైటర్ జెట్లు అయిన రఫేల్, మిరాజ్ విమానాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించి పాకిస్థాన్‌లోని కీలక స్థావరాలపై దాడులు చేయడం ఇండియన్ మిలిటరీ ముందున్న మొదటి ఆప్షన్. అదే సమయంలో బాలాకోట్‌పై దాడి అనంతర అనుభవాలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ప్రత్యర్థుల రక్షణ వలయాన్ని ఛేదించే సామర్థ్యాలు రఫేల్, మిరాజ్‌లకు ఉన్నాయి. అయితే ఈ ఆప్షన్‌ను ఎంచుకుంటే అంతర్జాతీయ ఒత్తిడిని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉండాలి.

**లైన్ ఆఫ్ కంట్రోల్‌ను దాటి..**

సిమ్లా ఒప్పందాన్ని పక్కన పెడతామని తాజాగా పాకిస్థాన్ బెదిరించింది. ఆ ప్రకారం చూస్తే ఆ దేశం నియంత్రణ రేఖను గుర్తించనట్లు అవుతుంది. దాంతో భారత్‌కు దూకుడుగా ఆపరేషన్లు చేపట్టే అవకాశం లభిస్తుంది. ఇటీవల ఎల్ఓసీ వద్ద పాకిస్థాన్ జరిపిన ఉల్లంఘనలను భారత్ కారణంగా చూపవచ్చు. ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఆపరేషన్లు చేపట్టవచ్చు. ఇది భారత్ ముందున్న మరో ఆప్షన్‌గా చెప్పవచ్చు. కాకపోతే అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితులు భారత దళాలకు సవాల్‌గా మారుతాయి. ఆపరేషన్లకు సుదీర్ఘ సమయం పట్టడం, ఇప్పటికే పలు బలమైన పొజిషన్లలో పాకిస్థాన్ దళాలు ఉండటం ప్రతికూలంగా మారవచ్చు.

**భారీ టార్గెట్స్‌పై సర్జికల్ స్ట్రైక్స్..**

భారీ టార్గెట్లను గుర్తించి సర్జికల్ స్ట్రైక్స్ చేయడం భారత్ ముందున్న మూడో ఆప్షన్. కాకపోతే ఇప్పుడు పాకిస్థాన్ అప్రమత్తంగా ఉండటంతో సర్జికల్ స్ట్రైక్స్ అంత సులువు కాకపోవచ్చు. సక్సెస్‌ఫుల్‌గా సర్జికల్ స్ట్రైక్స్ చేయాలంటే రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్, శక్తిమంతమైన దళాలు, కచ్చితమైన ప్లానింగ్ అవసరం.

**శతఘ్నులు, స్నైపర్లతో కాల్పులు..**

ఇక లక్ష్యాలపై గురిపెట్టి భారీ శతఘ్నులు, స్నైపర్ గన్స్‌తో కాల్పులు జరపడం భారత్ ముందున్న నాలుగో ఆప్షన్‌గా చెప్పవచ్చు. వీటితోపాటు భారీ మోర్టార్లను కూడా వాడవచ్చు. దాంతో ఉద్రిక్తతలకు అవకాశం తక్కువగా ఉంటుంది. నియంత్రణ రేఖ సమీపంలోని శత్రుస్థావరాలు, సరఫరాల మార్గాలు, ఔట్‌పోస్టులను తుడిచిపెట్టవచ్చు. కాకపోతే ఈ దాడులతో ఫలితం పెద్దగా ఉండదు. భారీ దాడులతోనే భారీ ఫలితం దక్కుతుంది.

## ఆర్మీ, పారామిలటరీ దుస్తుల అమ్మకాలు..

### దుకాణాలకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం కీలక ఆదేశాలు



**జమ్ము కశ్మీర్:నవభూమి:**జమ్ము కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పెహల్‌గామ్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఉగ్రదాడితో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్‌లో ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ఉగ్రమూక పర్యాటకులే లక్ష్యంగా విచక్షణా రహితంగా కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రమూక ఆర్మీ దుస్తుల్లో వచ్చి దాడికి పాల్పడిన నేపథ్యంలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆర్మీ, పారామిలటరీ దుస్తుల అమ్మకాలపై నిఘా పెట్టింది. ఈ మేరకు దుకాణాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. యూనిఫాం, భద్రతా బలగాలకు సంబంధించిన వస్తువులను అమ్మే దుకాణాల జాబితాను సిద్ధం చేయాలని స్టేషన్ ఇన్‌చార్జులందరికీ డెహ్రాడూన్ ఎస్ఎస్‌పీ అజయ్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు. పల్టాన్ బజార్ వంటి కీలక ప్రాంతాల్లో ప్రధానంగా ఆర్మీ, పారామిలటరీ యూనిఫాం అమ్మకాలు జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో దుకాణాల యజమానులు సరైన ధృవీకరణ లేకుండా యూనిఫాంలు, ఇతర వస్తువులు విక్రయించొద్దని ఆదేశించారు. ఆర్మీ దుస్తులు, వస్తువులు అమ్మే ముందు కస్టమర్ల ఆధార్, ఐడీ కార్డులు, ఫోన్ నంబర్, అడ్రెస్ తీసుకోవాలని సూచించారు. యూనిఫాంల దుర్వినియోగం జరగకుండా ముందే తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## ఆపరేషన్ కగార్‌కు సన్ స్ట్రోక్..

**జమ్ము కశ్మీర్:నవభూమి:** కేంద్ర భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌కు సన్ స్ట్రోక్ అడ్డంకిగా మారింది. బీజాపూర్ - తెలంగాణ సరిహద్దుల్లో కూంబింగ్ చేస్తున్న భద్రతా బలగాలకు వడ దెబ్బ తగిలింది. ఈ పరిస్థితి ఆపరేషన్ కగార్‌కు అడ్డంకిగా మారింది. వడ దెబ్బ తగిలి 40 మంది జవాన్లు డీ హైడ్రేషన్‌కు గురయ్యారు. తీవ్ర అస్వస్థతకు గురవడంతో.. ఆర్మీ హెలికాప్టర్‌లో భద్రాచలం హాస్పిటల్‌కు తరలించారు. సన్ స్ట్రోక్‌కు గురైన భద్రతా బలగాలకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కర్రె గుట్టల్లో భారీ స్థాయిలో మావోయిస్టులు ఉన్నారని.. మావోయిస్టు కీలక నేత హిడ్మా కూడా అక్కడే ఉన్నట్లు సమాచారం అందడంతో.. భారీగా భద్రతా దళాలు రంగంలోకి దిగాయి. దాదాపు 8 వేల మందికి పైగా సిబ్బంది మావోయిస్టుల వేట సాగిస్తున్నాయి. కర్రె గుట్టలను చుట్టుముట్టి.. మావోయిస్టులపై దాడికి పాల్పడుతున్నారు. కర్రెగుట్టల చుట్టూ.. ఉత్తరాన ఛత్తీసగఢ్‌లోని పూజారి కాంకేర్, తూర్పున భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా చర్ల, దక్షిణాన ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, తూర్పున ఇంద్రావతి నది ప్రాంతాల్లో కూంబింగ్ కొనసాగుతోంది.

## ఎందరికో ఆదర్శం.. ఇంటర్‌లో ఫెయిల్.. కానీ సివిల్స్‌లో ర్యాంకు కొట్టాడు



**తిరుపతి-నవభూమి:**పరీక్షల ఫలితాలు వచ్చాయంటే చాలు.. మార్కుల సంగతి పక్కకు పెడితే.. ఫెయిల్ అయ్యాము.. తక్కువ మార్కులు వచ్చాయని మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకునే విద్యార్థుల వార్తలే ఎక్కువగా కనిపిస్తాయి. నిండా 18 ఏళ్లు కూడా లేని పిల్లలు.. పరీక్షల్లో ఫెయిల్ అయితే జీవితమే లేదని ఫీలవుతూ.. ఏకంగా ప్రాణాలు తీసుకుంటున్నారంటే.. మన సమాజంలో ఎలాంటి దారుణ పరిస్థితులు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. పిల్లల చదువు, మార్కులను కూడా ప్రెస్టీజ్ ఇష్యూగా భావించే తల్లిదండ్రులున్నంత కాలం.. చదువు హత్యలు ఆగవు. అలా కాకుండా ఫెయిల్ అయితే మళ్లీ ప్రయత్నించమని భుజం తడితే.. ఇదుగో ఇప్పుడు మనం చెప్పుకోబోయే వ్యక్తిలా జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారు. ఇంటర్‌లో ఫెయిలైన ఆ వ్యక్తి.. ఇప్పుడు యూపీఎస్సీ పరీక్షలో సత్తా చాటి.. ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆ వివరాలు..యూపీఏఎస్సీ 2024 సివిల్స్ ఫలితాలు తాజాగా విడుదలైన సంగతి తెలిసిందే. ఈ ఫలితాల్లో మొత్తం 1,009 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఇక తాజా ఫలితాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన 26 మంది అభ్యర్థులు ఎంపికైనారు. ఇందులో తిరుపతి జిల్లా నారాయణవనం మండలం గోవిందప్పనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన పామూరి సురేష్ సివిల్స్‌లో ఏకంగా 988వ ర్యాంకు సాధించారు. ఆయన విజయం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుంది. ఎందుకంటే..

**ఇంటర్‌లో ఫెయిల్..**

సురేష్ పదో తరగతి వరకు సాధారణ విద్యార్థి.. అంతేకాక ఇంటర్ ఫస్టియర్‌లో ఫెయిల్ అయ్యాడు. దాంతో బంధువులు, చుట్టుపక్కల వాళ్లు సురేష్‌ని హేళన చేయసాగారు. ఎందుకు పనికిరాడని ఎగతాళి చేసేవారు. కానీ సురేష్ మాత్రం కుంగిపోలేదు.. ఫెయిల్ అయినందకు భయపడలేదు. ఎలాగైనా జీవితంలో గెలవాలని ఆ క్షణమే నిర్ణయించుకున్నారు. అందుకే తిరిగి నంద్యాలలో డిప్లొమా కోర్సులో చేరారు. ఆ సమయంలో స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం పుస్తకాలు చదివి ఎంతో స్ఫూర్తి పొందినట్లు చెప్పుకొచ్చారు సురేష్. చదువుతోనే జీవితంలో మార్పు వస్తుందని గట్టిగా నమ్మిన సురేష్.. సివిల్స్‌ను తన జీవిత గమ్యంగా మార్చుకున్నారు. డిప్లొమా తర్వాత ఈసెట్ రాసి రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు సాధించి సత్తా చాటారు సురేష్. కర్నూలులో ఇంజినీరింగ్ పూర్తి చేశాక.. 2011లో జెన్‌కోలో ఏఈ ఉద్యోగం సాధించారు. కానీ తన ధ్యేయం సివిల్స్. అందుకే 2017లో తొలిసారి సివిల్ సర్వీసెస్ పరీక్ష రాశారు.. అయితే ఆ ప్రయత్నంలో కనీసం ప్రిలిమ్స్ కూడా పాస్ కాలేకపోయారు. అయినా ధైర్యం కోల్పోలేదు. మరింత కష్టపడి చదివిన ఆయన రెండో ప్రయత్నంలో ఏకంగా ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. కానీ తుది జాబితాలో మాత్రం చోటు దక్కలేదు. వినికిడి సమస్యతో మరోసారి లక్ష్యం మార్పు..అయినా వెనకడుగు వేయకుండా మళ్లీ తన ప్రయత్నాలు ప్రారంభించారు సురేష్. అయితే 2020లో మరో సారి సివిల్స్‌కు సన్నద్ధమవుతుండగా కొవిడ్ మహమ్మారి బారిన పడటంతో వినికిడి సమస్య తలెత్తింది. ఇలా తరచుగా ఏదో ఒక అడ్డంకి వచ్చేది. అయినా సరే సురేష్ ధైర్యం కోల్పోలేదు. కాకపోతే వినికిడి సమస్య కారణంగా ఐపీఎస్ కావాలన్న తన లక్ష్యానికి అర్హత సాధించలేకపోయారు. అప్పుడేఆయన ఐఏఎస్ సాధించాలని మనసు మార్చుకున్నారు. సివిల్స్ సన్నద్ధతకు ఇబ్బందిగా ఉందని 2020లో ఉద్యోగానికి కూడా రాజీనామా చేశారు. అప్పట్లోనే సురేష్‌కు నెలకు ఏకంగా రూ.1.50 లక్షల జీతం వచ్చేది. సివిల్స్ కోసం భారీ వేతనం వచ్చే ఉద్యోగాన్ని కూడా వదులుకుని కోవిడ్ అనంతరం మూడు సార్లు యూపీఎస్సీ పరీక్ష రాశాడు. చివరకు 2024లో అనగా ఏడో ప్రయత్నంలో ఏకంగా 988వ ర్యాంకు సాధించారు. ఫెయిల్యూర్స్ వస్తే కుంగిపోకుండా.. ధైర్యంగా ముందుకు సాగితే విజయం వరిస్తుంది అనే దానికి సురేష్ జీవితమే ఒక ఉదాహరణ.

## 52 ఏళ్ల మహిళను ప్రేమించి పెళ్లి చేసుకున్న 25 ఏళ్ల యువకుడు



**ఉత్తర ప్రదేశ్-నవభూమి:**ఈ మధ్య కా లంలో మతిపోగొట్టే వింత విచిత్ర ౕమైన సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం ఓ మహిళ తన కూతురికి కాబోయే భర్తతో ఇంటినుంచి పారిపోయింది. పెళ్లికి 10 రోజుల ముందు కాబోయే అల్లుడితో లేచిపోయింది. ఈ సంఘటన మరువక ముందే మరో కొత్త, వింత సంఘటన వెలుగులోకి వచ్చింది. ఓ 52 ఏళ్ల మహిళ.. 25 ఏళ్ల యువకుడితో ఇంటినుంచి పారిపోయింది. అతడ్నే పెళ్లి కూడా చేసుకుంది. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఉత్తర ప్రదేశ్, బస్కారీ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన చంద్రశేఖర్, ఇంద్రావతి భార్యాభర్తలు. ఈ దంపతులు బేల్‌వారీ దలిత్ బస్తీలో ఉంటున్నారు. ఈ జంటకు నలుగురు పిల్లలు కూడా ఉన్నారు. చంద్రశేఖర్ వేరే సిటీలో పని చేస్తూ ఉన్నాడు. కుటుంబం అవసరాల కోసం డబ్బులు పంపుతూ ఉంటాడు. పదిరోజుల క్రితం ఇంద్రావతి ఇంటినుంచి కనిపించకుండా పోయింది. చంద్రశేఖర్ ఆరాతీయగా అసలు విషయం బయటపడింది. ఇంద్రావతి అదే ప్రాంతానికి చెందిన 25 ఏళ్ల యువకుడితో అక్రమ సంబంధం పెట్టుకుంది. ఇద్దరూ కలిసి చంద్రశేఖర్‌ను చంపాలనుకున్నారు. అది కుదరకపోవటంతో ఇళ్లు వదలి పారిపోయారు. ఈ విషయంపై ఇంద్రావతి భర్త చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ‘ ఇద్రావతికి ఇది మూడో పెళ్లి.. నేను రెండో భర్తను. మొదటి భర్తతో విడిపోయి వేరుగా ఉంటున్న ఆమెను నేను పెళ్లి చేసుకున్నా. అప్పటికే ఆమెకు ఓ కూతురు ఉంది. నాతో పెళ్లయిన తర్వాత ఓ కూతురు, ఇద్దరు కొడుకులు పుట్టారు. నా పొలాన్ని తాకట్టు పెట్టి ఇంద్రావతి మొదటి భర్త కూతురికి పెళ్లి చేశాను. నా మీద ఆమెకు ఆసక్తి తగ్గిపోయింది. నాతో సరిగా మాట్లాడేది కాదు. ఎప్పుడూ గొడవలు పడుతూ ఉండేది. ఇంద్రావతి, ఆమె ప్రియుడు నన్ను చంపాలనుకున్నారు. కానీ, అది జరగలేదు. అందుకే ఇంటినుంచి పారిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేశాను. వాళ్లు చేతులు ఎత్తేశారు. ఆ ఇద్దరూ సిగ్గులేకుండా గుడిలో పెళ్లి చేసుకున్నారు. నా దృష్టిలో తను చనిపోయింది. నా పొలం డబ్బులు నాకు ఇచ్చేయాల్సిందే.

## పహల్గాం దాడి వెనుక హమాస్ హస్తం ఉందా..

**న్యూఢిల్లీ-నవభూమి:**జమ్మూ కాశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాం లో ఉగ్రదాడికి కారణంగా 26 మంది మరణించారు. అయితే గతేడాది ఇజ్రాయెల్‌లో జరిగిన హమాస్ తరహాలో ఈ దాడి జరిగిందని నిఘా వర్గాలు ఈ సందర్భంగా పేర్కొంటున్నాయి. ఈ తరహా దాడులతో భారతదేశాన్ని అస్థిర పరచడమే కాకుండా ఇతర దేశాలను సైతం ఆవిధంగా చేస్తున్నాయని తెలిపాయి. ఈ దాడిలో నలుగురు ఉగ్రవాదులు పాల్గొన్నారని.. వారిలో ఇద్దరు పాకిస్థానీయులు కాగా.. మరో ఇద్దరు జమ్మూ కాశ్మీర్‌కు చెందిన వారని పేర్కొన్నాయి. వీరంతా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో శిక్షణ పొందారని వెల్లడించాయి. వీరికి పాకిస్థాన్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ వెన్ను దన్నుగా ఉన్న లష్కరే తోయిబాతోపాటు జైషే మహమ్మద్ సంస్థలు శిక్షణ ఇచ్చాయన్నాయని వివరించాయి. పాకిస్థాన్ ప్రభుత్వం ఆహ్వానం మేరకు ఫిబ్రవరి 5వ తేదీన హమాస్ నాయకులు ఆ దేశానికి వెళ్ళారని నిఘా వర్గాలు తెలిపాయి. అక్కడ నుంచి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌కు తీసుకు వెళ్లారని చెప్పాయి. ఈ సందర్భంగా లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ సంస్థలకు చెందిన కమాండర్లతో ఈ హమాస్ నాయకులు సమావేశవమయ్యారని తెలిపాయి. ఈ హమాస్ నాయకుల పర్యటన సందర్భంగా రావాలాకోట్‌లో ఓ ర్యాలీ సైతం నిర్వహించారని వెల్లడించాయి. ఈ సందర్భంగా ఉగ్రవాద సంస్థలకు చెందిన పలువురు కీలక నాయకులు సైతం ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇంకా చెప్పాలంటే.. జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ సోదరుడు తల్హా సైఫ్, లాంచ్ కమాండర్ అస్గర్ ఖాన్ కాశ్మీరీ, మసూద్ ఇలియాస్‌తోపాటు పలువురు లష్కరే తోయిబా కమాండర్లు సైతం దీనికి హాజరయ్యారని నిఘా వర్గాలు ఈ సందర్భంగా వివరించాయి. గత ఏడాది అక్టోబర్ 7న వచ్చిన మరో నిఘా సమాచారం ప్రకారం.. భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాల్లో ఉగ్రవాద కార్యకలాపాలను ప్రేరేపించే లక్ష్యంతో ఇలాంటి రాడికల్ భావజాలాన్ని నాటే ప్రయత్నం కోసం హమాస్ నాయకులను పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఢాకా తీసుకు వెళ్లిందని సమాచారం. అల్ ఖైదాతో ప్రత్యక్ష సంబంధాలున్న ప్రముఖ తీవ్రవాది ముఫ్తీ షాహిదుల్ ఇస్లాం స్థాపించిన ఇస్లామిస్ట్ సంస్థ ‘అల్ మర్కజుల్ ఇస్లామి’ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలుస్తోంది. 1999లో ఖుల్నాలోని అహ్మదియా మసీదుపై బాంబు దాడికి కుట్ర పన్నినందుకుగాను ముఫ్తీ షాహిదుల్లా ఇస్లాంను అరెస్టు చేశా రు. ఈ దాడిలో ఎనిమిది మంది మరణించారు. ఆ తర్వాత అతడు విడుదలై.. ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌తోపాటు ఆఫ్రికా వెళ్లాడు. అక్కడ అల్ ఖైదాకు చెందిన వ్యక్తుల వద్ద పేలుడు పదార్థాల శిక్షణ పొందాడు. అయితే అతడు 2023లో మరణించాడు. కానీ జమాతుల్ ముజాహిదీన్ బంగ్లాదేశ్ వంటి తీవ్రవాద సంస్థలు షాహిదుల్ ఇస్లాంను ఇప్పటికీ ఆరాధిస్తునే ఉన్నాయి. గతేడాది ఢాకాలో అక్టోబర్‌లో జరిగిన కార్యక్రమానికి సీనియర్ హమాస్ నాయకులు షేక్ ఖలీద్ కుదుమితోపాటు పొలిటికల్ బ్యూరో చైర్మన్ షేక్ ఖలీద్ మిషాల్ హాజరయ్యారు. ఇతర ప్రముఖ హాజరైన వారిలో పాకిస్తాన్‌కు చెందిన షేఖుల్ ఇస్లాం ముఫ్తీ తకీ ఉస్మానీ, మౌలానా ఫజ్లూర్ రెహమాన్ ఉన్నారు.

## సైనిక దుస్తులు అమ్మే దుకాణాలకు సర్కారు కీలక ఆదేశాలు



**జమ్ము కశ్మీర్:నవభూమి:**జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి గురించి అందరికీ తెలిసిందే. మంగళవారం రోజు మధ్యాహ్నం 3 గంటల సమయంలో ముష్కరులు సైనిక దుస్తుల్లో వచ్చి పర్యటకులపై కాల్పులు జరిపారు. మొత్తంగా 28 మంది పురుషులను చంపేశారు. మరెంతో మంది ఈ ఘటనలో గాయపడగా.. ఉత్తరాఖండ్ సర్కారు అప్రమత్తమైంది. ముఖ్యంగా ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో రావడంతో.. ఆర్మీ, పారామిలిటరీ బట్టల అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టింది. ఈమేరకే ఆయా దుకాణాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడితో భారతదేశం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ముఖ్యంగా ఉగ్రమూకలు సైనిక దుస్తుల్లో రావడంతో.. ఉత్తరాఖండ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. భద్రత బలగాలకు సంబంధించిన వస్తువులతో పాటు దుస్తులు అమ్మే దుకాణాల జాబితాను సిద్ధం చేయాలని ఆయా స్టేషన్ ఇన్‌ఛార్జులందరికీ డెహ్రాడూన్ ఎస్ఎస్‌పీ అజయ్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు. పల్టాన్ బజార్ వంటి కీలక ప్రాంతాల్లో ప్రధానంగా ఆర్మీ, పారా మిలటరీ యూనిఫాం అమ్మకాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో అక్కడున్న ఆయా దుకాణాదారులు అందరికీ పలు సూచనలు చేశారు. వినియోగదారుల్లో ఎవరైనా కొంచెం తేడాగా కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వెల్లడించారు. ముఖ్యంగా ఎవరైనా సైనిక దుస్తులు కొనుగోలు చేసేందుకు వస్తే ముందుగా వారి గుర్తింపు కార్డులను చూడాలని చెప్పారు. సరైన ధ్రువీకరణ లేకుండా యూనిఫాంలు, ఇతర వస్తువులు విక్రయించొద్దని వెల్లడించారు. ఆర్మీ దుస్తులు, వస్తువులు అమ్మే ముందు.. వినియోగదారుల నుంచి ఆధార్, ఐడీ కార్డ్, ఫోన్ నంబర్, అడ్రెస్ కార్డులను తీసుకుని పరిశీలించాలని.. ఆపై అవన్నింటినీ నోట్ చేసుకోవాలని సూచించారు. యూనిఫాంల దుర్వినియోగం జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా మొత్తంగా 125 మంది ఉగ్రవాదులు ఉన్నారని భద్రత బలగాలు మరోసారి గుర్తు చేశాయి. వాళ్లలో ఎవరైనా వచ్చి సైనిక దుస్తులు కొనుగోలు చేసే అవకాశం ఉందని.. కాబట్టి అంతా జాగ్రత్తగా ఉండాలని చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా 125 మంది ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నప్పటికీ.. జమ్ము కశ్మీర్‌లోనే మొత్తంగా 115 మంది పాకిస్థానీ టెర్రరిస్టులు ఉన్నట్లు భద్రతా సంస్థలు వెల్లడిస్తున్నాయి.

# మనం నీళ్లను ఎక్కడ ఉంచుకుంటాం?



**న్యూఢిల్లీ-నవభూమి:**జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి గురించి అందరికీ తెలిసిందే. భారత ప్రభుత్వం సింధు నది జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. దీంతో ఆ దేశానికి తీవ్ర నీటి కొరత ఏర్పడుతుండగా.. పాక్ మాత్రం ఈ రద్దును యుద్ధంగా భావిస్తామని కామెంట్లు చేసింది. అయితే తాజాగా దీనిపై స్పందించిన ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ షాకింగ్ కామెంట్లు చేశారు. ఓవైపు ఈ రద్దును స్వాగతిస్తూనే.. మరోవైపు నీటిని ఎక్కడ ఉంచుకుంటారని కేంద్రాన్ని ప్రశ్నించారు.

మనం నీళ్లను ఎక్కడ ఉంచుకుంటాం?..: సింధు జలాల ఒప్పందం రద్దుపై అసదుద్దీన్ ఒవైసీ


మనం నీళ్లను ఎక్కడ ఉంచుకుంటాం?..: సింధు జలాల ఒప్పందం రద్దుపై అసదుద్దీన్ ఒవైసీ

కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో తక్షణ చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన సంగతి తెలిసిందే. సింధు నది జలాలు పాకిస్థాన్‌కు వెళ్లకుండా చూస్తే దాని ప్రభావం దాయాది దేశంపై తీవ్రంగా పడనుంది. అయితే అఖిలపక్ష భేటీలో సింధు నదీ జలాల ప్రస్తావన వచ్చింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత కేంద్ర సర్కారు తీసుకున్న అన్ని చర్యలను స్వాగతించాయి అఖిల పక్షాలు. ముఖ్యంగా ఎంఐఎం అధినేత అసదుద్దిన్ ఒవైసీ ఈ రద్దుపై స్పందించారు. కేంద్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించారు. అఖిలపక్ష భేటీలో పాల్గొన్న ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్రంపై ప్రశ్నలు సంధించారు. సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు వెలువడిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఒవైసీ స్వాగతిస్తూనే.. అసలు సింధు నదీ జలాలను ఎలా అడ్డుకుంటారని ప్రశ్నించారు. సింధు జల ఒప్పందం నిలిపివేయడం సరైందే కానీ, నీటిని మనం ఎక్కడ దాచుకుంటామని అడిగారు. ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాన్నైనా తాము స్వాగతిస్తామని, మద్దతు అందిస్తామని చెప్పుకొచ్చారు ఒవైసీ. ఇది రాజకీయ సమస్య కాదని, దేశం సమస్య అని చెప్పారు. పహల్గాం ప్రాంతంలో సామాన్యులపై దాడికి పాల్పడటంపై ప్రతిస్పందించే హక్కు భారతదేశానికి ఉందని, అంతర్జాతీయ చట్టాలు కూడా అందుకు అనుకూలమేనని చెప్పుకొచ్చారు. ఉగ్రవాద గ్రూపులకు ఆశ్రయం ఇచ్చే దేశంపై చర్య తీసుకోవచ్చని, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఆత్మరక్షణ కోసం వైమానిక, నావికకా దిగ్బంధనం చేయడానికి, వారికి ఆయుధ అమ్మకాలపై ఆంక్షలు విధించడానికి అంతర్జాతీయ చట్టాలు అనుమతి ఇస్తాయని ఒవైసీ పేర్కొన్నారు.

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో శుక్రవారం ప్రార్థనలకు వచ్చే వారికి ఒవైసీ కీలక పిలుపునిచ్చారు. ఉగ్రవాదాన్ని ఖండిస్తున్నామనే సందేశాన్ని పంపడానికి శుక్రవారం మసీదులకు ప్రార్థనలకు వెళ్లే సమయంలో ముస్లింలు తమ చేతులకు నల్ల రిబ్బన్ లేదా బ్యాండ్ ధరించాలని ఒవైసీ పిలుపునిచ్చారు. ఇలా చేయడం ద్వారా విదేశీ శక్తులు భారతదేశ శాంతి, ఐక్యతను బలహీనపరచనివ్వబోమని మనం భారతీయులు అందరికీ సందేశం పంపుదామని అసదుద్దీన్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
శనివారం
26 । ఏప్రిల్ । 2025





## కొడనాడు హత్య, దోపిడీ కేసు.. సీబీసీఐడీ విచారణకు సయాన్ హాజరు

**చెన్నై-నవభూమి:** కొడనాడు(హత్య, దోపిడీ కేసులో సీబీసీఐడీ విచారణకు సయాన్ హాజరయ్యాడు. నీలగిరిజిల్లా కోతగిరి సమీపం కొడనాడులో దివంగత ముఖ్యమంత్రి జయలలితకు చెందిన కొడనాడు ఎస్టేట్‌లో 2017లో వాచ్‌మెన్ హత్య, ఎస్టేట్ భవనంలో దోపిడీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి సయాన్, వాళయార్ మనోజ్ సహా 10 మందిని






అరెస్ట్ చేశారు. ప్రస్తుతం వారు బెయిలుపై విడుదలయ్యారు. ఈ కేసు విచారణ చేపట్టిన సీబీసీఐడీ ఇప్పటివరకు 300 మందిని విచారించింది. ఈ కేసులో ముఖ్యమైన నిందితుడుగా భావిస్తున్న సయాన్‌ను ఇప్పటికే ఒకసారి సీబీసీఐడీ పోలీసులు విచారించారు. ఈ కేసులో అతనిని మళ్లీ విచారించాలని నిర్ణయించి సీబీసీఐడీ పోలీసులు సమన్లు జారీచేశారు. ఆ ప్రకారం, గురువారం కోవై గాంధీపురంలోని సీబీసీ ఐడీ కార్యాలయంలో జరిగిన విచారణకు సయాన్ హాజరయ్యాడు.

## భారత్-పాక్ మధ్య యుద్ధం వస్తే.. ఎవరి సైనిక, ఆయుధ శక్తి ఎంత?

భారత్, పాకిస్తాన్ మధ్య సంబంధాలు పూర్తిగా క్షీణించి.. ఉద్రిక్తతలు మరింత తీవ్రం అయ్యాయి. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్‌ను దెబ్బకొట్టేందుకు.. భారత్ దాడి చేయాల్సిందేనని డిమాండ్లు దేశవ్యాప్తంగా వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలతో అలర్ట్ అయిన పాక్.. సరిహద్దుల్లోకి సైన్యాన్ని మోహరించింది. ఈ పరిస్థితులు చూస్తుంటే.. ఏదైనా చిన్న సంఘటన అయినా.. రెండు దేశాల మధ్య యుద్ధానికి దారి తీసే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఎప్పుడేం జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఒక వేళ భారత్-పాక్ మధ్య యుద్ధం వస్తే.. ఎవరి సైనిక శక్తి, ఆయుధ శక్తి ఎంత ఉంది. భారత సైన్యంతో పాక్ ఆర్మీ ఎంత వరకు పోరాడగలుగుతుంది. భారత్ పాక్ మధ్య ఇప్పుడు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొనగా.. తాజాగా పహల్గామ్ ఉగ్రదాడితో అవి తారస్థాయికి చేరుకున్నాయి. ఇప్పటికే పాకిస్తాన్‌పై అనేక ఆంక్షలు విధించిన భారత్.. బుధవారం కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ సమావేశమై 5 కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో సింధూ జలాల పంపిణీ ఆపడం, పాక్ వాసులకు వీసాల రద్దు, అట్టారీ సరిహద్దు మూసివేత, భారత్‌లోని పాక్ అధికారుల తొలగింపు, ఇస్లామాబాద్‌లోని భారత అధికారులను వెనక్కి రప్పించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలకు ప్రతీకారంగా భారత్‌పై పాక్ కూడా అలాంటి నిర్ణయాలే తీసుకుంది. సిమ్లా ఒప్పందం రద్దు, భారత్‌తో వాణిజ్య సంబంధాలు తెంచుకోవడం, పాక్ ఎయిర్‌స్పేస్‌ను భారత్ ఉపయోగించుకోకుండా అడ్డుకోవడం, భారతీయులకు సార్క్ వీసాలు రద్దు, ఇస్లామాబాద్‌లోని భారత దౌత్య అధికారుల తగ్గింపు సహా పలు నిర్ణయాలు తీసుకుంది. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొంది. భారత్‌తో పోల్చుకుంటే పాకిస్తాన్ జనాభా పరంగా, సైనిక పరంగా, ఆయుధాల పరంగా, ఆర్థిక పరంగా, రాజకీయ పరంగా, అంతర్జాతీయ సహకారం పరంగా అన్ని రంగాల్లో వెనకబడే ఉంది. ఇప్పటికే అడుక్కుతినే స్థాయిలో ఉన్న పాకిస్తాన్.. భారత్‌తో యుద్ధం వస్తే ఇంకా పాతాళానికి పడిపోతుందనే విషయం తెలిసినా.. ఆ దేశం కవ్వింపు చర్యలకు దిగుతూనే ఉంది. విదేశీ మారక నిల్వలు పూర్తిగా అడుగంటిపోయి.. రోజు గడవాలంటే విదేశాలు, విదేశీ సంస్థలు, అంతర్జాతీయ సంస్థల వద్ద చేతులు చాచి అడుక్కుంటోంది. పాక్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర పతనావస్థలో ఉంది. మరోవైపు.. అంతర్గతంగా పాక్‌లో అనేక రాజకీయ, వేర్పాటువాద సవాళ్లు ఉన్నాయి. ప్రభుత్వం, సైన్యం మధ్య కూడా సఖ్యత లేదు. ఒకవైపు ప్రత్యేక దేశం కోసం ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్న బలూచిస్తాన్.. ఇటీవలి కాలంలో పాక్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ఇలాంటి సమయంలో భారత్‌తో యుద్ధం అంటే పాకిస్తాన్ ఇంకా నష్టపోవాల్సిన పరిస్థితే ఉంటుంది. మరోవైపు.. సైనిక పరంగా, ఆయుధాల పరంగా, రక్షణ శాఖ బడ్జెట్ పరంగా చూస్తే.. భారత్‌తో అసలు పాకిస్తాన్ పోటీపడే స్థితిలో కూడా లేదు. భారత్ వద్ద 14 లక్షల మంది సైనికులు ఉండగా.. పాకి స్తాన్ వద్ద కేవలం 6.5 లక్షల మంది సైన్యం మాత్రమే ఉంది. ఇక రిజర్వ్ ఫోర్స్‌లు భారత్ వద్ద 11 లక్షలు ఉండగా.. పాకిస్తాన్‌కు కేవలం 5 లక్షలు మాత్రమే ఉంది. 2024లో భారత రక్షణ బడ్జెట్ 81 బిలియన్ డాలర్లు కాగా.. పాకిస్తాన్ రక్షణ బడ్జెట్ 11 బిలి యన్ డాలర్లు మాత్రమే కేటాయించారు. ఫైటర్ జెట్‌లు (సుఖో య్-30 ఎంకేఐ, రఫేల్) భారత్ వద్ద 600 కంటే ఎక్కువ ఉండ గా.. పాకిస్తాన్ వద్ద 350 (జేఎఫ్-17, ఎఫ్-16, మిరాజ్) ఉన్నాయి. యుద్ధ ట్యాంకులు భారత్ వద్ద 4,500కు పైగా ఉండగా.. పాక్ వద్ద కేవలం 2,400 మాత్రమే ఉన్నాయి. నౌకా శక్తిలో భారత్ వద్ద 1 ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, డిస్ట్రాయర్స్, సబ్ మెరైన్లు ఉన్నాయి. కానీ పాకిస్తాన్ వద్ద నౌకా శక్తి పరిమిత సంఖ్య లోనే ఉంది. ఇక న్యూక్లియర్ ఆయుధాలు భారత్ వద్ద 160 నుంచి 170 ఉన్నట్లు అంచనా ఉండగా.. అదే పాకిస్తాన్ వద్ద 160 నుంచి 165 అణ్వాయుధాలు ఉన్నట్లు అంచనా ఉంది. ఈ ఒక్క అణ్వాయుధాల విషయంలో మాత్రం భారత్‌ను ఢీకొట్టే సత్తా పాకిస్తాన్‌కు కనిపిస్తోంది. మిస్సైల్ శక్తిలో భారత్ వద్ద అగ్ని, బ్రహ్మోస్ వంటి అగ్రశ్రేణి బాలిస్టిక్ క్షిపణులు, క్రూయిజ్ మిస్సై ళ్లు ఉన్నాయి. అదే పాక్ వద్ద షాహీన్, గౌరీ, బాబుర్ మిస్సైళ్లు ఉన్నాయి.

**భారత్-పాక్ యుద్ధానికి అవకాశం ఉందా?**

పహల్గామ్ ఉగ్రదాడిని భారత్ చాలా తీవ్రంగా పరిగణిస్తోంది. అంతేకాకుండా ఈ దాడి చేసిన ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తీసుకువచ్చి మట్టిలో కలిపేస్తామని.. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర హెచ్చరికలు చేశారు. కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇలాగే తీవ్రంగా స్పందించారు. నేరుగా యుద్ధమార్గాన్నే ఎంచుకోకుండా భారత్ పలు దౌత్య, ఆర్థిక పరంగా చర్యలు తీసుకుంటోంది.

అయితే యుద్ధం విషయంలో భారత్ పెట్టుకున్న రూల్ మాత్రం ఎన్నటికీ మారదు. మొదట ప్రత్యర్థి దాడి చేస్తేనే.. దానికి ప్రతిస్పందించడం తప్ప..

భారత్ ఎన్నడూ మొదట యుద్ధానికి కాలు దువ్వదు. ప్రస్తుతం ఇరు దేశాల సరిహద్దుల వద్ద పర్యవేక్షణ పెరిగినా, సైన్యం, ఆయుధాలను మోహరించినా.. యుద్ధం జరగడం అనేది చివరి పరిష్కారంగా మాత్రమే రెండు దేశాలు భావిస్తున్నాయి. ఎందుకంటే ఒకసారి యుద్ధం గనక ప్రారంభమైతే.. రెండు దేశాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. సైనిక పరంగా పాక్ కంటే అత్యంత బలంగా ఉన్న భారత్.. పాక్ కవ్విస్తే తప్ప యుద్ధభూమిలో అడుగుపెట్టదు. అయితే పాక్ వద్ద అణ్వాయుధాలు భారీగా ఉండటం.. తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకసారి అణ్వాయుధాలు ప్రయోగిస్తే.. దాని వల్ల కలిగే నష్టం ఊహించడం కూడా చాలా కష్టంగా ఉంటుంది.

# వక్ఫ్ వాట్సాప్ వర్సిటీ పరిజ్ఞానం

మాజీ ఎంపీ, ప్రస్తుత బీజేపీ నాయకులు బూర నర్సయ్య గౌడ్ 'ముస్లిం సంక్షేమానికే వక్ఫ్ సవరణలు' పేరుతో వ్యాసం రాశారు. ఈ వ్యాసంలోని విషయాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. వాట్సాప్ యూనివర్సిటీలో మోదీ భక్తులు చేసే ప్రచారాలతో ప్రభావితమై రాసినట్టు ఉంది. భారతదేశంలో రక్షణ రంగం, రైల్వేల తర్వాత అత్యధిక ఆస్తులు వక్ఫ్ సంపదే అని రాశారు. ఇది అవాస్తవం. తమిళనాడు, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఈ నాలుగు రాష్ట్రాలలోనే 14 లక్షల ఎకరాల ఎండోమెంట్ భూములు ఉంటే దేశవ్యాప్తంగా ఎన్ని లక్షల ఎకరాలు ఉండొచ్చు? రాజ్యసభ సభ్యులు కపిల్ సిబల్ ఇదే విషయాన్ని సభలో ప్రస్తావించిన విషయం మనం చూశాం. వాస్తవాలు ఇలా ఉంటే మోదీ అనుకూల మీడియాలో సాగుతున్న తప్పుడు ప్రచారాన్నే నర్సయ్య గౌడ్ కూడా కొనసాగించారు. 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణ చేసి సెక్షన్ 40 తీసుకువచ్చిందని, ఈ సెక్షన్ ప్రకారం ఏ భూమినైనా వక్ఫ్ ఆస్తిగా ప్రకటించే అవకాశం ఉందని, ఇలా దేశవ్యాప్తంగా 36 లక్షల ఎకరాల భూమిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించారని బూర నర్సయ్య గౌడ్ అన్నారు. ఏ కోర్టుకు కూడా ఈ చర్యలను సమీక్షించే అవకాశం లేదన్నారు.

ఇది కూడా వాట్సాప్ యూనివర్సిటీ చేసే అబద్ధ ప్రచారమే. ప్రస్తుతం దేశంలోని వక్ఫ్ బోర్డుల పరిధిలో 9 లక్షల ఎకరాల భూమి ఉందని కేంద్ర ప్రభుత్వం బిల్లుపై చర్చలో ప్రకటించింది. మరి ఈ 36 లక్షల ఎకరాల భూమి ఎక్కడి నుండి వచ్చింది? ఇక వక్ఫ్ చట్టం 1995 సెక్షన్ 40 గురించి వాస్తవం చూద్దాం. ఈ సెక్షన్ ప్రకారం ఏదేని ఆస్తి వక్ఫ్‌దా కాదా? అన్న వివాదం వచ్చినప్పుడు విచారణ జరిపి నిర్ణయం తీసుకునే అధికారం వక్ఫ్ బోర్డుకు ఉంటుంది. బోర్డు నిర్ణయంపై ఎవరికైనా అభ్యంతరం ఉంటే వక్ఫ్ ట్రిబ్యునల్‌ని ఆశ్రయించవచ్చు. ట్రిబ్యునల్ తీర్పుపై కూడా అభ్యంతరం ఉంటే హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోరును కూడా ఆశయించవచు. అంటే. ఏదెనా





ఆస్తిని వక్ఫ్ బోర్డు తనదని క్లెయిమ్ చేసుకుంటే, దానిని న్యాయస్థానాలలో సవాలు చేయవచ్చు. కానీ ఆ అవకాశం లేదంటూ తీవ్ర దుష్ప్రచారం చేసి ప్రస్తుత సవరణ చట్టంలో సెక్షన్ 40ని తొలగించారు. వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టకముందే, తనదైన శైలిలో బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ ద్వారా వక్ఫ్ ఆస్తులపై, వక్ఫ్ బోర్డులపై తీవ్రమైన దుష్ప్రచారం చేసింది. జనబాహుళ్యంలో వక్ఫ్ బోర్డు అంటే ఒక భూ మాఫియా సంస్థగా, హిందువుల ఆస్తులను, దేశ ఆస్తులను కబళించే ఒక సంస్థగా చిత్రీకరించింది. నూతన సవరణ చట్టం ప్రకారం వక్ఫ్ బోర్డులో ముస్లింలలోని షియా, ఆఘఖాని, బోరా, ఇస్మాయిలి వర్గాలకు ప్రాతినిధ్యం లభిస్తుందని నర్సయ్య గౌడ్ అన్నారు. కానీ వాస్తవం ఏంటంటే ప్రస్తుతం ఉన్న వక్ఫ్ బోర్డులను విభజించి 'ఆగాఖాని వక్ఫ్ బోర్డు', 'జొహరా'ల కొరకు ప్రత్యేక వక్ఫ్ బోర్డులను ఏర్పాటు చేయడం అన్నది ముస్లిం సమాజంలో చీలిక తేవడానికి ఉద్దేశించినది. ఇది 'విభజించి పాలించు' సూత్రానికి పరాకాష్ఠ. 1995 వక్ఫ్ చట్టం 14 ప్రకారం ప్రభుత్వం ఒక సున్నీ, ఒక షియా, ఒక ముస్లిం మహిళను రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు నామినేట్ చేస్తుంది. నూతన సవరణలతో కేంద్ర ప్రభుత్వం కొత్తగా ముస్లింలలోని వర్గాలకు చేసే న్యాయం ఏమిటో నర్సయ్య గౌడ్‌కే తెలియాలి. ఒక్క ముస్లిం వ్యక్తికి కూడా అసెంబ్లీకి గాని, పార్లమెంటుకు గాని టికెట్ ఇవ్వని, ప్రతీ అంశంలో హిందూ ముస్లింల మధ్య విభజన తేవడానికి ప్రయత్నించే బీజేపీ.. ఈ వక్ఫ్ సవరణలతో ముస్లింలలోని వెనుకబడిన వర్గాలకు న్యాయం చేస్తామని ప్రకటించినంత మాత్రాన ముస్లింలు ఎలా నమ్ముతారో నర్సయ్య గౌడ్ చెప్పాలి. వెనుకబడిన ముస్లింలకు బోర్డులో ప్రాతినిధ్యం లభించడం ఏమో కానీ, ప్రస్తుత సవరణతో ఇద్దరు ముస్లిమేతరులను ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకి నామినేట్ చేస్తోంది. ముస్లిం ధార్మిక సంస్థలో ఇతర మతస్తుల ప్రవేశం దేనిని సూచిస్తుంది? హిందూ ఎండోమెంట్ సంస్థలలో ముస్లింలకు ఇలా అవకాశం కల్పిస్తారా? హిందూ దేవాలయాల్లో స్వీపర్ పోస్టులో కూడా అన్యమతస్తులు ఉండకూడదని వాదించే బీజేపీకి చెందిన దీనికి బూర నర్సయ్య దీనిని ఎలా సమర్థించుకుంటారు? ప్రస్తుతం 75శాతం వక్ఫ్ భూములు కబ్జా అయ్యాయని, సవరణ చట్టంతో ఈ కబ్జాలను అరికడతామని ఆయన అన్నారు.

కానీ ప్రస్తుత సవరణ చట్టం ద్వారా 1995 వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 107, 108, 108లు తొలగించడం వలన వక్ఫ్ ఆస్తుల ఆక్రమణదారులు లిమిటేషన్ యాక్ట్ 1963 ప్రకారం తమ కబ్జాలను శాశ్వతపరచుకొని, తద్వారా వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కావడానికి పూర్తి అవకాశం కలుగుతుంది. సెక్షన్ 108ను సవరించి వక్ఫ్ రూల్స్ తయారు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాల నుండి కేంద్రం గుంజుకోవడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం. నూతన చట్టంతో వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచి, పేద ముస్లింల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని బూర నర్సయ్య అంటున్నారు. అదే నిజమైతే వక్ఫ్ బోర్డుకు వచ్చే కమర్షియల్ లీజ్ రెంటును 7 శాతం నుండి 5 శాతానికి ఎందుకు తగ్గించారు? కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వచ్చిన సచార్ కమిటీ తన నివేదికలో పేర్కొన్న వక్ఫ్ నిర్వహణకు సంబంధించిన విషయాలను కేంద్ర మైనారిటీ శాఖ మంత్రితో పాటు నర్సయ్యగౌడ్ వంటి నేతలు పదేపదే ప్రస్తావిస్తున్నారు. మరి, గత పదకొండేళ్ల మోదీ పాలనలో ఒక్కసారైనా సచార్ కమిటీ నివేదికను పరిశీలించారా, ఒక్క సూచననైనా అమలు చేశారా, కబ్జాకు గురైన ఒక్క ఎకరం వక్ఫ్ భూమినైనా స్వాధీనం చేసుకొని వక్ఫ్ బోర్డుకి అప్పగించారా? మచ్చుకైనా లేదు. మరి సచార్ కమిటీ గురించి వల్లె వేయడం రాజకీయాలలో భాగం కాదా? 'పేద ముస్లింల సంక్షేమం' అన్న అందమైన ముసుగు తొడిగిన ఈ నూతన సవరణ చట్టం వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ముస్లింల పాత్రను తగ్గిస్తుంది. ముస్లిమేతరులు ముఖ్యంగా ప్రభుత్వ తాబేదార్ల ప్రమేయాన్ని పెంచి, లక్షల ఎకరాల వక్ఫ్ భూములను బడా వ్యాపారవేత్తలకు కట్టబెట్టడానికి మార్గం సుగమం చేశారు. దేశహితాన్ని, మత ఐక్యతను కోరేవారు ఎవరూ కూడా ఈ చట్టంలోని ఏ ఒక్క సవరణనూ అంగీకరించడం లేదు.

# సమాచార కమిషనర్లను నియమించాలి



అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా వర్ధిలుతున్న భారతదేశంలో సమాచార హక్కు చట్టం -2005 అమలులోకి రావడం వెనుక మేధావుల సైద్ధాంతిక దార్శనికతలు, స్వచ్ఛంధసంస్థల జనజాగృతులు మరియు ప్రజల వీరోచిత పోరాటోద్యమాల నిర్విరామ కృషిఎంతగానో ఉంది. ప్రజలకు సుపరిపాలన అందించడం లక్ష్యంగా 2005 అక్టోబర్ 12 నాడుదేశంలో సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చింది. అవినీతిని నిరోధించడంలోపౌరులకు ఉన్న ఏకైక బ్రహ్మస్త్రం'గా ఈ సమాచార హక్కు చట్టం ఎంతగానోదోహదపడుతూనే ఉంది. కాని ఈ సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్లుకావస్తున్ననూ కూడా నేటికిని కూడా ఈ చట్టం సజావుగా అమలుకు నోచుకోకపోవడంలేదు. ఫలితంగా సమాచార హక్కు లక్ష్యాలు నీరుగారి పోతున్నాయి. ముఖ్యంగా సమాచార హక్కు చట్టం - 2005 ప్రకారం రాష్ట్ర సమాచార కమీషన్‌లో ఒకప్రధాన సమాచార కమీషనర్ తో పాటు గరిష్టంగా పది మంది సమాచార కమిషనర్లుఉంటారు. కాని నేడు తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన సమాచార కమీషనర్ గాను బాధ్యతలునిర్వహించిన బుద్ధా మురళి మరియు మిగతా కొందరు సమాచార కమీషనర్లు పదవీవిరమణ చేసి రెండేళ్లకు పైగానే గడిచిపోయింది. 2023 ఫిబ్రవరి 24 నాడు చివరి సమాచారకమీషనర్ కూడా పదవి విరమణ చేశారు. అయిననూ కూడా నేటికిని తెలంగాణ రాష్ట్రసమాచార కమీషనర్ల నియామకాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగాఎండమావిగ మిగిలిపోవడం కడు విచారకరం. తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ కార్యాలయంలో ఈ రకంగా ప్రధాన సమాచారకమీషనర్ సహా సమాచార కమిషనర్ పదవులు ఏకంగా సంవత్సరాలకు తరబడి ఖాళీగాఉన్నందున పౌరులు




సమాచారం కోసం అప్పీలు చేసుకుంటున్నా కూడా వాటిని స్వీకరించిపక్కన పెట్టుకుంటున్నారు. తత్ఫలితంగా సమాచార కమీషన్ కార్యాలయం లోదరఖాస్తుదారుల సమాచార హక్కు అప్పీళ్లు పేరుకుపోతూనే ఉన్నాయి. 2024 డిసెంబర్28 నాటికి 10,688 అప్పీళ్లు సమాచార కమీషన్ కార్యాలయంలో పెండింగ్ లో ఉన్నాయి. రోజురోజుకు ఈ అప్పీళ్లు పెరిగిపోతూనే ఉన్నాయి. ఇలా అధిక మొత్తంలో అప్పీళ్లుపెండింగ్‌లో ఉంటున్నాయి. తత్ఫలితంగా నాటి నుండి నేటి వరకు కూడా ఏ ఒక్క కేసుపరిష్కారానికి నోచుకోకపోవడం గమనార్హం. అయిననూ నేటికిని ఆయా సమాచారకమీషనర్ల స్థానంలో కొత్త కమిషనర్లను నియమించకపోవడంతో దరఖాస్తుదారులుఎదుర్కొంటున్న అవస్థలు వర్ణనాతీతం. అందు వలన రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమాచారకమీషనర్లను నియమించాలి అని ప్రజలు మరియు సమాచార కార్యకర్తలు అడపాదడపాడిమాండ్స్ చేస్తూనే ఉన్నారు. సమాచార కమీషనర్లు ఉన్నప్పుడు అరకొర సమాచారం అయిననూ పౌరులకుఅందుబాటులోకి వచ్చేది. ఇప్పుడు ఏకంగా కమీషనర్లు లేకపోవడం మూలంగా ఏ చిన్నసమాచారాన్ని కూడా ప్రజలు పొందలేక పోతున్నారు. సమాచార కమీషన్ కార్యాలయంలోఆయా సమాచార కమీషనర్ పోస్టులు రెండేళ్లకు పైగానే భర్తీకి నోచుకోకపోవడం అంతిమంగా 'సమాచార హక్కు చట్టం లక్ష్యాలు అసలుకే ఎసరులా ఆవిరి అవుతున్నాయి' అనిచెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. 'త్వరలో సమాచార కమీషన్ల నియామకం కోసంసెర్చ్ కమిటీని ఏర్పాటు చేస్తాం. దీనికోసం నాలుగు వారాల గడువు కావాలి' అని ప్రభుత్వంగతంలో హైకోర్టుకు నివేదించిననూ ఆ దిశగా ఏమాత్రం పురోగతి కనిపించడం లేదు. అందువలన ఇకనైననూ ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా సమాచార కమీషనర్లనునియమించేందుకు సమర్థవంతంగా కసరత్తుని చేపట్టాల్సిన అవసరం నేడు తప్పకుండాఉంది. తద్వారా ప్రజలు సమాచార వారధిలో మరింతగా ముందడుగు వేయడానికి ఎంతగానో దోహదపడుతుంది అని చెప్పవచ్చు.

- జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690



# అలా ఆచరిస్తే ఫలాలు అక్షయం



వసంత ఋతువులో చైత్ర, వైశాఖ మాసాలు అక్షయుడైన మహా విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైనవి. లక్ష్మీసమేతుడైన విష్ణువును ఈ మాసాలలో... ప్రధానంగా వైశాఖ శుద్ధ తదియనాడు భక్తి శ్రద్ధలతో పూజించడం శ్రేయోదాయకమని, ఆ రోజు చేసే వ్రతమైనా, జపమైనా, దానాలైనా అక్షయమైన ఫలితాలను ఇస్తాయని 'భవిష్యోత్తర పురాణం' చెబుతోంది. ఆ పవిత్రమైన రోజునే 'అక్షయ తృతీయ'గా నిర్వహించుకోవడం సంప్రదాయంగా స్థిరపడింది.

'అక్షయం' అంటే 'నాశనం లేనిది', 'తరుగు లేనిది' అని అర్థం. అక్షయ తృతీయ... త్రేతాయుగాదిగా, పరశు రామ జయంతిగా, బలరామ జయంతిగా ప్రసిద్ధి చెందింది. ఎన్నో పురాణ గాథలు ఈ పవిత్ర దినంతో ముడిపడి ఉన్నాయి. భాగవత పురాణంలో హిరణ్యాక్ష, హిరణ్య కశిపుల గాథ విశేషమైనది. ఆ సోదరులు ఇరువురు విష్ణు ద్వేషులు. వారిని సంహరించడానికి వరాహ, నారసింహ అవతారాలను శ్రీహరి దాల్చవలసి వచ్చింది. వరాహావతారంలో హిరణాక్షుడిని శ్రీహరి వధించాడు. హిరణ్యకశిపుడి కుమారుడు ప్రహ్లాదుడు తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే నారాయణ భక్తుడు. లోకకంటకుడై, కుమారుణ్ణి సైతం ఎన్నో కష్టాలకు గురిచేసి, చంపాలని ప్రయత్నించిన హిరణ్యకశిపుణ్ణి నృసింహావతారంలో శ్రీహరి సంహరించాడు. ఉగ్రరూపుడైన నరహరి... ప్రహ్లాదుడి కోరికమేరకు శాంతించాడు. వరాన్ని కోరుకోమన్నాడు. హిరణ్యాక్ష, హిరణ్యకశిపులను వధించిన వరాహ, నారసింహ రూపాలలో... లక్ష్మీదేవితో కలిసి దర్శనం ఇవ్వాల్సిందిగా ప్రహ్లాదుడు ఆయనను వేడుకున్నాడు. అప్పుడు ఆ రెండు రూపాలను జోడించి, సతీ సమేతుడై... శ్రీ వరాహ లక్ష్మీ నారసింహుడిగా... శాంత వదనంతో ప్రహ్లాదుడి ముందు శ్రీహరి సాక్షాత్కరించాడు. సింహాచలంలో వెలిశాడు. ఆ రోజు అక్షయ తృతీయ.

**సింహగిరిపై చందనోత్సవం**

ప్రహ్లాదుడి అనంతరం స్వామి విగ్రహానికి పూజాదికాలు లేక మరుగునపడింది. దానిపై పుట్ట పెరిగింది. కొంతకాలం తరువాత... షట్చక్రవర్తులలో ఒకరైన పురూరవుడు... ఊర్వశితో కలిసి విహరిస్తూ, సింహగిరిపై విశ్రమించాడు. అతనికి స్వామి కలలో కనిపించి... తన విగ్రహాన్ని వెలికి తీసి, ఆలయం నిర్మించాలని ఆదేశించాడు. మరుసటిరోజు ఉదయం పూరురవుడు ఆ ప్రాంతంలోని పుట్టను తొలగించి, స్వామిని బయటకు తీసి, క్షీరంతో అభిషేకించి, పూజలు చేశాడు. ఆ రోజు వైశాఖ శుద్ధ తదియ. భక్తులకు ఏడాదిలో ఒక రోజు తన నిజరూపాన్ని దర్శనం చేసుకొనే వీలు కల్పించాలని, మిగిలిన రోజుల్లో... తన విగ్రహం దొరికిన పుట్ట బరువుకు సమానమైన చందనాన్ని తన విగ్రహానికి పూయాలని పురూరవుడికి స్వామి ఆదేశాన్ని ఇచ్చాడు. సింహగిరీశుడు ఆవిర్భవించిన ఆ రోజున సింహాచలంలో చందనోత్సవం జరుగుతుంది. ఆ రోజున స్వామి నిజరూపంలో కనిపిస్తారు. ఆ తరువాత... చందనాన్ని వైశాఖ శుద్ధ తదియ, వైశాఖ, జ్యేష్ట, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో... నాలుగు విడతలుగా పూస్తారు. ఏడాది పొడవునా సింహగిరీశుడు లింగాకారంలో భక్తులకు దర్శనమిస్తారు.

ఇదే రోజున పూరీలో జగన్నాథ, సుభద్ర, బలభద్రుల ఆలయ సంప్రోక్షణ, ఆ తరువాత చందనోత్సవం జరుగుతాయి. ఆషాఢ శుద్ధ విదియనాడు నిర్వహించే రథోత్సవం నిమిత్తం... ఆ ముగ్గురు మూర్తులకు మూడు రథాలు నిర్మించడానికి అంకురారర్పుణ చేస్తారు. కాగా, శ్రీకృష్ణుడి ఆదేశం మేరకు సూర్యుణ్ణి ధర్మరాజు ప్రార్థించి అక్షయపాత్రను పొందడం, అర్జునుడు అక్షయ తూణీరాలను పొందడం, విశ్వామిత్రుడి ద్వారా సకల విద్యలతో పాటు అక్షయ తూణీరాలను అందుకోవడం లాంటి కథలు కూడా అక్షయ తృతీయతో ముడిపడి వినిపిస్తూ ఉంటాయి.

ఎన్నెన్నో విశ్వాసాలు...

అక్షయ తృతీయను అత్యంత శుభప్రదమైన రోజుగా పూర్వులు పేర్కొన్నారు. ఈ రోజు చేసే భక్తి శ్రద్ధలతో ఆచరించే ఏ పుణ్యకార్యమైన అనంతమైన పుణ్యఫలాలను ఇస్తుందన్న కారణంగానే పూర్వ ఋషులు ఈ పేరు పెట్టారని పెద్దలు చెబుతారు. కొత్త కార్యక్రమాలను ప్రారంభించడానికి అత్యంత పవిత్రమైనది భావిస్తారు. గృహిణులు వీసమెత్తు బంగారాన్నైనా కొని, లక్ష్మీదేవి ముందు ఉంచి పూజిస్తే... వారి సంపద అక్షయం అవుతుందనే నమ్మకం ఉత్తర భారతదేశంలో ఉంది. అది ఇపుర్ఘుడు దేశమంతటా వ్యాపించింది. ఈ రోజు లక్ష్మీ నారాయణులను, గౌరీ శంకరులను అర్చిస్తే త్వరగా వివాహం అవుతుందనే విశ్వాసం కూడా ఉంది. అలాగే అక్షయ తృతీయ రోజున సంపద్గౌరీ వ్రతాన్ని ఆచరిస్తే... సౌభాగ్యం, సంపదలు లభిస్తాయనేది పురాణ వచనం. కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ పనులను ఈ రోజున ప్రారంభిస్తారు. దీనివల్ల ఫలసాయం సమృద్ధిగా లభిస్తుందనే నమ్మకం ఉంది.




నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
శనివారం
26 ఏప్రిల్ 2025




## జిడ్డును అడ్డుకోండి!

కొందరి చర్మం.. జిడ్డుగా ఉంటుంది. సెబమ్ గ్రంథులు అధికంగా నూనెలను ఉత్పత్తి చేయడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. ఇంకొందరిలో జన్యుపరంగా ఉంటే, మరికొందరిలో హార్మోన్ల అసమతుల్యత, ఒత్తిడి.. ఇలా రకరకాల కారణాలతో 'జిడ్డు చర్మం' ఇబ్బంది పెడుతుంది. ఇక వేసవిలోనైతే చెమటతో కలిసి.. మరింత అసౌకర్యాన్ని కలిగిస్తుంది. కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటించడం ద్వారా.. 'జిడ్డు చర్మం' సమస్యలకు ఇట్టే చెక్ పెట్టొచ్చని అంటున్నారు సౌందర్య నిపుణులు.

వేసవిలో చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం ముఖ్యం. ఇందుకోసం రోజుకు కనీసం 8–10 గ్లాసుల నీరు తాగాలి. ఫలితంగా శరీరంలోని విష పదార్థాలు బయటికి పోవడంతోపాటు జిడ్డు కూడా తగ్గుతుంది.

జిడ్డు చర్మం ఉన్నవారు ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. నూనెలో వేయించిన పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్, పాల ఉత్పత్తులను తగ్గించాలి. తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. ఇవి చర్మంలో నూనెల ఉత్పత్తిని నియంత్రించడంలో సాయపడతాయి.

చర్మం జిడ్డుగానే ఉంటుంది కాబట్టి వేసవిలో మాయిశ్చరైజర్స్, సన్‌స్క్రీన్ లోషన్స్ వాడాల్సిన అవసరం లేదని అనుకుంటే.. పొరపాటే! కాలానికి అనుగుణంగా ఉత్పత్తులను ఎంచుకోవాల్సిందే! అప్పుడే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. జిడ్డు చర్మం ఉన్నవారు ఆయిల్-ఫ్రీ, వాటర్ బేస్డ్ మాయిశ్చరైజర్స్‌ను వాడాలి. ఎస్పీఎఫ్ 30, అంతకంటే ఎక్కువ ఉన్న సన్‌స్క్రీన్ లోషన్.. వీరికి మంచి ఎంపిక. ఇవి చర్మాన్ని రక్షిస్తూనే.. జిడ్డును అదుపులో ఉంచుతాయి.వారానికి ఒకసారైనా ముల్తానీ మట్టి, బెంటోనైట్ క్లే మాస్క్‌ను వాడాలి. ఇవి అదనపు జిడ్డును తగ్గించడంతోపాటు చర్మాన్ని శుద్ధి చేస్తాయి.

# మార్కెట్లో దొరికే ప్రొడక్ట్స్ వాడే బదులు శనగపిండి రాయండి







వేసవిలో రోజు రోజుకి ఎండలు మండిపోతున్నాయి. ఎండాకాలంలో చర్మాన్ని కాపాడుకోవడం చాలా కష్టంగా ఉంటుంది. వేసవిలో తీవ్రమైన సూర్యకాంతి, దుమ్ము, చెమట కారణంగా అనేక రకాల చర్మ సమస్యలు మొదలవుతాయి. వేసవిలో చాలా మంది మొటిమలు, బ్లాక్ హెడ్స్, దద్దుర్లు, టానింగ్, వడదెబ్బ వంటి అనేక చర్మ సమస్యలను ఎదుర్కొంటారు. దీంతో వేసవిలో ముఖం చాలా నిస్తేజంగా, నిర్జీవంగా కనిపించడం ప్రారంభమవుతుంది. ఇక, చాలా మంది మండే ఎండల్లో చర్మాన్ని, ముఖాన్ని కాపాడుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు.

ముఖం మీద మార్కెట్లో దొరికే రకరకాల ప్రొడక్ట్స్ వాడుతుంటారు. వీటిలో చర్మానికి హాని కలిగించే రసాయనాలు ఉంటాయి. అందుకే వేసవిలో చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి కొన్ని ఇంటి చిట్కాలు ప్రభావవంతంగా పనిచేస్తాయి. కొన్ని సహజ పదార్థాలు ప్రభావవంతంగా పనిచేస్తాయి. అందులో శనగపిండి కూడా ఒకటి. శనగపిండి చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది. ఇది చర్మంపై ఉన్న మృత కణాలు, మురికి, జిడ్డును తొలగించడంలో సాయపడుతుంది. అంతేకాకుండా మొటిమలు, మచ్చలు, పిగ్మెంటేషన్, టానింగ్ సమస్యలకు ప్రభావవంతంగా పనిచేస్తుంది. శనగపిండిలో ఏం కలిపి రాస్తే ముఖం అందంగా మారుతుందో తెలుసుకుందాం.

వేసవిలో శనగపిండిలో రోజ్ వాటర్ కలిపి ముఖానికి అప్లై చేయవచ్చు. ఇందుకోసం ఒక గిన్నెలో 2 చెంచాల శనగపిండి తీసుకోండి. 2 చెంచాల రోజ్ వాటర్ వేసి బాగా కలపండి. ఇప్పుడు ఈ పేస్ట్ ని ముఖానికి అప్లై చేసి ఆరనివ్వండి. దాదాపు 10–15 నిమిషాల తర్వాత, ముఖాన్ని నీటితో వాష్ చేసుకోండి. ఇది మీకు సహజంగా మెరిసే చర్మాన్ని ఇస్తుంది. ఎండల బయట ఎక్కువ తిరిగేవారికి ఇది బెస్ట్ ఆప్షన్‌గా పనిచేస్తుంది.

శనగపిండి, పెరుగు

వేసవిలో పెరుగును శనగపిండితో కలిపి ముఖాన్ని శుభ్రం చేసుకోవచ్చు. ఇందుకోసం ఒక గిన్నెలో 2 చెంచాల శనగపిండి తీసుకోండి. దానికి 1–2 చెంచాల పెరుగు వేసి బాగా కలపండి. ఇప్పుడు ఈ పేస్ట్‌ని ముఖానికి అప్లై చేసి చేతులతో తేలికగా మసాజ్ చేయండి. దాదాపు 15 నిమిషాల తర్వాత, ముఖాన్ని నీటితో కడుక్కోండి. ఇలా చేయడం వల్ల చర్మపు మచ్చలు, మొటిమలు, పిగ్మెంటేషన్, టానింగ్ సమస్యలను వదిలించుకోవచ్చు. అంతేకాకుండా, చర్మం కూడా ప్రకాశవంతంగా మారుతుంది.

**శనగపిండి, నిమ్మకాయ**

వేసవిలో మెరిసే చర్మాన్ని పొందడానికి, శనగపిండిలో నిమ్మకాయను కలిపి ముఖానికి అప్లై చేయవచ్చు. ఎందుకంటే నిమ్మకాయలో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది చనిపోయిన చర్మ కణాలను తొలగించడంలో సాయపడుతుంది. అంతేకాకుండా, ఇది మచ్చలను, టానింగ్‌ను తొలగించడంలో కూడా సాయపడుతుంది. ఇందుకోసం ఒక గిన్నెలో రెండు చెంచాల శనగపిండి తీసుకోండి. దానికి ఒక చెంచా నిమ్మరసం, రోజ్ వాటర్ వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఈ పేస్ట్ ని ముఖానికి అప్లై చేసి ఆరనివ్వండి. దాదాపు 15 నిమిషాల తర్వాత ముఖాన్ని చల్లటి నీటితో కడగాలి. ఇది చర్మాన్ని మృదువుగా, ప్రకాశవంతంగా చేస్తుంది. అంతేకాకుండా చర్మం కూడా మెరుస్తుంది.

శనగపిండి, కలబంద

వేసవిలో, శనగపిండిని కలబందతో కలిపి ముఖానికి అప్లై చేయవచ్చు. కలబంద జెల్ చర్మాన్ని తేమగా, హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా, ఇది చర్మాన్ని చల్లబరుస్తుంది. దీని కోసం, ఒక గిన్నెలో 2 చెంచాల శనగపిండి తీసుకోండి. దానికి 2 టీస్పూన్ల తాజా అలోవెరా జెల్ వేసి బాగా కలపండి. ఇప్పుడు ఈ పేస్ట్‌ని ముఖానికి అప్లై చేసి, దాదాపు 15–20 నిమిషాల పాటు అలాగే ఉంచండి. ఆ తర్వాత ముఖాన్ని నీటితో కడగాలి. ఇది చర్మాన్ని మృదువుగా, ప్రకాశవంతంగా చేస్తుంది.

శనగపిండి, తేనె

వేసవిలో, శనగపిండిని తేనెతో కలిపి ముఖానికి అప్లై చేసుకోవచ్చు. ఇందుకోసం ఒక గిన్నెలో ఒక చెంచా శనగపిండి తీసుకోండి. దానికి 2 టీస్పూన్ల తేనె వేసి బాగా కలపండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి, దాదాపు 15 నిమిషాల పాటు అలాగే ఉంచండి. ఆ తర్వాత నీటితో ముఖాన్ని కడగాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై మొటిమలు, మచ్చలు, పిగ్మెంటేషన్ నుండి బయటపడవచ్చు.

# పాలు..లోపాలు!



పాలు.. చాలాకాలంగా ఆరోగ్యకరమైన ఆహారంలో ప్రధానమైనవిగా ఉంటున్నాయి. కాల్షియం, విటమిన్ డి లాంటి ప్రయోజనాలను శరీరానికి అందిస్తున్నాయి. అయితే, పాలలోనూ పలు లోపాలు ఉన్నాయని కొన్ని పరిశోధనలు తేల్చాయి. ముఖ్యంగా, మహిళల గుండె ఆరోగ్యంపై పాలు గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయని హెచ్చరిస్తున్నాయి.

పులియబెట్టని పాలు మహిళల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని తాజా అధ్యయనం ఒకటి హెచ్చరిస్తున్నది. వీటిని ఎక్కువగా తీసుకునే మహిళల్లో గుండె జబ్బుల ప్రమాదం పెంచుతుందని చెబుతున్నది. పురుషులతో పోలిస్తే పులియబెట్టని పాలు తీసుకునే మహిళలకు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం 21% ఎక్కువగా ఉన్నదనీ తేల్చింది. బీఎంసీ మెడిసిన్‌లో ఇటీవల ప్రచురితమైన ఈ అధ్యయనం.. పాలలోని లోపాలను ఎత్తిచూపుతున్నది. అయితే, పెరుగు, యోగర్ట్ వంటి పులియబెట్టిన పాల ఉత్పత్తులు.. ఈ విషయంలో ప్రయోజనకరంగా ఉన్నాయని చెబుతున్నది. ఈ అధ్యయనంలో భాగంగా పాల ఉత్పత్తులను ఎక్కువగా తీసుకునే మహిళల ఆరోగ్య వివరాలను పరిశోధకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పులియబెట్టని పాలను రోజుకు 300 మిల్లీలీటర్ల కన్నా ఎక్కువగా తీసుకునే మహిళల్లో కరోనరీ హార్ట్ డిసీజ్ వచ్చే అవకాశం ఉన్నదని తేల్చారు. ఈ పాల వల్ల ధమనులు ఇరుకుగా మారడం, గుండె కండరాలకు తగినంతగా రక్తం అందకపోవడం లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉన్నదని అంటున్నారు. వీరిలో కార్డియోమెటబాలిక్ ప్రొటీన్లు ఎక్కువగా అభివృద్ధి చెందుతాయనీ, అవి మధుమేహం, గుండె వ్యాధులు రావడానికి కారణం అవుతాయని చెబుతున్నారు. దీర్ఘకాలంలో గుండెపోటుకూ దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. పులియబెట్టని పాలలో డీ–గెలాక్టోస్ అనే చక్కెర ఉంటుంది. ఇది ఆక్సిడేటివ్ స్ట్రెస్‌తోపాటు ఇన్‌ఫ్లమేషన్‌ను ప్రేరేపిస్తుంది.ముఖ్యంగా మహిళల్లో హార్మోన్లలో తేడాలు, గట్ బ్యాక్టీరియా కారణంగా ఈ ప్రభావాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఇవి ఈస్ట్రోజెన్ ఉత్పత్తిపై ప్రభావం చూపుతాయి. ధమనుల గోడ లోపల కొవ్వు, ఇతర పదార్థాలు పేరుకుపోయే పరిస్థితిని పెంచుతాయి. అదే సమయంలో పులియబెట్టిన పాలతో ఈ సమస్య లేదట. అంతేకాకుండా పెరుగువంటి పదార్థాలు గుండెకు ప్రయోజనాలు అందిస్తాయని చెబుతున్నారు. గుండెకు రక్షణగా నిలిచే అనేక బయో యాక్టివ్ సమ్మేళనాలు పెరుగులో సమృద్ధిగా ఉంటాయి.లాక్టోబాసిల్లస్, బిఫిడోబ్యాక్టీరియం వంటి ప్రోబయోటిన్లు గట్ బ్యాక్టీరియాను వృద్ధి చేస్తాయి. గుండె జబ్బులకు కారణమయ్యే ఇన్‌ఫ్లమేషన్‌నూ తగ్గిస్తాయి. కాబట్టి మహిళలు పులియబెట్టిన పాలనే ఎక్కువగా తీసుకోవాలని పరిశోధకులు చెబుతున్నారు. డెయిరీ పాలకు బదులుగా.. బాదం, సోయా, ఓట్ పాలను ఎంచుకుంటే మంచిదని సలహా ఇస్తున్నారు.

# 60+ వయస్సులో





వయస్సు అనేది ఒక సంఖ్య మాత్రమే.. ప్రతిభ అనేది ఎవరినీ, ఎప్పటికీ విఫలం చేయదు.. దీనికి గడువూ, తేదీ అక్కర్లేదు'.. అంటున్నారు రవి బాలశర్మ. కోవిడ్ లాక్‌డౌన్ ఆమె జీవితంలో ఒక మలుపు తిప్పిందని.. ఆమె అభిరుచిని పునఃవ్యక్తీకరించే ఈ అవకాశం.. నెటిజన్ల ప్రశంసలు.. ఆమెకు అవార్డులని సంతోషం వ్యక్తం చేస్తున్నారామె. ఇప్పుడు రవి బాలశర్మ 'డ్యాన్స్ దాదీ'గా ఇన్‌స్టాగ్రామ్‌లో పేరొందారు. ఆమె ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌కు చెందినవారు. వయసు పెరిగే కొద్దీ అనుభవం, సానుకూల దృక్పథం అలవడాలి అంటారు ఈ బాల దాదీ. డ్యాన్స్‌దాదీ నేపథ్యం ఆమె మాటల్లోనే..

'మా నాన్నగారు సంగీత విద్వాంసులు. నేను ఆయన దగ్గర సంగీతం, తబలా నేర్చుకున్నాను. డ్యాన్స్ కూడా నాకు చాలా ఇష్టం. నేను కథక్ కొంతవరకు నేర్చుకున్నాను. ఫంక్షన్స్‌లో ప్రదర్శనలు ఇచ్చేదానిని. నా వివాహం అయిన తర్వాత, 1993లో ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో సంగీతం టీచరుగా ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత 2019లో రిటైర్ అయ్యాను.

లాక్‌డౌన్‌తో మలుపు..

చిన్నప్పటి నుంచి డ్యాన్స్ అంటే మక్కువ ఉన్నప్పటికీ కుటుంబంపై దృష్టి సారించడంతో వెనకడుగు వేయాల్సి వచ్చింది. లాక్‌డౌన్ నా జీవితంలో ఒక మలుపు అయింది. నా అభిరుచిని మళ్లీ కొనసాగించడానికి ఇదే సమయం అనుకున్నాను. నేను మొదట 30 సెకన్ల వీడియో చేశాను. అది వైరల్ అయింది. నా పిల్లలు కూడా నన్ను ప్రోత్సహించారు' అంటూ ఆనందంలో మునిగిపోయారామె.

ప్రశంసలే అవార్డులు..

నెటిజన్లే కాక గాయకుడు, నటుడు అయిన దిల్జిత్ దోసాంజ్, చిత్రనిర్మాత ఇంతియాజ్ అలీ వంటి ప్రముఖులు కూడా ఆమె వీడియోలకు ప్రశంసలు కురిపించారు. 'ఇంత పెద్ద వ్యక్తులు నా వీడియోకు స్పందిస్తారని కలలో కూడా అనుకోలేదు.. ఇదే నా జీవితంలో నేను ఊహించని అతిపెద్ద అవార్డు.. వయస్సు కేవలం ఒక సంఖ్య మాత్రమే.. మీ జీవితంలోని ఏ దశలోనైనా మీరు గుర్తింపు పొందవచ్చు' అంటూ హితవు చెబుతున్నారామె.

సానుకూల దృక్పథంతో..

'అరవై ఏళ్లు పైబడిన వారు అన్ని విషయాలలో సానుకూల దృక్పథంతో ఉండాలి. నా వయస్సులో ఉన్నవారు చాలా మంది కీళ్ల నొప్పులు, కొలెస్ట్రాల్, అనేక ఇతర వయస్సు సంబంధిత వ్యాధుల గురించి మాట్లాడతారు. అటువంటి వ్యాధులతో పోరాడటానికి సానుకూల దృక్పథం కీలకమని నేను భావిస్తున్నాను. అది డ్రాయింగ్, పెయింటింగ్ లేదా వంట, మనకిష్టమైనది ఏదైనా సరే. అలా భావించాను కాబట్టే నేను ఇప్పుడు ఒక రాక్‌స్టార్ దాదీని అయ్యాను' అంటారు మన డ్యాన్స్‌దాదీ. వయస్సు ప్రతిభకు ప్రతిబంధకం కాకూడదనేది ఆమె అభిప్రాయం. 'నాకెలాంటి కష్టాలూ ఉండవు.. నాకన్నీ సంతోషాలే అని మీరనుకోవచ్చు. కానీ నేనూ చాలా కష్టాలు అనుభవించాను. వాటిని అధిగమించడానికి ఏం చేయాలా అని ఆలోచించాను. అప్పుడే నిర్ణయించుకున్నాను. నాకు చిన్నప్పటి నుండి ఇష్టమైన డ్యాన్స్ చేయాలనుసీ.. అది అందరికీ ఆత్మస్థైర్యాన్ని ఇచ్చేదిగా ఉండాలనీ వీడియోలు చేయటం..అవి వైరల్ అవుతుంటే మరింత శక్తిని పుంజుకోవటం నా వంతయింది' అంటారామె.

కాళ్ళతోనే కాదు.. కళ్ళతోనూ..

మాధురీ దీక్షిత్ నటించిన 'దిల్ తో పాగల్ హై' సినిమాలో 'కోయి లడ్కి హై' పాటకు బాలా చేసిన డ్యాన్స్, అభినయం మాధురికి ధీటుగా ఉన్నాయి. పాటకి అనుగుణంగా హావభావాలు.. డ్యాన్స్ అంటే కాళ్లతోనే కాదు కళ్లతో కూడా అభినయాలు పలికించవచ్చని చెప్పటం మాధురి ప్రత్యేక లక్షణం. అవన్నీ బాలా డ్యాన్స్‌లో నెటిజన్లని ఉత్తేజపరిచాయి. అలాగే శ్రీదేవి నటించిన 'ఇంగ్లిష్ వింగ్లిష్' లోని 'నవ్రారు మాఝీ' సినీ ప్రియులను బాగా ఆకట్టుకున్న పాట. దీనిలో శ్రీదేవిలానే చీరకట్టు.. ముస్తాబు.. స్టెప్పులు.. అభిమానులను అలరించాయి. 'మేడమ్.. మీ డ్యాన్స్ సూపర్బ్.. శ్రీదేవిని దించేశారు' అంటూ నెటిజన్ల ప్రశంసలు.

రవి బాలశర్మ అలియాస్ డ్యాన్స్‌దాదీకి ఇప్పుడు 64 ఏళ్ళు. ఆమె మానసికంగా, శారీరకంగా ఫిట్‌గా ఉండేందుకు డ్యాన్స్ ఒక మార్గమైంది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు 128 వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. మరి మనందరికీ ఆమె స్ఫూర్తి దాతే కదా!

## మిరియాలతో ముందుకొచ్చిన పొట్టను తగ్గించుకోవచ్చు



ఈ రోజుల్లో చాలా మంది అధిక బరువు, ఊబకాయం సమస్యలతో బాధపడుతున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా చాలా మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు అయితే, బరువు తగ్గడం కోసం చాలా మంది రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు ఆహారంలో మార్పులు చేసుకుంటే.. మరికొందరు జిమ్‌లు చుట్టూ తిరుగుతున్నారు. అయితే, చాలా మందిలో ఎక్కువ మార్పు కనిపించడం లేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా బరువు తగ్గలేకపోతున్నారు. ఇందుకు కొన్ని తప్పులు, పాటించే పద్దతుల్లో తేడాలు కారణం కావచ్చు.

అధిక బరువు వల్ల శారీరక రూపం ప్రభావితం అవ్వడమే కాకుండా అధిక రక్తపోటు, గుండె జబ్బులు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలు రావచ్చు. బరువు తగ్గడం కోసం ప్రతి ఒక్కరూ కఠినమైన వ్యాయామాలు చేయకపోయినా సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా అధిక బరువును నియంత్రించుకోవచ్చు. డైటీషియన్ నిపుణుల ప్రకారం నల్ల మిరియాల్ని ఆహారంలో చేర్చుకోవడం ద్వారా బరువు తగ్గించుకోవచ్చు. బరువు తగ్గడానికి నల్ల మిరియాల్ని ఆహారంలో ఎలా చేర్చుకోవాలో ఇక్కడ తెలుసుకుందాం.

**బరువు తగ్గడానికి నల్ల మిరియాలు**

నల్ల మిరియాల్లో పైపెరిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది జీవక్రియను పెంచుతుంది. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది. నల్ల మిరియాలు మంచి కొలెస్ట్రాల్ స్థాయిల్ని పెంచుతాయి. థర్మోజెనిక్ కావడం వల్ల, ఇది జీవక్రియను వేగవంతం చేయడంతో పాటు కేలరీలను వేగంగా బర్న్ చేయడంలో సాయపడుతుంది. నల్ల మిరియాలకు ఉన్న స్పైసీ కారణంగా కడుపు నిండిన భావన పెరుగుతుంది. ఎక్కువ తినాలనే కోరిక నియంత్రణలో ఉంటుంది. ఆహారంలో నల్ల మిరియాల్ని చేర్చుకోవడం వల్ల బరువు తగ్గే ప్రక్రియ వేగవంతం అవుతుందని అనేక అధ్యయనాలు పేర్కొన్నాయి. అయితే, నల్ల మిరియాల్ని ఆహారంలో ఎలా చేర్చుకోవాలో ఓ లుక్కేద్దాం.

బొప్పాయి, నల్ల మిరియాల పొడి:బొప్పాయి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ప్రధానంగా బొప్పాయి పండు జీర్ణవ్యవస్థకు చాలా మంచిదని భావిస్తారు. ఇక, బొప్పాయితో నల్ల మిరియాల పొడి కాంబినేషన్ ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది జీవక్రియను వేగవంతం చేసి.. కేలరీలను ఫాస్ట్‌గా బర్న్ చేస్తుంది. ఇందుకోసం ముందుగా మిరియాల్ని పొడిలా చేసుకోవాలి. ఆ తర్వాత కట్ చేసిన బొప్పాయి ముక్కలపై నల్ల మిరియాల పొడి చల్లుకుని తింటే సరిపోతుంది. ఒక ప్లేట్ బొప్పాయి కోసం, అర టీస్పూన్ నల్ల మిరియాలు ఉపయోగించండి. ఈ కాంబినేషన్ వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది.

వేడి నీటితో నల్ల మిరియాలు:ఒక గ్లాస్ వేడి నీటిలో అర టీ స్పూన్ మిరియాల పొడిని జోడించి తాగితే మంచి ఫలితాలు ఉంటాయి. దీన్ని ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో తాగాలి. ఇది జీర్ణ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉబ్బరం, మలబద్ధకం, కడుపు నొప్పి వంటి సమస్యల నుంచి రిలీఫ్ అందిస్తుంది. కేలరీలను వేగంగా బర్న్ చేయడంలో సాయపడుతుంది. అయితే, అప్పటికప్పుడు మిరియాల్ని దంచి పొడిలా చేసుకుని వాడటం మంచిదని నిపుణులు అంటున్నారు.

నల్ల మిరియాల టీ:ఈ రోజుల్లో చాలా మంచి టీ తాగడానికి ఆసక్తి ఎక్కువ చూపుతారు. అలాంటప్పుడు బరువు తగ్గాలనుకునేవారికి నల్ల మిరియాల టీ బెస్ట్ ఆప్షన్. ఇందుకోసం ముందు ఒక గిన్నెలో ఒక కప్పు నీరు వేసి.. అందులో ఒక అంగుళం అల్లం ముక్కను పేస్ట్‌లా చేసి వేయండి. దీన్ని ఐదు నిమిషాలు మరిగించి.. ఆ తర్వాత ఫిల్టర్ చేసి ఒక కప్పులో తీసుకోండి. అందులో గ్రీన్ టీ బ్యాగును కొన్ని నిమిషాల నానబెట్టి.. దానికి అర చెంచా నల్ల మిరియాల పొడిని జోడించండి. బాగా కలిపి ఆ తర్వాత తాగితే మంచిది. బరువు తగ్గడంలో ఈ టీ ప్రభావవంతంగా పనిచేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

నల్ల మిరియాలు, తేనె:నల్ల మిరియాలు, తేనె పానీయం డీటాక్స్ గా పనిచేస్తుంది. ఈ డ్రింక్ కోసం ఒక గిన్నెలో కప్పు నీటిని మరిగించండి. ఇప్పుడు దానికి 1 టీస్పూన్ తేనె, 1/2 టీస్పూన్ తాజాగా రుబ్బి పొడి చేసిన నల్ల మిరియాలు జోడించండి. ఈ మిశ్రమాన్ని బాగా కలపాలి. ఆ తర్వాత వడకట్టి.. గోరువెచ్చగా తాగాలి. బ్రేక్ ఫాస్ట్‌కు ముందు ఈ డ్రింక్ తాగితే మంచి ఫలితాలుంటాయి. బరువు తగ్గించడంలో ఈ డ్రింక్ బాగా పనిచేస్తుందని నిపుణుల అభిప్రాయం.

ఇలా కూడా ట్రై చేయవచ్చు

## వేసవిలో చర్మాన్ని కాపాడుకుందాం..!



ఎండలు మండి పోతున్న వేసవిలో చర్మాన్ని కాపాడుకోవటం కూడా చాలా కీలకం. భానుడి ఉగ్రరూపానికి చర్మం ఇట్టే కమిలి పోతుంటుంది. చెమట పొక్కులు మొదలుకొని సెగగడ్డలు దాకా ఎన్నో రకాల సమస్యలు చర్మంపై దాడిచేస్తుంటాయి. జిడ్డు చర్మం, మొటిమలు, వేడి వల్ల చర్మం పొడిబారడం.. ఇలా చెప్పుకుంటే అనేక సమస్యలు ఇబ్బంది పెట్టేవి చాలా ఉన్నాయి. వీటన్నింటి నుంచి విముక్తి పొందడానికి చాలామంది రక రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. చర్మంపై ఎండ ప్రభావంతో ముఖం, కళ్లు జీవం లేనట్లుగా కనిపిస్తుంటాయి. కంటి చుట్టూ నల్లటి వలయాలు, ముఖంలో తాజాదనం లేకపోవడం వంటి సమస్యలు ఎదురవు తుంటాయి. కొన్ని ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించటం ద్వారా మన శరీరాన్ని కాపాడుకోవచ్చు.

మృతకణాలు తొలగించుకోవాలి : చర్మ సౌందర్యాన్ని దెబ్బతీసే వాటిలో మృతకణాలు కూడా ఒకటి. వీటి వల్ల చర్మం డల్‌గా కనిపిస్తుంటుంది. ఇవి చర్మానికి పోషకాలు అందకుండా చేసి చెమట గ్రంథుల్ని మూసుకుపోయేలా చేస్తాయి. ఈ క్రమంలో మొటిమలు, మచ్చలు వంటివి ఏర్పడతాయి. సౌందర్య రక్షణలో భాగంగా వీటిని తొలగించు కోవడం చాలా అవసరం. దీనికోసం స్నానం చేయడానికి ముందు ఏదైనా ఏదైనా నూనెతో చర్మాన్ని మసాజ్ చేసుకోవాలి. ఆ తర్వాత స్నానం చేస్తే కొంతవరకూ మృతకణాలు పోతాయి. చర్మానికి ఎలాంటి హానిలేకుండా సులభంగా వీటిని వదిలించుకోవచ్చు.

మాయిశ్చరైజ్ చేసుకోవాలి : అవాంఛిత రోమాలను ఎప్పటికప్పుడు తొలగించుకోవటం సహజంగా జరిగే ప్రక్రియే. దీనికోసం వివిధ రకాల క్రీములు వాడటం, వ్యాక్సింగ్ చేసుకోవటం వంటివి చేస్తుంటారు. వీటివల్ల చర్మం ఇరిటేట్ అయి ఎరుపెక్కడం, దురదరావడం%ొ%ఇలా పలు సమస్యలు తలెత్తుతాయి. అవాంఛిత రోమాలను తొలగించుకోవడానికి ముందు, ఆ తర్వాత ఆ ప్రదేశంలో చర్మాన్ని మాయిశ్చరైజ్ చేయడం తప్పనిసరి. దీనికోసం చర్మతత్వాన్ని బట్టి మాయిశ్చరైజింగ్ క్రీములను ఎంపికచేసుకోవాలి.

తాజా పండ్లు: వేసవికాలంలో చర్మాన్ని తాజాగా మార్చుకోవడానికి, మెరిపించుకోవడానికి విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. మనం తీసుకునే ఆహారం సైతం మేని మెరుపుపై ప్రభావం చూపుతుంది. మచ్చలేని మెరిసే చర్మం సొంతమవుతుంది.


సన్‌స్క్రీన్ మేలు : బయటకు వెళ్లే ముందు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవటం మంచిది. ఇది ఎండ నుంచి మన శరీరాన్ని కాపాడుతుంది. బయటకు వెళ్లే ముందు ఖచ్చితంగా 20 నిమిషాల ముందే రాసుకుంటే మంచిది. ఇంటికి చేరుకున్న తర్వాత చల్లటి నీటితో ముఖం కడుక్కోవడం, స్నానం చేయటం తప్పనిసరి. చర్మాన్ని తేమగా ఉంచుకోవడానికి మాయిశ్చరైజర్ రాసుకోవడమూ ముఖ్యమే.

వంటింటి చిట్కాలూ మేల

వేసవిలో చర్మంపై టానింగ్ అనేది ప్రతిఒక్కరూ ఎదుర్కొనే సమస్య. ఎండ వేడిమితో అధిక ఉష్ణోగ్రతలతో ఈ సమస్య మరింత ఎక్కువమవుతుంటుంది. సున్నిత చర్మం కలిగిన వారు మరీ ఎక్కువగా ఈ సమస్యను ఎదుర్కొంటుంటారు. సన్‌స్క్రీన్ చర్మాన్ని కొంతవరకూ రక్షించినప్పటికీ ఎక్కువ ప్రభావంతంగా పనిచేయదు. ఫలితంగా చర్మం కాంతి హీనమవుతుంటుంది. అందువల్ల చర్మాన్ని జాగ్రత్తగా కాపాడుకోవడం చాలా ముఖ్యం. కొన్ని వంటింటి చిట్కాలతో చర్మాన్ని ప్రకాశవంతం చేసుకోవటంతోపాటుగా వేడి నుంచి రక్షణ పొందొచ్చు.

బాదం పిండి : బాదం పిండి చర్మాన్ని సురక్షితంగా ఉంచుతుంది. ఈ పిండితో కలబంద రసాన్ని కలిసి స్నానం చేస్తే చర్మంపై టాన్ పోతుంది. ఎక్కువ కాంతివంతంగా కూడా ఉంటుంది.

దోసకాయ : ఇంట్లో ఉండే కూరగాయల్లో దోసకాయ ఒకటి. శరీరానికి నీటిని అందించే కూరగాయ కూడాను. ఇందులో విటమిన్ ఎ, బి 1 ఉండటం వల్ల దోసకాయ శరీరం లోపలే కాదు. బయట కూడా మంచి ప్రభావాన్ని చూపిస్తుంది. వారానికి మూడుసార్లు దోసకాయను ముఖం, మెడ భాగాల్లోనే కాదు. కాలి భాగాల్లో రుద్దినా ప్రభావం కనిపిస్తుంది.



## వర్ష బీభత్సంతో విరిగిపడ్డ కొండచరియలు.. చిక్కుకుపోయిన 1,000 మంది పర్యాటకులు



**సిక్కిం–నవభూమి:** ఈశాన్య రాష్ట్రం సిక్కింలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. ఉత్తర సిక్కింలో నిరంతరం వర్షం పడుతోంది. దీంతో వరదలు సంభవించాయి. భారీ వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో అధికారులు కీలక రహదారులను మూసివేశారు. ఈ కారణంగా వెయ్యి మందికిపైగా పర్యాటకులు అక్కడ చిక్కుకుపోయారు.మున్షితాంగ్ ప్రాంతంలోని లాచెన్–చుంగ్‌తాంగ్ రోడ్డు, లెమా/బాబ్ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. చాలా ప్రాంతాల్లో భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. గాంగ్టక్ నుండి చుంగ్తాంగ్ వరకూ సుమారు 100 కి.మీ. ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున పరిస్థితి మరింత దిగజారింది. కఠినమైన వాతావరణ పరిస్థితులు, కొండచరియలు విరిగిపడటం వల్ల చుంగ్‌థాంగ్‌లో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో ఆయా ప్రాంతాలకు సందర్శకులకు అనుమతించడం లేదు. ఈ పరిస్థితి కారణంగా వెయ్యి మంది పర్యాటకులు అక్కడ చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. రంగంలోకి దిగిన అధికారులు వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

# సిమ్లా ఒప్పందాన్ని నిలిపేసిన పాక్



**శ్రీనగర్––నవభూమి:** కశ్మీర్ ఉగ్రదాడితో దక్షిణాసియాలో వేగంగా పరిస్థితులు మారుతున్నాయి. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. భారత్ ఐదు కీలక నిర్ణయాలు తీసుకోగా.. దీనికి ప్రతిగా పాకిస్థాన్ సిమ్లా ఒప్పందాన్ని రద్దు చేసింది. అసలు ఈ సిమ్లా ఒప్పందం ఏమిటి? దీనిలోని నిబంధనలు ఏమిటి? దీని రద్దు వల్ల భారత్, పాక్ సంబంధాలపై ఎలాంటి ప్రభావం పడుతుంది? యుద్ధానికి దారి తీసే అవకాశం ఉందా? కశ్మీర్లోని పహల్‌గామ్‌లో ఉగ్రదాడి తర్వాత దక్షిణాసియాలో పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి. భారత్, పాకిస్థాన్ మధ్య వివాదం ముదురుతోంది. టెర్రరిస్టుల దాడిని తీవ్రంగా పరిగణించిన భారత్.. పాకిస్థాన్‌పై ప్రతీకార చర్యలకు దిగింది. బుధవారం సాయంత్రం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సీసీఎస్) భేటీలో ఐదు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పాకిస్థానీలకు ఇండియాలోకి నో ఎంట్రీ, సింధు జలాల ఒప్పందాన్ని నిలిపేయడం, అటారీ చెక్ పోస్టు మూసివేత అందులో కీలకమైనవి.

భారత్ తీసుకున్న చర్యలకు ప్రతిగా సెక్యూరిటీ కౌన్సిల్ మీటింగ్‌లో పాక్ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. భారత విమానాలకు తమ గగనతలాన్ని మూసేయడంతోపాటు.. ఇండియాతో వ్యాపారాలను రద్దు చేసుకుంది. అంతేకాకుండా భారత్‌తో అన్ని దౌత్య ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. 1972లో భారత్‌తో కుదుర్చుకున్న సిమ్లా ఒప్పందాన్ని కూడా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది.1972 జూలై 2న భారత్, పాకిస్థాన్ మధ్య సిమ్లాలో కుదిరిన చారిత్రక ఒప్పందమే సిమ్లా ఒప్పందం. 1971లో జరిగిన ఇండో–పాక్ యుద్ధం తర్వాత.. ఇరు దేశాల మధ్య సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావడం కోసం.. భవిష్యత్ సంబంధాలకు ఒక ఫ్రేమ్ ం ఏర్పర్చడం ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశ్యం. ఈ ఒప్పందంపై భారత ప్రధాని ఇందిరా గాంధీ, పాకిస్థాన్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో సంతకాలు చేశారు.

**సిమ్లా ఒప్పందంలోని ముఖ్య నిబంధనలు:**

శాంతియుత పరిష్కారం: తమ మధ్య ఉన్న అన్ని వివాదాలను, సమస్యలను శాంతియుత మార్గాల ద్వారా.. ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి ఇరు దేశాలు అంగీకరిం చాయి. మూడో పక్షం ప్రమేయం లేకుండా సమస్యలను పరిష్కరించుకోవాలనేది భారతదేశం ముఖ్య ఉద్దేశం. యుద్ధ సమయంలో ఇరు దేశాలు ఆక్రమించుకున్న ప్రాంతాల నుండి తమ సైనిక బలగాలను అంతరా ్జతీయ సరిహద్దుల వెంబడి వారి వారి స్థానాలకు సైనిక బలగాలను ఉపసంహరించుకోవాలనే ఈ ఒప్పందంలో పేర్కొన్నారు.1971 యుద్ధం తర్వాత జమ్మూ కశ్మీర్‌లో ఏర్పడిన కాల్పుల విరమణ రేఖను 'నియంత్రణ రేఖ (%ూశీజ%)'గా గుర్తించారు. ఈ రేఖను ఇరు దేశాలు గౌరవించాలని.. దీన్ని దాటడానికి ప్రయత్నించకూడదని ఒప్పందం చేసుకున్నారు. ఎల్‌వోసీ అనేది తుది అంతర్జాతీయ సరిహద్దు కాదు, కేవలం ఆచరణలో ఉన్న రేఖ మాత్రమే. జమ్మూ కశ్మీర్ విషయంలో LoC%ని గుర్తించడమనేది సిమ్లా ఒప్పందంలో కీలకమైన అంశం.

**పర్యవసానాలు ఎలా?**

సిమ్లా ఒప్పందాన్ని నిలిపేయడమనేది భారత్, పాకిస్థాన్ మధ్య సంబంధాలను ప్రతికూలంగా ప్రభావితం చేయనుంది. సిమ్లా ఒప్పందాన్ని రద్దు చేయడమంటే.. నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ)కు కట్టుబడి ఉండటమనేది ప్రశ్నార్థకమే. దీని వల్ల సైనిక సంఘర్షణ తలెత్తే అవకాశంతోపాటు.. ఇరు దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు తలెత్తవచ్చు.

భారత్, పాక్ మధ్య వివాదాలను ద్వైపాక్షికంగా పరిష్కరించుకోవాలనేది సిమ్లా ఒప్పందంలోని ముఖ్య సూత్రం. ఇప్పుడు సిమ్లా ఒప్పందాన్ని పాక్ నిలిపేయడం వల్ల.. కశ్మీర్ లేదా ఇతర సమస్యల పరిష్కారం కోసం పాకిస్థాన్ అంతర్జాతీయ మధ్యవర్తిత్వాన్ని కోరే అవకాశం ఉంటుంది. ఇది భారత్‌కు ఇబ్బందికరమైనప్పటికీ.. ఒకవేళ ఇండియా గనుక ఇతరుల జోక్యాన్ని ఇష్టపడకపోతే.. ఎవరైనా చేసేదేం ఉండకపోవచ్చు.సిమ్లా ఒప్పందాన్ని నిలిపేయడమంటే.. తాము శాంతియుత పరిష్కారానికి కట్టుబడి లేమని అంతర్జాతీయ సమాజానికి పాకిస్థాన్ సంకేతాలు ఇచ్చినట్టే. పాక్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కశ్మీర్ సమస్య మరింత సంక్లిష్టం అవుతుంది.

## ఢిల్లీ నూతన మేయర్‌గా రాజా ఇక్బాల్ సింగ్ ఎంపిక



**న్యూఢిల్లీ–నవభూమి:** ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కు నూతన మేయర్ గా బీజేపీ సీనియర్ నాయకుడు , మాజీ మేయర్ రాజా ఇక్బాల్ సింగ్ ఎంపికయ్యారు. అదేవిధంగా డిప్యూటీ మేయర్ పోస్టును కూడా బీజేపీ కైవసం చేసుకుంది. బీజేపీ అభ్యర్థి జైభగవాన్ యాదవ్ డిప్యూటీ మేయర్ గా ఎన్నికయ్యారు. ఇప్పటికే కేంద్రంలో, ఢిల్లీలో బీజేపీ అధికారంలో ఉంది. ఇప్పుడు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారం కూడా బీజేపీకే దక్కింది. దాంతో ఎంసీడీలో ట్రిపుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటైనట్లయ్యింది.కాగా ఎంసీడీలో మొత్తం సంఖ్య 250. అందులో నుంచి 11 మంది ఎమ్మెల్యేలుగా, ఒకరు ఎంపీగా ఎన్నికయ్యారు. దాంతో ప్రస్తుతం 238 మంది సభ్యులు ఉన్నారు. అందులో బీజేపీ సభ్యులు 117 మంది, ఆప్ సభ్యులు 113 మంది. మిగతా 8 మంది కాంగ్రెస్ సభ్యులు ఉన్నారు. వీరికి తోడు ఢిల్లీకి చెందిన ఏడుగురు లోక్‌సభ్య సభ్యులు, ముగ్గురు రాజ్యసభ సభ్యులు, ఢిల్లీ స్పీకర్ విజేంద్ర సచ్‌దేవ నామినేట్ చేసిన 14 మంది ఎమ్మెల్యేలు ఓటింగ్‌లో పాల్గొన్నారు.సంఖ్యా బలం తక్కువగా ఉన్న కారణంగా ఆమ్ ఆద్మీ పార్టీ ఈ మేయర్ ఎన్నికల్లో పోటీచేయలేదు. ఇవాళ జరిగిన ఓటింగ్‌ను కూడా ఆప్ బహిష్కరించింది. బీజేపీకి 117 మంది కౌన్సిలర్లతోపాటు 10 మంది ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు బలం ఉంది. అంటే బీజేపీ మొత్తం బలం 134గా ఉంది. దాంతో బీజేపీ గెలుపు కాయమని తెలిపోయింది. అందుకే ఆప్ పోటీకి, ఓటింగ్‌కు దూరంగా ఉంది.

## నీట్ పేపర్ లీకేజీ కేసు.. ప్రధాన నిందితుడి అరెస్ట్



**న్యూఢిల్లీ–నవభూమి:** 'నీట్ యూజీ – 2024 ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ కేసులో ప్రధాన నిందితుడైన సంజీవ్ ముఖియా ను ఆర్థిక నేర విభాగం బృందం అరెస్టు చేసింది. గురువారం రాత్రి అతడిని బీహార్ రాజధాని పట్నా లో అరెస్టు చేశామని ఈవోయూ అధికారి నయ్యర్ హుస్సేన్ ఖాన్ వెల్లడించారు.నీట్ పేపర్ లీకేజీ కేసులో సంజీవ్ ముఖియా ప్రధాన నిందుతుడు. పేపర్ లీకేజీ అంశం బయటపడగానే అతడు పరారయ్యాడు. అతడిని పట్టుకునేందుకు బీహార్ ప్రభుత్వం ఇటీవల సంజీవ్‌పై రూ.3 లక్షల నజరానా ప్రకటించింది. ఈ క్రమంలోనే అతడు పట్నాలోని ఒక అపార్టుమెంట్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో అధికారులు అక్కడికి వెళ్లి అతడిని అరెస్టు చేశారు. ముఖియా అరెస్టుతో పేపర్ లీకేజీతో సంబంధం ఉన్న మరింత మంది వ్యక్తుల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉంది.బీహార్‌లోని నలందా జిల్లా నాగర్‌సోనా ప్రాంతానికి చెందిన సంజీవ్ తొలుత సాబూర్ అగ్రికల్చర్ కాలేజీలో పని చేసేవాడు. అక్కడ పేపర్ లీక్ చేసినట్లు ఆరోపణలు రావడంతో 2016లో అతడిపై వేటువేశారు. ఆ కేసులో కొన్నాళ్ల పాటు జైలుశిక్ష కూడా అనుభవించాడు. అనంతరం నలందా కాలేజీ నూర్‌సరయ్ బ్రాంచ్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా చేరాడు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై మధ్యవర్తులు, విద్యార్థులు సహా 14 మందిని బీహార్ పోలీసులు అరెస్టు చేసి విచారించగా.. సంజీవ్ ముఖియా పేరు ప్రధానంగా బయటకొచ్చింది.కాగా సంజీవ్ కుమారుడు శివ్‌కుమార్‌కూ ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్నట్లు తేలింది. అతడు బీహార్ ఉపాధ్యాయ నియామక పరీక్ష పేపర్ లీక్ కేసులో అరెస్టయ్యి ప్రస్తుతం జైల్లో ఉన్నాడు. వీరిద్దరూ 'ముఖియా సాల్వర్ గ్యాంగ్' పేరుతో ఓ ముఠాను ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

## సవతి తల్లికి ఫ్యామిలీ పెన్షన్ ఇవ్వరా?.. ఐఏఎఫ్ రూల్స్‌ను ప్రశ్నించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ–నవభూమి:** సవతి తల్లికి ఫ్యామిలీ పెన్షన్ ఇవ్వాలా వద్దా అన్న అంశాన్ని తేల్చనున్నట్లు సుప్రీంకోర్టు చెప్పింది. భారతీయ వైమానిక దళంలో ఫ్యామిలీ పెన్షన్ రూల్స్ ఎలా ఉన్నాయో తెలుసుకోనున్నట్లు కోర్టు పేర్కొన్నది. జస్టిస్ సూర్య కాంత్, ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఓ కేసులో ఇవాళ వాదనలు విన్నది. ఓ సవతి తల్లి ఆరేళ్ల చిన్నారిని పెంచి పెద్ద చేసింది, అయితే వైమానిక దళంలో ఉద్యోగం సంపాదించిన ఆ వ్యక్తి మరణించాడు. కానీ సవతి తల్లి కావడం వల్ల ఆమెకు ఫ్యామిలీ పెన్షన్ ఇచ్చేందుకు ఐఏఎఫ్ నిరాకరించింది. దీంతో ఆమె కోర్టును ఆశ్రయించింది. ఆ కేసు వాదనల సమయంలో కోర్టు కొన్ని ప్రశ్నలు వేసింది.తల్లి అనే పదానికి విశాలమైన అర్థం ఉన్నదని, నేటి రోజుల్లో ప్రపంచం చుట్టూ ఎంతో జరుగుతోందని, కన్నతల్లి ఒక్కరే పిల్లల్ని పెంచడం లేదని కోర్టు అభిప్రాయపడింది. కన్న తల్లి చనిపోయినప్పుడు, సవతి తల్లి పెంచిందని, అలాంటప్పుడు ఆమె తల్లి కాదా అని జస్టిస్ సూర్య కాంత్ అడిగారు. ఈ కేసులో విచారణను ఆగస్టు 7వ తేదీకి వాయిదా వేశారు. జయశ్రీ అనే మహిళ 2021లో ఆర్మ్డ్ ఫోర్సెస్ ట్రిబ్యునల్‌లో కేసు దాఖలు చేసింది. పెంచిన కొడుకు చనిపోవడంతో ఆమె ఫ్యామిలీ పెన్షన్ కోసం ఎదురుచూసింది. కానీ ఐఏఎఫ్ తన రూల్స్ ప్రకారం ఆ తల్లికి పెన్షన్ ఇవ్వలేకపోయింది. దీన్ని ఆమె కోర్టులో సవాల్ చేసింది.

## తాగి వచ్చి తల్లిని కొడుతున్నాడని.. గొడ్డలితో నరికి తండ్రిని చంపిన కూతురు

**రాయ్‌పూర్–నవభూమి:** నిత్యం తాగి వచ్చి తల్లిని కొడుతున్న తండ్రిని మైనర్ కుమార్తె కడతేర్చింది. గొడ్డలితో నరికి చంపింది. తండ్రిని ఎవరో హత్యచేసినట్లు పోలీసులకు చెప్పింది. అయితే కూతురే తండ్రిని చంపినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో మైనర్ బాలికను అదుపులోకి తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని జష్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బాగ్‌బహార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామంలో నివసించే 50 ఏళ్ల వ్యక్తి హత్యకు గురయ్యాడు. గొడ్డలితో నరికి చంపిన అతడి మృతదేహం మంచంపై పడి ఉన్నట్లు ఏప్రిల్ 22న ఉదయం పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ ఇంటికి వెళ్లి పరిశీలించారు. తన తండ్రిని ఎవరో హత్య చేసినట్లు 15 ఏళ్ల కుమార్తె పోలీసులకు చెప్పింది.కాగా, ఏప్రిల్ 21న రాత్రివేళ తల్లి ఇంట్లో లేకపోవడంతో కూతురు ఒక్కతే ఉన్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. తాగి వచ్చిన తండ్రి ఆమెతో గొడవపడటంతో గొడ్డలితో నరికి చంపిందని దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో మైనర్ బాలికను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు.మరోవైపు నిత్యం తాగి వచ్చి తల్లిని, తనను కొట్టడం, ఇంట్లో గొడవపడటం సహించలేక గొడ్డలితో నరికి తండ్రిని చంపినట్లు కూతురు ఒప్పుకున్నదని పోలీస్ అధికారి తెలిపారు. దీంతో మైనర్ బాలికను జువైనల్ హోమ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.


### టూరిస్టులను కాపాడబోయి ప్రాణాలు కోల్పోయిన స్థానికుడు..

## కొడుకు త్యాగానికి గర్వపడుతున్న తండ్రి!



**శ్రీనగర్–నవభూమి:** జమ్మూ కశ్మీర్ లోని పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రదాడిలో టూరిస్టులను కాపాడే ప్రయత్నంలో ఒక స్థానికుడు, సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా ప్రాణాలు కోల్పోయాడు. తన కొడుకు చేసిన సాహసం గురించి ఆయన తండ్రి హైదర్ షా మాట్లాడుతూ.. "నా కొడుకు చేసిన త్యాగానికి నేను గర్వపడుతున్నాను. ఆ గర్వమే నన్ను బతికిస్తోంది. లేకపోతే, నా చిన్న కొడుకు శవాన్ని చూడగానే నేను చనిపోయేవాడిని. వాడు చూపించిన ధైర్యానికి నేను చాలా సంతోషంగా ఉన్నాను. వాడి వల్ల కొందరి ప్రాణాలు నిలబడ్డాయి. దానికి నేను గర్వపడుతున్నాను." అని చెప్పారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి దేశవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. ఈ దాడిలో అనేకమంది అమాయక టూరిస్టులతో పాటు, వారిని కాపాడే ప్రయత్నంలో సయ్యద్ ఆదిల్ హుస్సేన్ షా కూడా ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుడైన ఆదిల్, ఉగ్రవాదులు కాల్పులు జరుపుతుండగా టూరిస్టులను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలోనే ఉగ్రవాదుల తూటాలకు బలయ్యాడు.ఆదిల్ తండ్రి హైదర్ షా, తన కొడుకు చేసిన సాహసం గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యాడు. ఆదిల్ సాహసం గురించి స్థానికులు కూడా ప్రశంసలు కురిపిస్తున్నారు. "ఆదిల్ చాలా మంచివాడు. ఎప్పుడూ అందరికీ సహాయం చేసేవాడు. టూరిస్టులను కాపాడే ప్రయత్నంలో వాడు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరం" అని ఒక స్థానికుడు తెలిపాడు.పహల్గామ్ ఉగ్రదాడిలో ఆదిల్ చేసిన త్యాగం దేశవ్యాప్తంగా అందరినీ కదిలించింది. సామాన్యుడైన ఆదిల్ ప్రాణాలకు తెగించి టూరిస్టులను కాపాడే ప్రయాత్నం చేయడం ఆయన ధైర్యానికి నిదర్శనం. ఆదిల్ చేసిన త్యాగానికి దేశం మొత్తం సెల్యూట్ చేస్తోంది.

## పహల్గాం ఉగ్రదాడి.. వైరల్ వీడియో ఆ జంటది కాదు!



**శ్రీనగర్–నవభూమి:** పహల్గాంలో జరిగిన దారుణమైన ఉగ్రదాడి దేశవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడంతో దేశం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ ఘటనకు సంబంధించిన అనేక వార్తలు, ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇలాంటి విషాదకర సమయంలో కూడా కొందరు బాధ్యతారాహిత్యంగా తప్పుడు సమాచారాన్ని షేర్ చేస్తున్నారు. తాజాగా.. పహల్గామ్‌లో మరణించిన నేవీ అధికారి వినయ్ నర్వాల్, ఆయన భార్యకు సంబంధించిన ఒక వీడియో వైరల్ అయింది. కానీ, ఆ వీడియోలో ఉన్నది వేరే జంట అని తేలింది. పాకిస్తాన్ పై సొంత దేశంలోనే వ్యతిరేకత పహల్గామ్‌లో ఉగ్రదాడిలో మరణించిన నేవీ అధికారి వినయ్ నర్వాల్, ఆయన భార్య కాశ్మీర్ ప్రకృతి అందాల మధ్యలో ఇద్దరూ ఆనందంగా డ్యాన్స్ చేస్తున్న ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. పెళ్లయిన ఆరు రోజులకే వినయ్ ప్రాణాలు కోల్పోవడంతో ఇది వారు మరణించడానికి ముందు చివరిగా చేసిన వీడియో అంటూ చాలా మంది షేర్ చేశారు. భర్త మృతదేహం వద్ద భార్య రోదిస్తున్న దృశ్యాలు కూడా వైరల్ కావడంతో ఈ వీడియో మరింత వైరల్ అయింది. అయితే ఆ వీడియోలో ఉన్నది వినయ్ నర్వాల్, ఆయన భార్య కాదని తేలింది. ఆ వీడియోలో ఉన్నజంట తమకు జరిగిన ఈ ప్రచారంపై స్పందిస్తూ ఒక వీడియోను విడుదల చేశారు. తాము క్షేమంగా ఉన్నామని.. తమ పై ఉగ్రదాడి జరిగిందని తన భర్త చనిపోయాడని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని వారు స్పష్టం చేశారు. తన భర్త నేవీ అధికారి కాదని కూడా ఆమె చెప్పుకొచ్చారు. తమ పాత వీడియోను ఇప్పుడు వైరల్ చేస్తూ తప్పుడు ప్రచారం చేయడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తంచేశారు. మీడియా సంస్థలు ఇకనైనా ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేయకుండా ఆపాలని వారు విజ్ఞప్తి చేశారు.

## బైసరన్ లోయ తెరిచారని మాకు తెలీదు.. అఖిలపక్ష భేటీలో కేంద్రం!



**న్యూఢిల్లీ–నవభూమి:** పహల్గామ్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడి తర్వాత ప్రతిపక్షాలు కొన్ని అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. భద్రతా బలగాల వైఫల్యం కూడా ఈ దారుణానికి కారణం కావచ్చని అంటున్నాయి. ఇదే విషయాన్న అఖిలపక్ష సమావేశంలో కూడా లేవనెత్తాయి. దీనికి కేంద్రం స్పందిస్తూ కొన్ని ముఖ్యమైన విషయాలు చెప్పినట్లు సమాచారం. ఆ దాడి జరిగిన బైసరన్ లోయకు టూరిస్టులను అనుమతిస్తున్న విషయం అక్కడి అధికారులు భద్రతా సిబ్బందికి చెప్పలేదని ప్రభుత్వం వెల్లడించినట్లు తెలుస్తోంది. కొన్ని ఇంగ్లీష్ మీడియా కథనాలు ఈ విషయాన్ని పేర్కొన్నాయి. పహల్గామ్ ఉగ్రదాడి గురించి ఢిల్లీలో గురువారం అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ ఘటన వెనుక భద్రతా లోపం ఉందని.. దాడి జరిగిన వెంటనే ప్రభుత్వం సరిగా స్పందించలేదని ప్రతిపక్షాలు విమర్శించాయి. దాడి జరిగినప్పుడు భద్రతా బలగాలు, సీఆర్పీఎఫ్ ఎక్కడ ఉన్నాయని చాలా మంది నేతలు ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వం తరఫున ఒక కేంద్ర మంత్రి సమాధానం ఇస్తూ.. సాధారణంగా జూన్ నుంచి మొదలయ్యే అమర్‌నాథ్ యాత్ర వరకు ఆ లోయ దగ్గరకు టూరిస్టులు వెళ్లకుండా ఆంక్షలు ఉంటాయి. కానీ ఈసారి భద్రతా ఏజెన్సీలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే స్థానిక అధికారులు బైసరన్‌కు టూరిస్టులను అనుమతించారు. అంతేకాకుండా ఎత్తులో ఉండే ఆ ప్రాంతానికి చేరుకోవాలంటే 45 నిమిషాలు నడుచుకుంటూ వెళ్లాలి. అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో దానిపై ఎలాంటి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ కూడా లేదు అని వివరించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం చెప్పిన దానికి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం. వేల మంది టూరిస్టులు అక్కడికి వెళ్తుంటే ప్రభుత్వానికి తెలియకపోవడమేంటని ఆయన ప్రశ్నించారట. పహల్గామ్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ బైసరన్ లోయను 'మినీ స్విట్జర్లాండ్' అని పిలుస్తారు. వేసవిలో చాలా మంది టూరిస్టులు ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడి అందమైన పచ్చిక బయళ్లు, దట్టమైన చెట్లు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. సాహసం ఇష్టపడే టూరిస్టులు ట్రెక్కింగ్ ద్వారా, మిగతా వాళ్లు గుర్రాలపై చేరుకుంటారు.

## రైలు పట్టాల వద్ద బోల్టులు తొలగింపు.. గుర్తించడంతో తప్పిన పెను ముప్పు



**చెన్నై–నవభూమి:** రైలు పట్టాల వద్ద బోల్టులు తొలగించి ఉండటాన్ని రైల్వే సిబ్బంది గుర్తించారు. దీంతో ఆ ట్రాక్‌పై వెళ్లాల్సిన రైలును నిలిపివేశారు. ఈ నేపథ్యంలో పెను ముప్పు తప్పిందని రైల్వే అధికారులు తెలిపారు. తమిళనాడు రాజధాని చెన్నై సమీపంలో ఈ సంఘటన జరిగింది. తిరువళంగాడు రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ట్రాక్ అలైన్‌మెంట్‌ను నియంత్రించే పాయింట్ వద్ద కీలకమైనట్లు నట్లు, బోల్టులను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. శుక్రవారం తెల్లవారుజామున 1.15 గంటల సమయంలో సాధారణ తనిఖీ సందర్భంగా రైల్వే సిబ్బంది దీనిని గుర్తించారు. వెంటనే రైల్వే ఉన్నతాధికారులను అలెర్ట్ చేశారు. స్పందించిన స్టేషన్ మాస్టర్ గ్రీన్ సిగ్నల్ నిలిపివేశారు. దీంతో ఆ ట్రాక్‌పై వెళ్లాల్సిన రైలు ఆగిపోయింది.కాగా, ఆటోమేటెడ్ సేఫ్టీ సిస్టమ్ కారణంగా పెను ప్రమాదం తప్పిందని రైల్వే అధికారులు తెలిపారు. తిరువళంగాడు స్టేషన్ మాస్టర్ సిగ్నల్ ప్యానెల్‌పై రెడ్ వార్నింగ్ లైట్ చూసి అప్రమత్తమైనట్లు చెప్పారు. వెంటనే గ్రీన్ సిగ్నల్ నిలిపివేసి వస్తున్న రైలును ఆపివేసినట్లు వివరించారు.ఒకవేళ స్టేషన్ మాస్టర్ సిగ్నల్‌ను క్లియర్ చేసి ఉంటే లూప్ లైన్‌లోకి మళ్లిన ఆ రైలు పట్టాలు తప్పే ప్రమాదం ఉందని రైల్వే అధికారి తెలిపారు. సాంకేతిక సిబ్బందిని అక్కడకు పంపి తొలగించిన నట్లు, బోల్ట్‌లను సరిచేసినట్లు చెప్పారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## భారత్ వైఖరిని ఖండిస్తూ పాకిస్థాన్ సేనేట్‌లో తీర్మానం



**న్యూఢిల్లీ–నవభూమి:** పెహల్గామ్ దాడితో పాకిస్థాన్‌కు లింకున్నట్లు భారత్ చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ.. ఇవాళ పాకిస్థాన్ సేనేట్ లో ఏకగ్రీవ తీర్మానం చేశారు. కశ్మీర్‌లోని పెహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తమ దేశంపై ఆరోపణలు చేయడాన్ని భారత్ ఆపాలని నేషనల్ సెక్యూర్టీ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని తీర్మానంలో పేర్కొన్నారు. డిప్యూటీ ప్రధాని ఇషాక్ దార్ ఆ తీర్మానం ప్రవేశపెట్టారు. పాకిస్థాన్ పూర్తి సామర్థ్యంతో ఉన్నదని, తమ నేలను కాపాడేకునేందుకు సిద్ధంగా ఉందని, జల ఉగ్రవాదమైనా, సైనిక కవ్వింపు అయినా.. ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు దార్ తెలిపారు. అమాయకుల ప్రాణాలు తీయడం పాకిస్థాన్ విలువలకు వ్యతిరేకమని సేనేట్ తన తీర్మానంలో పేర్కొన్నది.

పెహల్గామ్ దాడితో పాకిస్థాన్‌ను లింక్ చేయడాన్ని కూడా ఆ దేశం తప్పుపట్టింది. సింధూ జలాలా ఒప్పందాన్ని సస్పెండ్ చేయడాన్ని కూడా సేనేట్ వ్యతిరేకించింది. చట్టవ్యతిరేకమైన, ఏకపక్ష నిర్ణయమని పేర్కొన్నది. పాకిస్థాన్ ప్రజలు శాంతికి కట్టుబడి ఉన్నారని, ఈ దేశ సార్వభౌమత్వానికి, భద్రతకు, ప్రయోజనాలకు భంగం కలగకుండా చూసుకుంటామన్నారు. పాకిస్థాన్‌తో పాటు విదేశీ గడ్డలపై భారత్ అనేక రకాల ఉగ్రవాదానికి పాల్పడిందని, దానికి ఆ దేశం బాధ్యత వహించాల్సి ఉంటుందని తీర్మానంలో డిమాండ్ చేశారు.

## పహల్గామ్‌లో భద్రతా సిబ్బంది ఎందుకు లేరు?.. కేంద్రం ఏమి చెప్పిందంటే?



**న్యూఢిల్లీ–నవభూమి:** జమ్మూకశ్మీర్‌లో ఎక్కడ చూసినా భద్రతా సిబ్బంది కనిపిస్తారు. అయితే ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది పర్యాటకులు మరణించిన ప్రముఖ పర్యాటక కేంద్రం పహల్గామ్‌లో కనీస భద్రత కూడా లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గురువారం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్ష పార్టీలు ప్రధానంగా ఈ ప్రశ్నను లేవనెత్తాయి. పర్యాటక పచ్చికభూమి అయిన బైసరన్‌లో భద్రతా దళాలు లేకపోవడాన్ని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేవనెత్తారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌తో సహా పలువురు ఈ అంశంపై కేంద్రాన్ని నిలదీశారు. ప్రముఖ టూరిస్ట్ స్పాట్ బైసరన్‌లో భద్రతా సిబ్బందిని ఎందుకు మోహరించలేదని ప్రశ్నించారు.

కాగా, కేంద్ర ప్రభుత్వం చాలా భిన్నంగా సమాధానం ఇచ్చింది. టూరిస్ట్ ఆపరేటర్లపై తప్పును మోపింది. సాధారణంగా జూన్‌లో ప్రారంభమయ్యే వార్షిక అమర్‌నాథ్ యాత్రకు ముందు బైసరన్ ప్రాంతంలో భద్రతా సిబ్బందిని మోహరిస్తారని తెలిపింది. ఆ సమయంలోనే ఈ మార్గాన్ని అధికారికంగా తెరుస్తారని చెప్పింది. దీంతో అమర్‌నాథ్ గుహ మందిరానికి వెళ్లే దారిలో ఉన్న బైసరన్ వద్ద యాత్రికులు విశ్రాంతి తీసుకుంటారని పేర్కొంది. ఈ నేపథ్యంలో కేవలం అమర్‌నాథ్ యాత్ర సమయంలోనే ఇక్కడ భద్రతా బలగాలను మోహరిస్తారని వివరించింది. మరోవైపు స్థానిక టూర్ ఆపరేటర్లు ఏప్రిల్ 20 నుంచే ఈ ప్రాంతానికి పర్యాటకులను తీసుకెళ్లడం ప్రారంభించారని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. దీని గురించి స్థానిక పరిపాలనా యంత్రాంగానికి వారు సమాచారం ఇవ్వలేదని పేర్కొంది. అందుకే ప్రముఖ టూరిస్ట్ స్పాట్ బైసరన్ ప్రాంతంలో భద్రతా దళాలను మోహరించలేదని వెల్లడించింది.

## వర్ష బీభత్సంతో విరిగిపడ్డ కొండచరియలు..

**న్యూఢిల్లీ–నవభూమి:** ఈశాన్య రాష్ట్రం సిక్కింలోభారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. ఉత్తర సిక్కింలో నిరంతరం వర్షం పడుతోంది. దీంతో వరదలు సంభవించాయి. భారీ వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో అధికారులు కీలక రహదారులను మూసివేశారు. ఈ కారణంగా వెయ్యి మందికిపైగా పర్యాటకులు అక్కడ చిక్కుకుపోయారుమున్షితాంగ్ ప్రాంతంలోని లాచెన్–చుంగ్‌తాంగ్ రోడ్డు, లెమా/బాబ్ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. చాలా ప్రాంతాల్లో భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. గాంగ్టక్ నుండి చుంగ్త్రాంగ్ వరకూ సుమారు 100 కి.మీ. ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున పరిస్థితి మరింత దిగజారింది.

నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

12 హైదరాబాద్ శనివారం 26 ఏప్రిల్ 2025






## ఓటీటీలోకి వచ్చేసిన 'మ్యాడ్ స్క్వేర్'.. ఎక్కడ చూడొచ్చంటే!

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నాగవంశీ నిర్మాణంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం మ్యాడ్ స్క్వేర్ . మ్యాడ్ సినిమాకు సీక్వెల్‌గా ఈ చిత్రం రాగా.. మొదటి పార్ట్‌లో నటించిన జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్, సంతోష్ శోభన్ సోదరుడు సంగీత్ శోభన్‌తో పాటు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటించారు. ఈ సినిమాకు కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించగా.. నాగవంశీ నిర్మించాడు. ఏప్రిల్ 01న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌ను అందకుంది. ఇప్పుడు ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ ఓటీటీ వేదిక 'నెట్‌ఫ్లిక్స్' లో ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవు తుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. మ్యాడ్ గ్యాంగ్ ఇంజనీరింగ్ కాలేజ్ కథతో ఫస్ట్ పార్ట్ కంప్లీట్ అవ్వడంతో మ్యాడ్ స్క్వేర్ మొదలవుతుంది. కాలేజీ అనంతరం మనోజ్, అశోక్, దామోదర్ (నార్నే నితిన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్) తమకు నచ్చిన పని చేసుకొనే పనిలో ఉంటారు. అయితే ఈ క్రమంలోనే లడ్డుగాడి(విష్ణు)కి పెళ్లి కుదిరినట్లు మ్యాడ్ గ్యాంగ్‌కి తెలుస్తుంది. దీంతో అతడి పెళ్లికి వెళుతుంది ఈ గ్యాంగ్. అయితే పెళ్లికి అన్ని సిద్ధం అనుకుంటున్న సమయంలో లడ్డు పెళ్లి చేసుకోవాల్సిన అమ్మాయి సడన్‌గా లేచిపోతుంది. దీంతో లడ్డుని పట్టుకుని మ్యాడ్ గ్యాంగ్ పెళ్లి కాకుండానే గోవాకి హనిమూన్ ట్రిప్‌కి వెళతారు. అయితే మ్యాడ్ గ్యాంగ్ గోవాకి వెళ్లిన తర్వాత ఏం జరిగింది. గోవాలోని మ్యూజియంలో గోల్డ్ చైన్ దొంగతనం కేసులో ఈ నలుగురు ఎలా ఇరుక్కుపోయారు? గోవాలో లడ్డూ తండ్రి (మురళీధర్ గౌడ్) ను భాయ్ (సునీల్) ఎందుకు కిడ్నాప్ చేశారు? గోవాలో కలిసిన లైలా ఎవరు? అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే.



## అంత హెల్పింగ్ నేచర్ ఉంటే పాకిస్థాన్‌కి పో.. సమంతపై మళ్లీ ట్రోలింగ్

హీరోయిన్ సమంత మరోసారి వివాదంలో చిక్కుకుంది. పోప్ ఫ్రాన్సిస్ చెప్పారంటూ ఆమె ఇన్‌స్టాలో చేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఆమె పోస్ట్‌కి కౌంటర్‌గా ఓ నెటిజన్ పరుష పదజాలంతో ట్వీట్ చేయగా.. నెటిజన్లు అతడికి సపోర్ట్ చేస్తున్నారు. సమంతకి అంతగా సాయం చేయాలని అనిపిస్తే పాకిస్థాన్‌కి వెళ్లిపోవచ్చని కౌంటర్ ఇస్తున్నారు. కొందరేమో పోప్ ఫ్రాన్సిస్‌కి నివాళిగా సమంత పోస్ట్ చేస్తే కొందరు కావాలనే దాన్ని రచ్చ చేస్తున్నారని అంటున్నారు.

అంత హెల్పింగ్ నేచర్ ఉండే పాకిస్థాన్‌కి పో హీరోయిన్ సమంత ఏం చేసినా సరే దాని చుట్టూ ఏదో ఒక రచ్చ జరుగుతూనే ఉంటుంది. మరీ ముఖ్యంగా ఆమె సోషల్ మీడియాలో పెట్టే పోస్టులు, చేసే కామెంట్లు హాట్ టాపిక్‌గా మారుతుంటాయి. అయితే కొన్నిసార్లు ఆమె ఏదో అనుకుని పోస్టులు పెడితే నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకుని చీవాట్లు పెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇలాగే ఇన్‌స్టాలో ఆమె పెట్టిన పోస్టు ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది.'నదులు తమ నీటిని తాము తాగవు. చెట్లు తమ పండ్లను తినవు. సూర్యుడు తన కోసం ప్రకాశించడు. పువ్వులు తమ సువాసనను తాము పీల్చకోవు. ఇతరుల కోసం జీవించడమే ప్రకృతి నియమం. మనమందరం ఒకరికొకరు సహాయం చేసుకోవడానికి పుట్టాం. ఎంత కష్టమైనా సరే... సంతోషంగా ఉన్నప్పుడే జీవితం బాగుంటుందిబీ కానీ మీ వల్ల ఇతరులు సంతోషంగా ఉంటే ఇంకా మంచిది' అని పోప్ ఫ్రాన్సిస్ చెప్పారంటూ సమంత ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టింది.అయితే సమంత పోస్ట్‌ని స్క్రీన్ షాట్ తీసిన పెద్ది రెడ్డి అనే ఓ నెటిజన్.. దాన్ని ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ ఆమెపై నోరుపారేసుకున్నాడు. 'విడాకులు తీసుకుంది, రోగం వచ్చింది అని సమంత మీద కాస్త సాఫ్ట్ కార్నర్ ఉండేది.. సాయం చేయడానికి వాళ్లేమైనా మనుషులు అనుకున్నావా తీవ్రవాదులు. నీకు అంత హెల్పింగ్ నేచర్ ఉంటే పాకిస్థాన్‌కి వెళ్లి చేసిరా.. అంతేగాని ఇక్కడ మాట్లాడకు' అంటూ తీవ్ర పదజాలంతో రెచ్చిపోయాడు. ఈ ట్వీట్ ఆధారంగా చాలామంది నెటిజన్లు సమంతని ట్రోల్ చేస్తుండగా.. మరికొంతమంది ఆమెకి సపోర్ట్ చేస్తున్నారు.

## కోలీవుడ్‌లో సిక్స్ ప్యాక్‌ల పంచాయతీ



ఇప్పుడు కోలీవుడ్‌లో సిక్స్ ప్యాక్ పంచాయతి చర్చనీయాంశంగా మారింది. కొద్దిరోజుల క్రితం చెన్నైలో జరిగిన రెట్రో ప్రీ రిలీజ్ ఈవెంట్ లో హీరో సూర్య తండ్రి శివకుమార్ మాట్లాడుతూ కోలీవుడ్ లో మొదటి సిక్స్ ప్యాక్ తన బిడ్డే చేశాడని, గతంలో ఎవరు చేయలేదని కాస్త ఎమోషనల్‌గా మాట్లాడాడు. కొడుకు గొప్పదనం గురించి శివకుమార్ మాట్లాడుతూ.. నా కొడుకు కన్నా ముందు తమిళంలో సిక్స్ ప్యాక్ ఎవరు చేయలేదని, ఉంటే చెప్పాలని శివ కుమార్ యాంకర్స్‌ని కూడా ప్రశ్నించాడు. గంటలకు గంటలు డాన్స్ ప్రాక్టీస్ చేస్తూ, జిమ్‌లో వర్కౌట్లు చేయబట్టే సూర్య ఈ స్థాయికి వచ్చాడని అన్నాడు శివకుమార్

అయితే శివకుమార్ కాస్త అత్యుత్సాహం ప్రదర్శిస్తూ అలా మాట్లాడాడని కొన్ని విమర్శలు వస్తున్నాయి. అదే సమయంలో సూర్య కంటే ముందు ధనుష్, విశాల్ సిక్స్ ప్యాక్ బాడీని ట్రై చేశారని, సూర్య ముందు సిక్స్ ప్యాక్ చేశాడని ఆయన తండ్రి చెప్పడం ఏమి బాలేదంటూ కొందరు వాపోతున్నారు. గౌతమ్ మీనన్ చేసిన సూర్య సన్ ఆఫ్ కృష్ణన్ చిత్రంలో సూర్య పూర్తిగా సిక్స్ ప్యాక్‌లోనే ఉంటాడు. అయితే సూర్య సన్ ఆఫ్ కృష్ణన్ కంటే ముందు విశాల్ సత్యం సినిమా రిలీజ్ అయిందని, అందులో విశాల్ సిక్స్ ప్యాక్ లుక్‌లోనే కనిపిస్తాడని చర్చ నడుస్తుంది. ఈ క్రమంలోనే ఓ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో విశాల్ దీనిపై స్పందించాడు. అందరి కంటే ముందుగా సిక్స్ ప్యాక్ ట్రై చేసింది ధనుష్ అని.. వెట్రిమారన్ మూవీ కోసం ఎంతో కష్టపడ్డాడు అని విశాల్ అన్నాడు.. ఆ తరువాత సత్యం మూవీ కోసం తాను సిక్స్ ప్యాక్ చేశానని అన్నాడు. ఆ లుక్‌తోనే మదగజరాజా సినిమాలోనూ నటించాను. ఆ విషయాలను వాళ్లు మర్చిపోయి ఉండవచ్చు అని విశాల్ అన్నాడు. శివ కుమార్ వ్యాఖ్యలకు విశాల్ కౌంటర్ ఇవ్వడంతో ప్రస్తుతం ఈ విషయమై కోలీవుడ్‌లో మరింత రచ్చ జరుగుతోంది. సూర్య అభిమానులు వర్సెస్ విశాల్, ధనుష్ అభిమానులు అన్నట్లుగా సోషల్ మీడియాలో వార్ నడుస్తుంది. కొందరు అయితే ధనుష్‌ది సిక్స్ ప్యాక్ అంటారా అంటూ విమర్శిస్తున్నారు. మరి ఆరు పలకల దేహానికి సంబంధించిన వార్‌కి ఎప్పుడు ఫుల్‌స్టాప్ పడుతుందో చూడాలి.

## డ్రాగన్‌లో శ్రుతీహాసన్.. గ్లామర్ కోసమేనా..

ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' చిత్రం రూపుదిద్దుకొంటున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం భారీ యాక్షన్స్ సీన్స్ చిత్రీకరిస్తున్నారు. ఇది పెద్ద షెడ్యూల్ అని తెలుస్తోంది. ఈ చిత్రంలో ఓ ఐటెమ్ సాంగ్ ఉందని ప్రచారం సాగుతోంది. ఇందులో శ్రుతిహాసన్ కనిపించబోతోందని చిత్ర వర్గాల నుంచి టాక్. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన సలార్ చిత్రంలో శ్రుతీ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. 'సలార్ 2'లోనూ శ్రుతి కనిపించబోతోంది. ఇప్పుడు ఆ సెంటిమెంట్ ని ప్రశాంత్ నీల్ రిపీట్ చేయబోతున్నాడని తెలుస్తోంది.మామూలుగా ప్రశాంత్ నీల్ సినిమాల్లో యాక్షన్‌కి చోటు ఉంటుంది కానీ పాటలకు అంత స్కోప్ ఉండదు. అయితే ఈ చిత్రంలో ఎన్టీఆర్ కోసం ఓ పాటను పెట్టినట్లు తెలుస్తోంది. ప్రశాంత్ నీల్ సినిమాల్లో ఇంతకు ముందు లేనని పాటలు ఈ చిత్రంలో ఉంటాయని కూడా సమాచారం. వాటిలో శ్రుతీహాసన్ ప్రత్యేక గీతం కూడా ఒకటి. ఈ చిత్రంలో తారక్ సరసన కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తోంది. రుక్మిణీ వసంత్ ఈ చిత్రంలో కథానాయికగా నటించబోతోంది. ఇందులో రుక్మిణిది సాధారణ పాత్ర కాదని, కాస్త టిపికల్‌గా ఉండే పాత్రని అందుకే గ్లామర్ కోసం శ్రుతిహాసన్‌తో సాంగ్ ప్లాన్ చేశారని సమాచారం. టాకీ పార్ట్ పూర్తయిన తరువాత ఈ పాటని తెరకెక్కిస్తారు.



## ఇన్‌డైరెక్ట్ హింట్.. మే మధ్యలో వేడి గాలులు..



ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'ది రాజాసాబ్' . మారుతి దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. నిధీ అగర్వాల్, మాళవిక మోహనన్ కథానాయికలు. ప్రస్తుతం చిత్రీ కరణ దశలో ఉందీ సినిమా. మే నెలలో టీజర్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తునట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. ఇప్పుడీ అంశంపై దర్శకుడు మారుతి సోషల్ మీడియా వేదికగా ఇన్‌డైరెక్ట్‌గా హింట్ ఇచ్చారు. తాజాగా ఆయన ఓ ఆటో వెనకున్న 'రాజాసాబ్..' పోస్టర్‌ను ఎక్స్‌లో షేర్ చేసి దానికి "హై అలర్ట్.. మే మధ్య నుంచి వేడి గాలులు మరింత పెరగనున్నాయి" అని పోస్టులు పేర్కొన్నారు.దీంతో మే మిడ్‌లో ఈ చిత్ర టీజర్ విడుదల కానుందని పరోక్షంగా స్పష్టత వచ్చింది. ఇప్పటికే ఈ టీజర్‌కు సంబంధించిన గ్రాఫిక్స్ పనులు పూర్తయ్యాయని.. విదేశాల నుంచి ప్రభాస్ తిరిగి రాగానే తనతో డబ్బింగ్ పూర్తి చేసి టీజర్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తారని చిత్ర వర్గాలు నుంచి సమాచారం. రొమాంటిక్ కామెడీ హారర్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో ప్రభాస్ రెండు విభిన్న పాత్రల్లో కనిపిస్తారని టాక్.

## శివనామస్మరణతో ఇండియా మోతెక్కాల్సిందే!




శివయ్యపై సినిమాలు కొత్తేం కాదు. శివుడిపై నాటి రోజుల్లో ఎన్నోహిట్ చిత్రాలున్నాయి. ఆ తర్వాత కాలంలో ట్రెండ్ కు తగ్గట్టు శివయ్యపై సినిమాలొచ్చాయి. అయితే ఇప్పుడు మరింత అడ్వాన్స్ గా శివనాస్మరణను టాలీవుడ్ ఎన్ క్యాష్ చేసుకుంటుంది. పౌరాణిక-ఫాంటసీ చిత్రాలు ట్రెండ్ గా మారడంతో? శివయ్యను ఎక్కువగా హైలైట్ చేస్తున్నారు. ఇటీవలే తమన్నా నటించిన ఓదెల2 అలాంటి కాన్సెప్ట్ తోనే తెరకెక్కింది. అలాగే శివం భజే శివుడు కీలకంగా రూపొందింది. ఈ రెండు ఈ మధ్య కాలంలో రిలీజ్ అయి మంచి ఫలితాలు సాధించాయి.

తాజాగా పాన్ ఇండియాలో శివ నామస్మరణకు రంగం సిద్ధమవుతోంది. మంచు విష్ణు ప్రతిష్టాత్మ కంగా కన్నప్ప ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించిన సంగతి తెలిసిందే. మంచు ఫ్యామిలీకి ఈ సినిమా ఓ డ్రీమ్ ప్రాజెక్ట్. ఎంతో కాలంగా కన్నప్ప తీయాలని ప్లాన్ చేసుకుని చివరిగా ఈ ఏడాది రిలీజ్ కి రెడీ అవుతోంది. భయం వెంటాడుతుం దంటున్న అనుపమ ఇందులో శివుని భక్తుడు కన్నప్ప కథ ఆధారంగా తెరకెక్కింది. భారీ కాన్వాస్ పై రూపొందుతున్న చిత్ర మిది. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, మోహన్ బాబు, మధు ప్రీతి ముకుందన్ లాంటి స్టార్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో సినిమాకు పాజిటివ్ బజ్ మొదలైంది. సిజీ పనులు ఆలస్యమవుతోన్న నేపథ్యంలో రిలీజ్ డిలే అవుతోంది. జూన్ 27న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. అలాగే పాన్ ఇండియాలో నటసింహ బాలకృష్ణ నటిస్తోన్న అఖండ2 మరింత ప్రతిష్టా త్మకంగా రిలీజ్ అవుతుంది. బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తోన్న చిత్రంలో బాలయ్య అఘోరిపాత్రలో విశ్వరూపం చూపించబోతున్నారు. ప్రత్యేకంగా కుంభమేళా కూడా కలిసి రావడంతో? అక్కడ సన్నివేశాలు సినిమాకు హైలైట్ గా ఉంటాయని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. అఘోర పాత్రలో బాలయ్య నట విశ్వరూపం చూపిస్తారని అంచనాలు భారీగా ఉన్నాయి. అలాగే సుధీర్ బాబు హీరోగా నటించిన జటాధర కూడా శివుడి కాన్సెప్ట్ ని ఆధా రంగా చేసుకునే తెరకెక్కించారు. ఇంకా యంగ్ హీరోలు సాయి శ్రీనివాస్ నటిస్తోన్న హైంధవ, అరవింద్ కృష్ణ నటిస్తోన్న ఎ మాస్టర్ పీస్ శివుడి కథ ఆధారంగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం.

## ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నామంటూ అంగీకరించినట్లే.. పాక్ ఉప ప్రధాని వ్యాఖ్యలపై డానిష్ కనేరియా ఫైర్



**న్యూఢిల్లీ-నవభూమి:** పెహల్‌గామ్‌లో ఉగ్రదాడిపై పాకిస్థాన్ విదేశాంగ మంత్రి, ఉప ప్రధాని ఇషాక్ దార్ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. పర్యాటకులపై దాడి చేసిన ఉగ్రవాదుల్ని 'స్వాతంత్ర్య సమరయోధులు' గా ఆయన అభివర్ణించారు. దీంతో ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదాస్పదమయ్యాయి. ఆయన వ్యాఖ్యలపై ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా తాజాగా స్పందించారు. ఈ మేరకు ఇషాక్ దార్‌పై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు.

ఉప ప్రధాని వ్యాఖ్యలు ఉగ్రవాదుల్ని ప్రోత్సహిస్తున్నామంటూ అంగీకరించినట్లే అని పేర్కొన్నారు. 'పాకిస్థాన్ ఉప ప్రధాన మంత్రి ఇషాక్ దార్.. ఉగ్రవాదులను స్వాతంత్ర్య సమరయోధులు అంటూ సంబోధించారు. ఇది అవమానకరమైనది. అంతేకాదు.. ఉగ్రవాదానికి మేం మద్దతిస్తున్నాం, ప్రోత్సహిస్తున్నామంటూ బహిరంగంగా అంగీకరించడమే' అని అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కనేరియా పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది.అంతకు ముందు పాక్ ప్రధానిపై కనేరియా నిప్పులు చెరిగిన విషయం తెలిసిందే. పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్నారని వ్యాఖ్యానించారు. కశ్మీర్ పెహల్‌గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని ఎక్స్‌లో తీవ్రంగా ఖండించిన కనేరియా పాక్ ప్రధానిపై నిప్పులు చెరిగారు. 'పెహల్‌గామ్ దాడిలో పాకిస్థాన్ ప్రమేయం లేకుంటే ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఎందుకు ఖండించలేదు. ఈ ఘటనపై ఎందుకు మౌనంగా ఉన్నారు. సరిహద్దుల్లో భద్రతా బలగాలను ఎందుకు అప్రమత్తం చేశారు. నిజమేంటో మీకు తెలుసు. ఉగ్రవాదులను మీరు పెంచి పోషిస్తున్నారు' అని అన్నారు.

## పాక్ అథ్లెట్ హర్షద్ నదీమ్‌కు ఆహ్వానం.. వివాదంపై వివరణ ఇచ్చిన నీరజ్ చోప్రా



**న్యూఢిల్లీ-నవభూమి:** జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ మెడల్ విజేత నీరజ్ చోప్రా క్లారిటీ ఇచ్చారు. బెంగుళూరులో జరిగే ఈవెంట్‌కు పాకిస్థాన్ జావెల్ త్రోయర్ హర్షద్ నదీమ్‌ను ఆహ్వానించిన ఘటనపై స్పందించారు. కశ్మీర్‌లో ఉగ్రదాడి జరగడానికి ముందు తాను ఆ ఆహ్వానం పంపినట్లు నీరజ్ తెలిపాడు. నీరజ్ చోప్రా క్లాసిక్ జావెలిన్ త్రో ఈవెంట్‌కు రావాలని నదీమ్‌కు ఆహ్వానం పంపారు. కానీ ఆహ్వానం పంపిన రెండు రోజుల వ్యవధిలోనే ఉగ్రవాదులు కశ్మీర్‌లో దాడికి పాల్పడ్డారు. దీంతో నీరజ్ చోప్రాపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇక సోషల్ మీడియాలో నీరజ్ ఫ్యామిలీపైన కూడా ట్రోల్స్ మొదలయ్యాయి.ఎన్‌సీ క్లాసిక్ ఈవెంట్ ద్వారా ఉత్తమ అథ్లెట్లను ఇండియాకు తీసుకురావాలన్నదే తన ఉద్దేశం అని, వరల్డ్ క్లాస్ స్పోర్టింగ్ ఈవెంట్‌లను నిర్వహించాలని భావిస్తున్నామని, సోమవారం రోజే అథ్లెట్లకు అందరికీ ఆహ్వానాలు వెళ్లాయని, పెహల్గామ్ దాడికి రెండు రోజుల ముందే ఆహ్వానాలు పంపినట్లు నీరజ్ తన ఎక్స్ అకౌంట్‌లో చెప్పాడు. ఉగ్రదాడి ఘటన తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు.. తమ కుటుంబాన్ని బాధించినట్లు చెప్పాడు. దేశ గౌరవాన్ని ఉన్నత స్థాయికి చేర్చిన తనకు ఇప్పుడు సమాధానం ఇచ్చుకోవాల్సి వస్తోందని, తన కుటుంబాన్ని టార్గెట్ చేయడం నిరుత్సాహానికి గురి చేస్తున్నదని, మేం చాలా సాధారణ వ్యక్తులమని, మరో విధంగా తమను చిత్రీకరించవద్దు అని నీరజ్ చోప్రా తెలిపాడు.



## రాబోయే 78,000 ఏళ్లు కూడా మార్పేమి ఉండదు.. ఉగ్రదాడి నేపథ్యంలో సునీల్ గవాస్కర్ కామెంట్



**న్యూఢిల్లీ-నవభూమి:** మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్.. పెహల్గామ్ ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు. బెంగుళూరులో గురువారం ఆర్సీబీ, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ జరిగిన సమయంలో ఆయన మాట్లాడుతూ కొన్ని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. భారతీయులపై ఆ ఘటన తీవ్ర ప్రభావం చూపిందన్నారు. దాడికి పాల్పడిన కుట్రదారుల్నిఓ ప్రశ్న అడగాలనుకుంటున్నానని, ఉగ్రవాదులకు ఊతం ఇస్తున్న వారిని కూడా ఓ ప్రశ్న వేయాలనుకుంటున్నానని, ఈ ఫైటింగ్‌తో ఏం సాధించామని, గత 78 ఏళ్లలో ఒక్క ఇంచు భూమి కూడా మారలేదని, అంటే రాబోయే 78 వేల ఏళ్లకు కూడా ఎటువంటి మార్పు ఉండబోదని , మరి అలాంటప్పుడు శాంతియుతంగా ఎందుకు జీవించడం లేదని గవాస్కర్ ప్రశ్నించారు. దేశాన్ని ఎందుకు బలోపేతం చేయడం లేదని అడగారు. స్టార్ స్పోర్ట్స్‌లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పెహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది పర్యాటకులు మృతిచెందారు. దాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకున్నది. సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. దీన్ని పాకిస్థాన్ సీరియస్‌గా తీసుకుని.. దౌత్య సంబంధాలను బ్రేక్ చేసింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**